
'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 291

గురువారం 11-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


ప్రెస్టీజ్
న్యూ ఇయర్
బొనాంజా
ఈ న్యూ ఇయర్ కి
ప్రెస్టీజ్ వారి విప్లవాత్మక ప్రొడక్ట్స్‌ని
ఇంటికి తీసుకురండి.
*ఈ ఆఫర్ డిసెంబరు 23, 2023 నుండి జనవరి 28, 2024 వరకు మాత్రమే.
75 Years of Prestige
భారతదేశంలో మొట్ట మొదటి చిందటం
నివారించే ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్
LASTS A LIFETIME
Prestige FLIP-ON
లాక్
అన్‌లాక్
ఏదైనా (3L అంతకంటే ఎక్కువ) ఫ్లిప్ ఆన్ ట్రై ప్లై ప్రెషర్ కుక్కర్ (1 యూనిట్) కొనుగోలు చెయ్యండి మరియు ₹2 150.00 విలువగల ఒమేగా డీలక్స్ గ్రానైట్ ట్విన్ ప్యాక్ (1 సెట్) ఉచితంగా పొందండి (కాన్‌కేవ్ తవ 25 సె.మి (1 యూనిట్) మరియు ఫ్రై ప్యాన్ 20 సె.మి (1 యూనిట్))
ట్రై ప్లై ఔటర్ లిడ్ మరియు ఇన్నర్ లిడ్ సిరీస్ (3L అంతకన్నా ఎక్కువ) పై కూడా ఈ ఆఫర్ వర్తిస్తుంది.
భారతదేశంలో మొట్ట మొదటి ఆటోమేటిక్
విజిల్ కౌంటర్ ఇండక్షన్ కుక్‌టాప్ తో
మీ వంట మరింత పర్ఫెక్ట్ గా చెయ్యండి
Prestige
AUTOMATIC WHISTLE COUNTER
INDIA'S ONLY INDUCTION WITH WHISTLE COUNTER
ఏదైనా విజిల్ లెక్కించే ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) కొనండి మరియు పాపులర్ స్వచ్ఛ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్ (5L) (1యూనిట్) MRP పై 15% డిస్కౌంట్ మరియు ₹500.00 తగ్గింపు పొందండి
విప్లవాత్మక
ఈజీ క్లీన్ డిజైన్
ఎత్తండి
క్లీన్ చేయండి
ఏదైనా స్వచ్ఛ్™ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 15% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹2 895.00 విలువగల ఎక్స్‌ప్రెస్ ఇండక్షన్ కుక్‌టాప్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
14 విధాలుగా పనిచేసే
ఆల్ ఇన్ వన్
మిక్సర్ గ్రైండర్
POWERFUL 1000W MOTOR
5 YEAR WARRANTY ON MOTOR
14 Functionalities
ఎండ్యూరా ప్రో మిక్సర్ గ్రైండర్ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి
అంతే కాదు ₹1 795.00 విలువగల సాండ్‌విచ్ మేకర్ (1 యూనిట్) ఉచితంగా పొందండి.
ఈ ఆఫర్ ఎండ్యూరా 3, 4, 6 జార్ మిక్సర్ గ్రైండర్ మరియు డిలైట్ ప్రో మిక్సర్ గ్రైండర్ పై కూడా వర్తిస్తుంది.
ప్రవేశ పెడుతున్నాం
ఇండియాలోనే
మొట్ట మొదటి సేఫ్ సెన్స్
టెక్నాలజీ™ కలిగిన చిమ్నీ
ఆటోమేటిక్ పొగ మరియు గ్యాస్ లీక్ ని కనిపెడుతుంది.
SafeSense™ technology
Controlled through Mobile App - Prestige Smart Chef App
అస్పైర్ సేఫ్ సెన్స్ చిమ్నీ (1 యూనిట్) కొనండి మరియు MRP పై 25% డిస్కౌంట్ పొందండి
అంతే కాదు ₹14 145.00 విలువగల రాయల్ ప్లస్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ (4B) (1 యూనిట్) ఉచితంగా పొందండి
ఒమేగా డీలక్స్ గ్రానైట్ కుక్ వేర్ సెట్, ఇండియాలోనే మొట్ట మొదటి 5 - లేయర్స్ డ్యూరబల్ నాన్ స్టిక్
ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 పీస్ కుక్‌వేర్ (1 సెట్) కొనండి మరియు MRP పై 20% డిస్కౌంట్ పొందండి అంతే కాదు ₹1 780.00 విలువగల స్వచ్ఛ్ పాపులర్ ప్లస్ అల్యూమినియం ప్రెషర్ కుక్కర్ (3L) (1 యూనిట్) ఉచితంగా పొందండి
*నిబంధనలు వర్తించును. పైన ఇచ్చిన ధరలన్నీ ప్రొడక్ట్ యొక్క MRP (అన్ని టాక్స్ లు కలిపి). MRP పై మాత్రమే డిస్కౌంట్స్ వర్తిస్తాయి. ఏ రెండు ఆఫర్స్ కలపకూడదు. సెలెక్టెడ్ మోడల్స్ స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఎంచుకోబడిన స్టోర్స్‌లో మాత్రమే ఆఫర్ వర్తిస్తుంది. ఒమేగా డీలక్స్ గ్రానైట్ 4 pc కుక్‌వేర్ (1 సెట్) లో ఫ్రై ప్యాన్ – 24cm (1 యూనిట్), గ్లాస్ లిడ్ కలిగిన కడాయి – 28cm (1 యూనిట్), ఓమ్ని తవా – 28cm (1 యూనిట్) మరియు గ్లాస్ లిడ్ కలిగిన మిల్క్ ప్యాన్ – 16cm (1 యూనిట్) ఉంటాయి. ఆఫర్ ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ లో మాత్రమే వర్తిస్తుంది. ప్రెస్టీజ్® లోగో ఇది ఇండియాలో టిటికె ప్రెస్టీజ్ లిమిటెడ్ వారి ట్రేడ్ మార్క్. నిబంధనలు మరియు షరతులకు సంబధించిన మరిన్ని వివరాలు కోసం మీ సమీపంలోని ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూజివ్/డీలర్ అవుట్లెట్ కి విచ్చేయండి లేదా మా వెబ్ సైట్ https://shop.ttkprestige.com/new-year-offer-tc ను సందర్శించండి.
Prestige®
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.
CUSTOMER CARE NO 080-6000 4411
Follow 'TTK Prestige' on
PRESTIGE XPERT on WhatsApp 97423 34411
Shop Online on shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
Vijayawada: Autonagar Gate, Ph: 08663562598, 7989820951; Benzcircle: Ph: 08662491766, 9390654466; Kanuru: Ph: 9618054555, 9052692111; Eluru Road: Ph: 08662435055, 9390654455; Gunadala: Ph: 0866-2457111, 9247565335; Gurunanak Colony: Ph: 8790942345; Ramavarapadu: Ph: 9866212121; Bhavanipuram: Ph: 08662414007, 9581221111; Penamaluru: Ph: 8121058866, 9618054555; Gudivada: Nehru Chowk Main Road, Ph: 9703602555.
Vijayawada: Lingeswara Steel Distributors, Ph: 2424245; Summit Smart Kitchen, Ph: 8790455584; Sri Bhavani Steel Corner, Ph: 2572255; Grand Modern Super Market, Ph: 6667720; Pai International, Ph: 9704066433; Smart E World: Ph: 8977079998; Sri Venkateswara Metal House, Ph: 2561546; Maaraj, Ph: 2439888; Gupta Enterprises, Ph: 9959520850; Ranga Brothers, Ph: 9440185844; Gudivada: G K Electronics, Ph: 7075663333; Srinivasa Electronics, Ph: 246554; Laxmi Tv Stores, Ph: 9491647025; Sri Venkateswara Steel, Ph: 9849465863; Balarka Steel, Ph: 9849664444; Hanuman Junction: Maruthi Electronics, Ph: 244466; Nandigam: Om Bhaskara Watch & Electronics, Ph: 257707; RI Electronics, Ph: 9652152121; Balaji Home Needs, Ph: 9603005888; Vuyyuru: Raja Rajeswari Fur & Elec, Ph: 8885684685; Nagasiva Electronics, Ph: 9573129145; Machilipatnam: S.V.K Emporium, Ph: 223040; New S V R & Co, Ph: 223567; Vamsi Electronics, Ph: 9966674444; Mylavaram: Kamadhenu Electronics, Ph: 9963660299; Tiruvur: Kamadhenu Electronics, Ph: 9494889012; Surya Sonovision, Ph: 7989610345; Udaysteel, Ph: 9951185422; Vissanapeta: Ganesh Radio, Ph: 9885070067; Swamy Enterprises, Ph: 9885691803; Sairam Enrerprises, Ph: 9908134660; Nuzividu: Himalaya Elec, Ph: 7013939584; Krishna Metal, Ph: 9989177737; Sri Vatsa Electronics, Ph: 9848023514; Dln Electronics, Ph: 9100011101. Regional Service Centre: Ph: 0866 2484377.


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 291

గురువారం 11-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ప్రపంచకప్‌కు ముందొకసారి..

ద్వైపాక్షిక టి20 సిరీస్ బరిలో భారత్.. నేడు అఫ్గాన్‌తో తొలి మ్యాచ్ - స్పోర్ట్స్‌లో



లాభాల్లోకి మార్కెట్లు

సెన్సెక్స్ 271 పాయింట్ల లాభం.. నిఫ్టీ 74 పాయింట్లు అప్ - బిజినెస్‌లో



'జమిలి'కి 5,000 సూచనలు

జమిలి ఎన్నికలకు సంబంధించి ఏర్పాటైన మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీకి 5,000కు పైగా సూచనలు అందాయి.

వివరాలు 6లో ▸



ప్రారంభోత్సవానికి దూరం..

అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్టకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ నేతలు ఖర్గే, సోనియా నిర్ణయించుకున్నారు.


వివరాలు 6లో ▸



కొందరినే అనుమతిస్తాం

కాంగ్రెస్ నేత రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు మణిపూర్‌లోని బీజేపీ సర్కారు షరతులతో అనుమతిచ్చింది.

వివరాలు 6లో ▸



విశ్వమిత్ర భారత్

ప్రపంచంలో అనిశ్చితి పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్ నూతన ఆశా రేఖగా ఆవిర్భవించిందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸

టీడీపీ కకావికలం

తమ్ముళ్ల హాహాకారాలు.. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు కరువు

ఎంపీ కేశినేని నాని బాటలోనే టీడీపీకి గుడ్‌బై చెబుతున్న నేతలు

- డబ్బు మూటలే అర్హతగా సమన్వయకర్తల నియామకం
- మరోవైపు టీడీపీ-జనసేన మధ్య పొత్తు కుంపట్లు.. అనేక నియోజకవర్గాల్లో కుదరని సయోధ్య
- ఘోర పరాజయం తప్పదని పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం

4లో

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి రాజకీయం అంతా నాటి నుంచి నేటి వరకు డబ్బుతోనే ముడిపడి సాగుతోంది. అభ్యర్థులను డబ్బు మూటలతో తూకం వేస్తుండటం ఆ పార్టీ సీనియర్ నేతలను నివ్వెర పరుస్తోంది. ఒక్కచోట కూడా గెలవని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను పక్కన పెట్టుకుని అడుగులు ముందుకు వేస్తుండటం పట్ల అత్యధిక నియోజకవర్గాల్లో నేతల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. దీనికి తోడు మాలోకం లోకేశ్ తీరు కలవర పెడుతోంది. ఇప్పటికే కొందరు నేతలు ఆ పార్టీని వీడటం.. త్వరలో గుడ్‌బై చెప్పేందుకు పెద్ద సంఖ్యలో నేతలు సిద్ధపడుతుండటం బాబును ఆందోళనకు గురిచేస్తోంది. నష్ట నివారణ కోసం మధ్యవర్తులను రంగంలోకి దింపినా ఫలితం కనిపించక తండ్రీ కొడుకులు తలలు పట్టుకున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని

పనికిరాని బాబు.. పచ్చి మోసగాడు

చంద్రబాబుపై ఎంపీ కేశినేని నాని ధ్వజం

- విజయవాడ నిజం.. అమరావతి ఓ కలే
- ఎంతోమంది హితవు చెప్పినా వినకుండా టీడీపీలో కొనసాగా.. పార్టీ కోసం నేను అమ్ముకున్న ఆస్తుల విలువ రూ.2 వేల కోట్లు
- నాతో కొందరికి నెల జీతాలు ఇప్పించారు..
- తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసిన కేశినేని.. రాజీనామా స్పీకర్ ఆమోదం పొందగానే వైఎస్సార్ సీపీలో చేరతానని ప్రకటన

4లో

డబ్బుంటేనే రా.. కదలిరా..

విశాఖ నుంచి గంటా జంప్!

'అన్నమయ్య'లో ఆధిపత్య పోరు

4లో

నేటి నుంచి విధుల్లోకి

మున్సిపల్ కార్మికులు

కార్మిక సంఘాలతో ప్రభుత్వ చర్చలు సఫలం

ప్రభుత్వ హామీలకు అంగీకరించిన కార్మికులు

- ఇచ్చిన హామీలు అమలు చేస్తాం: మంత్రి బొత్స సత్యనారాయణ
- సంక్రాంతి కానుకగా కార్మికులకు రూ.1,000 చొప్పున బహుమతి
- పలు డిమాండ్లను ఇంతకు ముందే పరిష్కరించిన ప్రభుత్వం
- పట్టణాల్లో సిబ్బంది పనితీరు, వేతనాలపై అధ్యయనానికి కమిటీ



మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో చర్చిస్తున్న మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల తదితరులు

సాక్షి, అమరావతి: పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు గురువారం నుంచి విధుల్లో చేరేందుకు అంగీకరించారు. నాలుగు రోజుల క్రితం జరిగిన చర్చల్లో అన్ స్కిల్డ్, స్కిల్డ్ వర్కర్లకు ఒకే తరహా వేతనాలు మినహా, మిగిలిన అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని మంత్రుల బృందం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం మరోసారి సచివాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి..

మిగతా 10వ పేజీలో ▶



సుజల సీమ

- శరవేగంగా ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్న సీఎం జగన్
- రూ.600 కోట్లతో తెలుగుగంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువ లైనింగ్ పూర్తి
- బ్రహ్మంసాగర్ లీకేజీలకు అడ్డుకట్టతో పూర్తిగా నీటి నిల్వ
- అవుకు రెండో సొరంగం పూర్తి.. 20 వేల క్యూసెక్కుల తరలింపునకు లైన్ క్లియర్

2లో



కాకినాడకు మరో కిరీటం

- శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం
- రూ.2,123.42 కోట్లతో నాలుగో పోర్టు పనులు
- పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్న అరబిందో గ్రూపు
- 16 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 4 బెర్తుల అభివృద్ధి
- ఇప్పటికే 18% పనులు పూర్తి

11లో

ఓటర్ల జాబితాపై టీడీపీది బోగస్ ప్రచారమే

- కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలతో సుస్పష్టం
- గతేడాది తొలగించిన ఓట్లను పునఃసమీక్షించాం: సీఈసీ
- 21 లక్షల ఓట్లలో 0.61% ఓట్ల విషయంలోనే తప్పులు
- తెలంగాణలో ఓటుండి ఇక్కడ కూడా నమోదు చేస్తున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం
- 2 చోట్ల ఓటు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం



వివరాలు వెల్లడిస్తున్న సీఈసీ రాజీవ్‌కుమార్

10లో

గ్రూప్-2 పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టుల భర్తీకి డిసెంబర్ 7న నోటిఫికేషన్ ఇచ్చిన ఏపీపీఎస్సీ.. దరఖాస్తు గడువును మరో వారం రోజుల పాటు పొడిగించింది. వాస్తవానికి బుధవారంతో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ తెలిపారు. ప్రిలిమ్స్ నిర్వహణ తేదీలో మార్పు లేదని, ఫిబ్రవరి 25నే పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో చూడవచ్చని పేర్కొన్నారు.

నాలుగున్నరేళ్లుగా ప్రజారంజక పాలన

- 'జగన్ పాలన-ప్రజాతీర్పు' రాష్ట్ర సదస్సులో మేధావులు
- బడుగు, బలహీన వర్గాల పక్షాన ప్రభుత్వం
- ఆదర్శంగా పేదల కోసం సీఎం జగన్ ఇస్తున్న నవరత్న పథకాలు
- డీబీటీతో పెరుగుతున్న ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలు
- విద్యా రంగంలో రాష్ట్రం మరో నార్వేలా మారే అవకాశం
- కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా ఇస్తున్నది ఈ ప్రభుత్వమే
- దేవాలయాలను పునరుద్ధరిస్తూ, కొత్తవి నిర్మిస్తున్న సీఎం జగన్

2లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఇలాంటి పాలన ఎన్నడూ చూడలేదు



మేము వ్యవసాయ కూలీలం. నా భర్త నారాయణమూర్తి ఏడేళ్ల కిందటే చనిపోయారు. నాకున్న ఒక్కగానొక్క కూతురు రేవతికి పెళ్లి చేసి అత్తారింటికి పంపించా. ఇప్పుడు నేనొక్కర్తినే శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం పంచాయతీ చినరావుపల్లిలో వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగేళ్లలో నా ఒక్కదానికే రూ.2,38,209 ప్రభుత్వ సాయం అందింది. వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఇప్పటి వరకు రూ.97,000, వైఎస్సార్ రైతు భరోసాగా రూ.53,500, వైఎస్సార్ ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) కింద రూ.28,734, స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా ఉన్నందున సున్నా వడ్డీ ప్రయోజనంగా రూ.2,725, వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.56,250 అందుకున్నా. ప్రస్తుతం పెరిగిన వితంతు పింఛన్ రూ.3000 అందుకున్నాను. రెక్కాడితేగానీ డొక్కాడని మా జీవితం ఈ రోజు ఇంత ఆనందంగా ఉందంటే కారణం ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలే. ఇలాంటి సంక్షేమాభివృద్ధి పాలన ఎన్నడూ చూడలేదు. ఎప్పటికీ జగనే ముఖ్యమంత్రిగా ఉండాలి.

– కొత్తకోట లక్ష్మి, చినరావుపల్లి
(పైడి అప్పలనాయుడు, విలేకరి, ఎచ్చెర్ల క్యాంపస్)

చదువులకు ఆటంకం లేదిక



మాది నిరుపేద కుటుంబం. నా భర్త అబ్బులు పెయింటింగ్ పనులు చేసి కుటుంబపోషణ గావించేవారు. నాకు ఇద్దరు పిల్లలు. బాబు పవన్ రితిక్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండల పరిషత్ నంబర్-1 ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుండగా, పాప రిబ్‌కాజాయ్ రెండో తరగతి చదువుతోంది. నా భర్త ఓ ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యారు. ఇప్పుడు నేనే ఏదో ఒక పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పిల్లల చదువు ఎలా అని సతమతమయ్యాం. అదృష్టవశాత్తు ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మా బాబుకు అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వంతున నా బ్యాంకు ఖాతాలో నిధులు జమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సహా పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో పిల్లలు చదువుకుంటున్నారు. పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, షూస్ తదితర సామగ్రి అందిస్తున్నారు. దీనివల్ల పిల్లల చదువుకు చింతలేదు. మా ఆయనకు ప్రతి నెలా పింఛన్ అందుతోంది. అది ఈ నెల నుంచి రూ.3000కు పెంచారు. నాకు డ్వాక్రా రుణమాఫీ సొమ్ము వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.26 వేలు నా ఖాతాలో జమ అయ్యింది. ఇప్పుడు మా జీవనానికి ఎలాంటి ఇబ్బందులూ లేవు.

– యార్లగడ్డ సౌజన్య, రాయవరం
(పి.నాగమణి, విలేకరి, రాయవరం)

ప్రభుత్వమే ఆదుకుంది



ఒంటరి, దివ్యాంగురాలైన నాకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ చేయూత, పింఛన్ సొమ్ము ఎంతగానో అండగా నిలుస్తున్నాయి. నాది అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు. కొన్నేళ్ల క్రితం భర్త వదిలేసి వెళ్లిపోయాడు. నా ఏకైక కుమార్తె కూడా పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది. కూలి పనులు చేసుకొని ఒంటరిగా జీవిస్తున్న నాకు పుండుమీద కారంలా ఓ ప్రమాదంలో కుడికాలు పూర్తిగా పోయింది. అందువల్ల పనులు చేసుకునే అవకాశం కూడా లేకపోయింది. దివ్యాంగురాలిగా కర్ర సాయంతో జీవిస్తున్న నాకు ఆర్థికంగా ఎలాంటి ఆధారం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 వంతున మూడేళ్లుగా ఇప్పటికి రూ.56,250 అందింది. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసినా పింఛన్ మంజూరు కాలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే దివ్యాంగ పింఛన్ కూడా మంజూరైంది. నెలనెలా రూ.3 వేలు వస్తోంది. చేయూత, పింఛన్ సొమ్ములతో ఎవరిపైనా ఆధార పడకుండా జీవనం సాగిస్తున్నా. ప్రస్తుతం చిన్న పాత ఇల్లు ఉంది. మాది పోలవరం ముంపు ప్రాంతం కావడంతో అందరికీ వేరే చోట ఇళ్లు కట్టిస్తున్నారు. ఈ ప్రభుత్వమే లేకుంటే నా జీవితం ఏమయ్యేదో.. నా బతుకు ఎలా గడిచేదో తలచుకుంటేనే భయంగా ఉంటుంది.

– కవుజు బేబీ, చింతూరు (మహమ్మద్ షౌఖత్‌అలీ, విలేకరి చింతూరు)

'పేదవాళ్లు పింఛన్ కావాలన్నా.. రేషన్ కార్డును అడగాలన్నా గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదు. కానీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన దగ్గర్నుంచీ సంక్షేమ పథకాలు అర్హుల ఇంటి గుమ్మంలోకే వస్తున్నాయి. గ్రాఫిక్స్‌లోనే కనిపించిన అభివృద్ధిని గ్రామ స్థాయిలో చేసి చూపించారు సీఎం వైఎస జగన్. అసత్య హామీలతో ప్రజలను చంద్రబాబు వంచించారు. అన్నం పెట్టే జగన్‌ను కాదని.. సున్నం రాసే బాబుకు జనం ఓటేయరు.' అంటూ మేధావి వర్గం స్పష్టంగా చెప్పింది. ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అసోసియేషన్, సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ సంయుక్తంగా 'జగన్ పాలన-ప్రజా తీర్పు' అనే అంశంపై బుధవారం విజయవాడలో రాష్ట్రస్థాయి ప్రజా సదస్సు నిర్వహించాయి. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మేధావులు పాల్గొన్నారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

– సాక్షి, అమరావతి



విజయవాడలో జరిగిన సదస్సులో పాల్గొన్న వక్తలు

నాలుగున్నరేళ్లుగా ప్రజారంజక పాలన

'జగన్ పాలన-ప్రజాతీర్పు' రాష్ట్ర సదస్సులో మేధావులు

విద్యా రంగంలో మరో నార్వేలా ఆంధ్రప్రదేశ్



సీఎం జగన్ రాష్ట్రంలో విద్యా రంగాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తున్నారు. విద్యా రంగంలో ఏపీ మరో నార్వేగా మారుతోంది. తొలిసారిగా విద్యార్థులకు సీఎం జగన్ 6 లక్షల ట్యాబ్‌లు ఇచ్చారు. రూ. 8 వేల కోట్ల విలువైన కంటెంట్‌ను ఉచితంగా ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నో అడ్మిషన్స్ బోర్డు పెట్టే స్థాయికి తెచ్చారు. దేవాలయాలను పునరుద్ధరిస్తున్నారు. ప్రధాన దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్లు రూపొందించారు. ప్రతి రంగంలోనూ ఏపీ అభివృద్ధిలో ఉంది. కోవిడ్ సమయంలో సీఎం జగన్ చేపట్టిన చర్యల వల్ల ఇతర రాష్ట్రాలతో పోల్చితే మరణాలు తక్కువ. ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఇతర ఎల్లో మీడియా సీఎం జగన్ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాయి. అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి. ఉదాహరణకు ఈ నెల 4న ఈనాడులో 53, జ్యోతిలో 50 నెగెటివ్ వార్తలు వచ్చాయి. సాక్షి పత్రికలో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని ప్రతిబింబిస్తూ కథనాలు వస్తున్నాయి. ఏ పార్టీ లక్షణాలు ఏమిటో తెలుసుకోవడానికి ఇంతకంటే ఉదాహరణ అవసరంలేదు.

– ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు

వై నాట్ 175 జరిగి తీరుతుంది



సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల వైనాట్ వైఎస్సార్‌సీపీ మరోసారి ఘనవిజయం సాధిస్తుంది. సీఎం జగన్ చెప్పిన వై నాట్ 175 జరిగితీరుతుంది. సీఎం జగన్ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా పాలన చేస్తున్నారు. రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టిని తీసుకువస్తున్నారు. ఎల్లో మీడియా విషపు రాతలు, ప్రతిపక్షాల కుట్రలు పటాపంచలయ్యేలా ప్రజలు మరోసారి సీఎం జగన్‌కు పట్టం కడతారు. సీఎం జగన్ పేదలకు ఇళ్లు కట్టిస్తుంటే చంద్రబాబు స్టేలు తెచ్చి వాటిని అడ్డుకోవాలని చూస్తున్నారు.

– సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని గురునాథం

సీఎం జగన్ సంస్కరణలు మంచి ఫలితాలనిస్తాయి



సంక్షేమం అంటే మంచి జరగడం. సీఎం జగన్ పాలనలో ఇదే జరుగుతోంది. అన్ని వర్గాలకూ పథకాలు అందుతున్నాయి. సామాజిక న్యాయం, సంక్షేమమే ప్రధాన కర్తవ్యంగా సీఎం పనిచేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక సూచీలు వృద్ధిలో ఉన్నాయని కేంద్రమే ప్రశంసిస్తోంది. జగన్ చేస్తున్న సంస్కరణలు భవిష్యతులో మంచి ఫలితాలనిస్తాయి.

– గీతావిజన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పొక్కులూరి సుబ్బారావు

అది దుష్ప్రచారమే



బలిసినోడికీ బక్కోడికీ జరుగుతున్న పోరాటం ఇది. బలిసినోళ్ల వైపు చంద్రబాబు ఉంటే.., బక్కోళ్లకు అండగా సీఎం జగన్ ఉన్నారు. బాబు పాలనలో ఆటోడ్రైవర్లపై వేధింపులు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు వాహన మిత్రతో జగన్ మమ్మల్ని ఆదుకుంటున్నారు. పేదలకు సంక్షేమ పథకాలిచ్చి సోమరిపోతులను చేస్తున్నారనేది దుష్ప్రచారమే.

– ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధి వినోద్

బెస్ట్ సీఎం వైఎస్ జగన్



సంక్షేమం, అభివృద్ధి, అనేక సంస్కరణలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బెస్ట్ సీఎం అనిపించుకుంటున్నారు. కోవిడ్ సమయంలో సీఎం వైఎస్ జగన్ చేపట్టిన చర్యలు నభూతో నభవిష్యతి. రెండేళ్లు కోవిడ్‌లో పోయాయి. ఆ తర్వాత రెండేళ్ల నుంచే అసలు పాలన మొదలైంది. ఈ రెండేళ్లలోనే విద్యా రంగంలో రాష్ట్రం కేరళను అధిగమించేలా చేశారు. మరో ఇరవై ఏళ్లు సీఎంగా జగన్‌కు అవకాశం ఇస్తే అమెరికా, సింగపూర్‌లా ఏపీ ఎందుకు అవదు? పాత ముఖ్యమంత్రిలా గ్రాఫిక్స్ చూపించడం లేదు. పోర్టులు వస్తున్నాయి. పరిశ్రమలు వస్తున్నాయి. ఇంటింటికీ డాక్టర్ వస్తున్నారు. ఇది జరుగుతుందని ఎప్పుడైనా ఊహించామా? రేషన్ ఇంటికే వస్తోంది. ఇలాంటి పాలన, ఇలాంటి సీఎం లేకపోతే రాష్ట్రం మరో 75 ఏళ్లు వెనక్కి పోతుంది.

– ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరం కన్వీనర్ అశోక్ కుమార్

అందరికీ మంచి జరుగుతోంది





గత ప్రభుత్వంలో సబ్సిడీ లోన్ అని మూడో వంతు లంచాల రూపంలో తినేశారు. సీఎం జగన్ మమ్మల్ని ప్రతి దేవాలయంలో బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తున్నారు. జగనన్న చేదోడు ద్వారా సాయం చేస్తున్నారు. మంత్రివర్గంలో చోటిచ్చారు. నాయీ బ్రాహ్మణులకు గతంలో కనీస వేతనాలు కోరినా ఇవ్వలేదు. సీఎం జగన్ గుడిబయట ఉండే నాయీ బ్రాహ్మణులను గుడిలోపలికి తీసుకువచ్చారు. క్షౌరశాలల్లో రూ.20 వేల జీతం ఇస్తున్నారు.

– నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గణపతిరావు, మల్కాపురం కనకారావు

సీఎం జగన్ పాలన కోల్పోతే రాక్షస పాలన వస్తుంది



సీఎం జగన్ పేదల సంక్షేమం, రాష్ట్రర సమగ్రాభివృద్ధితో సుపరిపాలన అందిస్తున్నారు. ఆయన క్రిస్టియన్ అయితే అనేక దేవాలయాలను అభివృద్ధి చేస్తారా? సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న జనరంజక పాలనను కోల్పోతే రాక్షస పాలన వస్తుంది.

– ప్రొఫెసర్ రాచకొండ ముత్యాలరాజు

అభివృద్ధికి ఇదే నిదర్శనం



రాష్ట్రంలోని బ్యాంకుల్లో డిపాజిట్లు గతంలోకంటే ఇప్పుడు రూ.85 వేల కోట్లు పెరిగాయి. అభివృద్ధికి ఇదే నిదర్శనం. ప్రజల తలసరి ఆదాయం పెరిగింది. పరిశ్రమలు పారిపోతే ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ ఏటా ప్రథమ స్థానంలో ఉంటుందా? అన్నం పెట్టే జగన్‌కే ప్రజలంతా ఓటేస్తారు. అబద్ధాలు, మోసాలతో సున్నం రాసే చంద్రబాబుకు జనం ఓటేయరు.

– బెటర్ ఆంధ్రప్రదేశ్ సంస్థ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఎల్లో మీడియాదంతా అసత్య ప్రచారమే



చంద్రబాబుని మరో సారి అధికారంలోకి తెచ్చేందుకు ఎల్లో మీడియా మొత్తం అసత్య ప్రచారం చేస్తోంది. ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవాలి. పెత్తందారుల పాలనను రానివ్వకూడదు. సీఎం జగన్ రూపాయి అవినీతి లేకుండా రూ. 2.50 లక్షల కోట్లు ప్రజలకు అందించారు. వాటి ద్వారా మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలొచ్చాయి. రాష్ట్రానికి ఆస్తుల కల్పన జరిగింది.

– ఎన్నారై వెంకట్ మేడపాటి

ఇప్పుడున్నది ఆరోగ్యవంతమైన సమాజం



సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా ముందుంది. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది ఆరోగ్యవంతమైన సమాజం. సీఎం జగన్ నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందిస్తున్నారు. వ్యవసాయ రంగానికి భరోసా కల్పిస్తున్నారు. హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేలతో గ్రామీణులకు మేలు చేస్తున్నారు.

– సోషల్ వర్కర్ వెంకటరెడ్డి

పేద పిల్లలు విదేశాల్లో చదవడం చిన్న విషయం కాదు



సీఎం జగన్ విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెస్తున్నారు. ఎన్నో కష్ట నష్టాలకోర్చి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకొనే పేద పిల్లల కలలను సాకారం చేస్తున్నారు. వారికి అయ్యే ఖర్చంతా చెల్లిస్తున్నారు. పేద పిల్లలు విదేశాల్లో చదవడం చిన్న విషయం కాదు.

– విశ్రాంత అధ్యాపకులు రెహమాన్ సాయెబ్

ఏపీ తలెత్తుకొనేలా జగన్ పాలన



ఏపీ తలెత్తుకొనేలా సీఎం జగన్ పాలన సాగుతోంది. చంద్రబాబు హయాంలో ఒక్క పోర్టు, ఒక్క మెడికల్ కాలేజీ కట్టలేకపోయారు. సీఎం జగన్ 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్లు కడుతున్నారు.17 వైద్య కళాశాలలు నిర్మిస్తున్నారు. 2.94 లక్షల ఉద్యోగాలిచ్చారు. కేంద్ర ఈపీఎఫ్ లెక్కల ప్రకారం 16 లక్షల ఉద్యోగాలొచ్చాయి.

– సామాజిక కార్యకర్త గూడపురెడ్డి శేఖరరెడ్డి

సుపరిపాలనంటే ఇదీ



సుపరిపాలన అంటే సీఎం జగన్ అందిస్తున్న పాలన. ప్రతి పేదవాడికీ ఇల్లు ఇస్తున్నారు. కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తెచ్చారు. గతంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసి ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహించారు.

– హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి ముక్కు వెంకటేశ్వరరెడ్డి

మదర్ థెరిసా ఆదర్శంగా జగన్ పాలన



మదర్ థెరిస్సాను సీఎం జగన్ ఆదర్శంగా తీసుకున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాల పేదలకు నవరత్న పథకాలు అందిస్తున్నారు. పని చేయని వారు పని చేస్తున్న వారిని విమర్శించడం సహజం.

– గుంటూరు ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ పోలే ముత్యం

బ్రాహ్మణులకు మేలు చేస్తున్న సీఎం జగన్



రాష్ట్రంలో బ్రాహ్మణులకు సీఎం వైఎస్ జగన్ చాలా మేలు చేస్తున్నారు. వంశ పారంపర్య వ్యవస్థను పునరుద్ధరించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కామన్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇచ్చారు. ధూప దీప నైవేద్యాలకు, అర్చకుల వేతనాలను కూడా భారీగా ఇస్తున్నారు.

– అర్చకులు ప్రసన్నాంజనేయ కుమారశర్మ

జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీకి పతకాలు



పతకాలు చూపుతున్న బాక్సింగ్ విజేతలు

సాక్షి, అమరావతి: జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతోన్న పోటీల్లో ఏపీ విద్యార్థుల విజయపరంపర కొనసాగుతోంది. బుధవారం ఢిల్లీలో జరిగిన అండర్-17, 19 బాక్సింగ్ బాలికల విభాగంలో ఏపీ విద్యార్థులు 4 కాంస్య పతకాలు సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. బాలికల అండర్-19లో నారాయణ జూనియర్ కాలేజీ (విశాఖ) విద్యార్థిని మొహ్మద్ హీనా కౌసర్, విశాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని కొలుసు నిహారిక, రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని గంగవరపు అక్షిత కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్-17 విభాగంలో విశాఖ సెయింట్ జాన్స్ పారిష్ స్కూల్ విద్యార్థిని మైలపిల్లి మేఘన కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు.

15 నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తవ్వాలి

సాక్షి, అమరావతి: రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఫిబ్రవరి 15 నాటికి పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరి కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్ కోసం ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్న సబ్సిడీ విత్తనాల పంపిణీని సత్వరమే పూర్తి చేయాలని కోరారు. రైతుల సౌలభ్యం కోసం ఆర్బీకేల ద్వారా ఎరువుల సరఫరా పెంచాలన్నారు. పీఎం కిసాన్ 16వ విడత లబ్ధి పొందటం కోసం అర్హులైన రైతులతో ఈ నెల 20 నాటికి బ్యాంక్ ఖాతాలను ఆధార్ అనుసంధానం, ఈకేవైసీ పూర్తి చేయించాలని సూచించారు.

ఆక్టోపస్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



వెంకటలక్ష్మికి సాయం అందిస్తున్న ఐజీపీ ఎస్వీ శేఖర్‌బాబు

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో మరణించిన ఆక్టోపస్ కమెండో కానిస్టేబుల్ జి.సోమేశ్వరరావు కుటుంబానికి పోలీస్ విభాగం చేయూత అందించింది. డిపార్ట్‌మెంట్ నుంచి ఆయనకు రావాల్సిన బెనిఫిట్స్‌తోపాటు సోమేశ్వరరావుతో కలిసి శిక్షణ పొందిన 2013 బ్యాచ్ కానిస్టేబుల్స్ కలిసి రూ.6,24,943 ఆర్థిక సాయం అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో మృతుడి భార్య వెంకటలక్ష్మికి ఐజీపీ ఎస్వీ శేఖర్‌బాబు మంగళగిరిలోని కార్యాలయంలో బుధవారం అందజేశారు.

సుజల సీమ

- శరవేగంగా ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలను గరిష్టంగా ఒడిసి పట్టి దుర్భిక్ష రాయలసీమకు మళ్లించి సుభిక్షం చేసే దిశగా గత 56 నెలలుగా సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. వీటి ద్వారా 2019 నుంచి ఏటా గరిష్టంగా నీటిని తరలిస్తుండటంతో రాయలసీమ సుభిక్షమైంది. హంద్రీ-నీవాలో అంతర్భాగమైన లక్కవరం ఎత్తిపోతలను పూర్తి చేసి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పశ్చిమ మండలాలను సస్యశ్యామలం చేశారు. అవుకు రెండో టన్నెల్‌ను పూర్తి చేసి గాలేరు-నగరి కాలువ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు రోజుకు 20 వేల క్యూసెక్కుల తరలింపునకు మార్గం సుగమం చేశారు. హంద్రీ-నీవాలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి కృష్ణా జలాలను కుప్పం నియోజకవర్గానికి తరలించేందుకు మార్గం సుగమం చేస్తున్నారు. శ్రీశైలంలో 800 అడుగుల్లో నీరు నిల్వ ఉన్నా రోజుకు మూడు టీఎంసీలు తరలించి సాగు, తాగునీరు అందించడానికి రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచడంతోపాటు కాలువలు, ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపు పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు.

➢ చంద్రబాబు అధికారంలో ఉండగా తెలుగుగంగ ప్రధాన కాలువకు లైనింగ్ చేసి పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించి నిల్వ చేయాలనే ఆలోచన కూడా చేయకుండా రైతుల ప్రయోజనాలను కాలరాశారు. వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్‌కు 5వేల క్యూసెక్కులను తరలించేలా తవ్విన తెలుగుగంగ ప్రధాన కాలువకు లైనింగ్ చేయకపోవడంతో 2 వేల క్యూసెక్కులు కూడా తీసుకెళ్లలేని దుస్థితి నాడు నెలకొంది. బ్రహ్మంసాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 17.74 టీఎంసీలు కాగా మట్టికట్ట లీకేజీలకు అడ్డుకట్ట వేయకపోవడం వల్ల ఏటా సగటున నాలుగైదు టీఎంసీలు కూడా నిల్వ చేయలేని పరిస్థితి టీడీపీ హయాంలో ఉత్పన్నమైంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక బీసీఆర్ (బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్) నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ లింక్ కెనాల్, వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్ వరకూ తెలుగుగంగ ప్రధాన కాలువకు రూ.600 కోట్లు వెచ్చించి లైనింగ్ పనులను సీఎం పూర్తి చేశారు. దీంతో 2019 నుంచి వరుసగా ఏటా వెలిగోడు రిజర్వాయర్‌ను సకాలంలో నింపగలిగారు. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు రూ.90 కోట్లు వెచ్చించి డయాఫ్రమ్ వాల్ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేయడంతో 2021-22 నుంచి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు.

➢ అవుకు జంట సొరంగాల్లో ఫాల్ట్ జోన్ (పెలుసు మట్టి)లో పనులను చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు ఒక టన్నెల్‌లో కాలువ (లూప్)తో సరిపుచ్చారు. గండికోట నిర్వాసితుల పునరావాసాన్ని పట్టించుకోకపోవడంతో నాడు కేవలం నాలుగైదు టీఎంసీలే నిల్వ చేశారు. పైడిపాలెం, వామికొండసాగర్, సర్వారాయసాగర్‌లను గత సర్కారు గాలికి వదిలేసింది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, ఆయకట్టుకు నీళ్లందించకుండా రైతుల కడుపుకొట్టారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అవుకు మొదటి సొరంగాన్ని పూర్తి సామర్థ్యం మేరకు 10వేల క్యూసెక్కులను తరలించేలా సిద్ధం చేశారు. రెండో సొరంగం ఫాల్ట్ జోన్‌లో మిగిలిపోయిన పనులను సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేశారు. తద్వారా గాలేరు-నగరి ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను తరలించడానికి లైన్ క్లియర్ చేశారు. వరద కాలువ సామర్థ్యం పెంపు పనులను శరవేగంగా చేస్తున్నారు. అవుకు మూడో సొరంగం పూర్తి కావస్తోంది. వెయ్యి కోట్లతో గండికోట నిర్వాసితులకు పునరావాసం కల్పించి పూర్తి స్థాయిలో 26.85 టీఎంసీలను మూడేళ్లుగా నిల్వ చేసి రాయలసీమ రైతులకు ప్రయోజనం చేకూర్చారు. పైడిపాలెం (6టీఎంసీలు), వామికొండసాగర్(1.6టీఎంసీలు), సర్వారాయసాగర్ (3.06 టీఎంసీలు)లోనూ గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.600 కోట్లతో పునరావాసం కల్పించి 10 టీఎంసీలను నిల్వ చేశారు.

➢ దివంగత వైఎస్సార్ పూర్తి చేసిన ముచ్చుమర్రి ఎత్తిపోతలను తానే చేపట్టానంటూ చంద్రబాబు అబద్ధాలాడుతున్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను కూడా బాబు పూర్తి చేయలేకపోయారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా ఏ ఒక్క ఏడాదీ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించకుండా రైతులకు ద్రోహం చేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక 60 రోజుల్లోనే 40 టీఎంసీలు తరలించేలా హంద్రీ-నీవా ప్రధాన కాలువ సామర్థ్యం పెంపు పనులను చేపట్టారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరిని అనుసంధానం చేయడం ద్వారా సాగు, తాగునీటిని పుష్కలంగా అందించే పనులకు శ్రీకారం చుట్టారు. ఏటా డిజైన్ సామర్థ్యం కంటే అధికంగా హంద్రీ-నీవా నీటిని తరలించి రాయలసీమను సస్యశ్యామలం చేశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మిగిలిన పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను కుప్పానికి తరలించేందుకు మార్గం సుగమం చేశారు.

హక్కుల పరిరక్షణ

▶ విభజన చట్టం 11వ షెడ్యూలులో పేర్కొన్న తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టులు అనుమతి ఉన్నవేనని కేంద్రం అధికారికంగా గుర్తించేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయించడం ద్వారా రైతుల హక్కులను సీఎం జగన్ పరిరక్షించారని న్యాయ నిపుణులు ప్రశంసిస్తున్నారు. నాగార్జున సాగర్ స్పిల్‌వేలో సగభాగం, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను అధీనంలోకి తీసుకోవడం ద్వారా రాష్ట్ర హక్కుల పరిరక్షణలో రాజీ పడబోమని గట్టి సందేశం ఇచ్చారు.

▶ శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడే రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు దిగువన కాలువలోకి ఎత్తిపోయడం ద్వారా తెలుగుగంగ, గాలేరు-నగరి, కేసీ కెనాల్, ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు నీళ్లందించడంతోపాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతోపాటు చెన్నైకి తాగునీటిని అందించేలా రాయలసీమ ఎత్తిపోతలను సీఎం చేపట్టారు. ఇది పూర్తయితే సీఎం జగన్‌కు ప్రజామద్దతు పెరిగి రాజకీయంగా తనకు నష్టం చేకూర్చుతుందనే ఆందోళనతో బాబు ఎన్జీటీలో కేసులు వేయించి సైంధవుడిలా అడ్డుపడ్డారు. సీఎం ఈ అడ్డంకులన్నిటినీ అధిగమిస్తూ పనులను శరవేగంగా పరుగులెత్తిస్తున్నారు.

తూర్పు నౌకాదళ సీఎస్‌వోగా రియర్ అడ్మిరల్ మురళీమోహన్ రాజు



సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్)గా రియర్ అడ్మిరల్ మురళీమోహన్ రాజును నియమిస్తూ భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖలోని ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో విద్యనభ్యసించిన మోహన్‌రాజు 1990లో భారత నౌకాదళంలో చేరి విశేష సేవలందించారు. ఐఎన్ఎస్ తబర్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా పశ్చిమ నౌకాదళం కేంద్రంగా ఐఎన్ఎస్ వింధ్యగిరి, ఐఎన్ఎస్ తారాగిరి, ఐఎన్ఎస్ ఢిల్లీ యుద్ధ నౌకల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

9836 గ్రామ పంచాయతీల్లో వికసిత్ యాత్ర పూర్తి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహిస్తూ చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర రాష్ట్రంలో 9,836 గ్రామ పంచాయతీల్లోనూ, 209 పట్టణ ప్రాంతాల్లోను పూర్తయినట్లు గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. బుధవారం విజయవాడలోని గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో గ్రామ వార్డు సచివాలయాల శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తోందన్నారు.

చంద్రబాబు, పవన్ వ్యాఖ్యలకు ఖండన

డెమోక్రాటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): గ్రామ సచివాలయ ఉద్యోగులపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను డెమోక్రాటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఖండించింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తాము నియామక పరీక్ష ద్వారా ఎంపికయ్యామన్నారు. రెండేళ్ల ప్రొబేషన్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న తమను అవమానించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు నిర్వర్తించే అన్ని విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. తక్షణమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ డిమాండ్‌కు తగిన ప్రణాళిక

- రాష్ట్రంలో నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ సరఫరా
- ఎస్ఆర్‌పీసీ ఆపరేషన్ కో ఆర్డినేషన్ సబ్‌కమిటీ సమావేశంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్



సమావేశంలో ప్రసంగిస్తున్న విజయానంద్, తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, దానికి తగినట్లు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ జెన్‌కో చైర్మన్ కె.విజయానంద్ చెప్పారు. దక్షిణ ప్రాంత విద్యుత్ సరఫరా సంస్థలు, ఉత్పత్తి సంస్థలు కలిసికట్టుగా పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడలో బుధవారం జరిగిన సదరన్ రీజనల్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) 210వ ఆపరేషన్ కో ఆర్డినేషన్ సబ్‌కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఏడాది ఎవరూ ఊహించని విధంగా రోజువారీ విద్యుత్ డిమాండ్ 265 మిలియన్ యూనిట్లకు చేరిందని గుర్తుచేశారు. దక్షిణాది రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు సమైక్యంగా పనిచేయాలని గత ఏడాది ఎస్ఆర్‌పీసీ నిర్ణయించిందని, ఇదే లక్ష్యంతో ఉత్తమ ఫలితాల సాధన దిశగా చర్చించి కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ పదిశాతం పెరుగుతుందని స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) అంచనా వేసిందని చెప్పారు. దేశవ్యాప్తంగా 2030 వరకు విద్యుత్ డిమాండు పెరుగుదల ఇలాగే ఉంటుందని కేంద్ర ఇంధనశాఖ (పవర్ సెక్టార్) కూడా అంచనా వేసిందన్నారు. అందువల్లే గడువు దాటిన థర్మల్ విద్యుత్ కేంద్రాలను మూసేయకుండా పకడ్బందీగా మరమ్మతులు చేసి 2030 వరకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగించాలని ఆదేశించిందని చెప్పారు. విద్యుత్ ఉత్పాదన సంస్థలు త్వరితగతిన మరమ్మతులు (ఓవరాయిలింగ్) పూర్తిచేయడంతో పాటు నిర్మాణంలో ఉన్న ప్లాంట్లను పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీకి కొంత అనుకూలం

కృష్ణపట్నంలో 800 మెగావాట్లు, డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్లు గత ఏడాది సీవోడీ చేసుకుని వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించడం రాష్ట్రానికి చాలా వరకు కలిసి వచ్చే అంశమని చెప్పారు. గత నెలలో డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టడంతో అదనంగా 15 నుంచి 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందన్నారు. భవిష్యత్తులో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుందని, పర్యావరణ పరిరక్షణ అంశం థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు సవాల్‌గా మారుతుందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంపుదల, సరఫరాలో సమస్యలపై చర్చించి ఉత్తమ పరిష్కార మార్గాలకు అన్వేషించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ కె.వి.భాస్కర్, ఏపీ జెన్‌కో డైరెక్టర్లు బాబ్జీ (థర్మల్), సయ్యద్ రఫీ (హెచ్ఆర్), ఎస్ఆర్‌పీసీ 210వ ఆపరేషన్ కో ఆర్డినేషన్ సబ్‌కమిటీ మెంబర్ సెక్రటరీ అసిత్‌సింగ్, పలువురు ఉన్నతాధికారులు, ఎన్‌టీపీసీతోపాటు దక్షిణాది రాష్ట్రాల ట్రాన్స్‌కో, జెన్‌కో ప్రతినిధులు పాల్గొన్నారు.

500 మంది ప్రవాసాంధ్రులకు ఉచిత బీమా

కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్


కువైట్‌లో ప్రవాసాంధ్ర భరోసా బీమా నమోదు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకొని కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 500 మందికిపైగా 'ప్రవాసాంధ్ర భరోసా బీమా' చేయించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు నాయని మహేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ముమ్మడి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ప్రవాసీ భారతీయ దివాస్‌ను పురస్కరించుకొని మంగళవారం వివిధ కంపెనీల్లో పనిచేసే వాళ్లు, ఇంట్లో పనిచేసేవాళ్లు, డ్రైవర్లు, తక్కువ జీతం ఉన్నవారిని గుర్తించి బీమా చేయించామన్నారు. ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రవాసాంధ్ర భరోసా బీమా ఈ నెల 15న న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీతో అగ్రిమెంట్ పూర్తి అవుతున్నందున కొత్త అగ్రిమెంట్‌లో ప్రీమియం రూ.550 కన్నా ఎక్కువ గాను, ఇప్పుడు లభిస్తున్న ప్రయోజనాలు తగ్గే అవకాశం ఉన్నందున ప్రవాసాంధ్రులకు ప్రోత్సాహకరంగా రాష్ట్ర ప్రభుత్వం బీమా ప్రీమియం రూ.550 నుంచి రూ. 275లకు తగ్గించిందన్నారు. 14వ తేదీ వరకూ కువైట్లోని హవల్లిలో ఉన్న ఆర్ ఆర్ స్పైసీ హోటల్ వద్ద ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఉచితంగా బీమా నమోదు చేస్తున్నామని తెలిపారు. ఇంత మంచి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షుడు మేడపాటి వెంకట్, డైరెక్టర్ ఇలియాస్, ఉచితంగా బీమా నమోదు కార్యక్రమానికి సహకరించిన కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, రెడ్డీస్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రేడ్-2 వీఆర్‌వోలకు ప్రొబేషన్ డిక్లేర్ చేయండి

సీఎస్‌కు ఏపీ వీఆర్‌వోల సంఘం వినతి

సాక్షి, అమరావతి: ఎన్నికల నేపథ్యంలో వెంటనే సర్వే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించే అవకాశం లేనందున ప్రొబేషన్ డిక్లరేషన్ జరగకుండా మిగిలిపోయిన గ్రేడ్-2 వీఆర్‌వోలకు ప్రొబేషన్ డిక్లేర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డిని కోరింది. సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పల నాయుడు తదితరులు ఆయన్ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. సర్వే పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు, పలు కారణాలతో సర్వే శిక్షణకు హాజరు కాలేక పోయిన వారికి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించే అవకాశం లేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. జీవో 13 ప్రకారం సర్వే ఎగ్జామ్, సీపీటీ తప్పనిసరి అని అనుకుంటే వారందరికీ మరోసారి సర్వే ఎగ్జామ్, సీపీటీ రాసి పాస్ అవడానికి ఒక ఏడాది గడువు ఇవ్వాలని కోరారు.

డిప్యూటీ కలెక్టర్ల డైరీ విడుదల

పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి, అమరావతి: ఏపీ డిప్యూటీ కలెక్టర్ల వార్షిక డైరీ-2024ను రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో డైరీని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను అమలు చేయడంలో డిప్యూటీ కలెక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. భూ సమస్యల్ని పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. రెవెన్యూ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వార్షిక డైరీలో విలువైన సమాచారాన్ని పొందుపరిచారని, రెవెన్యూ అధికారులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ధర్మచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.విశ్వేశ్వరనాయుడు, ట్రెజరర్ ఇ.మురళి, పలువురు డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సమ్మె యోచన లేదు

ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్



మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రజలను గందరగోళానికి గురిచేసే విధంగా కొందరు ప్రభుత్వ వైద్యులు వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యామ్‌సుందర్ చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేయనున్నట్లు కొందరు వైద్యులు అనధికారికంగా ప్రకటించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్న తరుణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేయాల్సిన అవసరమే లేదని స్పష్టం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల ఫేస్ రికగ్నిషన్ హాజరు నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకోవడానికి, డాక్టర్ల సౌకర్యం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు కేటాయించిన విషయాన్ని విస్మరించరాదన్నారు. ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ సంఘం ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతోందని, ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి కొన్ని సమస్యలను పరిష్కరిస్తోందని చెప్పారు. తమ సంఘాన్ని విడగొట్టడానికి కొందరు స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. సంఘం నిబంధనలు మీరి ప్రకటనలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అసలైన గుర్తింపు పొందిన తమ సంఘం రిజిస్టర్ నంబరు వినియోగించుకుంటూ సంఘానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ జేఏసీ ఆవిర్భావం

చైర్మన్‌గా మిట్టా కృష్ణయ్య ఎన్నిక

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంలో పలు యాజమాన్యాల కింద పనిచేస్తోన్న 60 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు కలిసి ఏపీ ఉపాధ్యాయ జేఏసీగా ఏర్పడ్డాయి. బుధవారం ఆయా సంఘాల ప్రతినిధులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు టీ.కల్పలతారెడ్డి, ఎంవీ.రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయ జేఏసీ ఆవిర్భావాన్ని ప్రకటించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా పోచంరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ డి.శ్రీను, పలు సంఘాల ప్రతినిధుల నుంచి ఐదుగురు కో-చైర్మన్లు, 8 మంది వైస్ చైర్మన్లు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఇద్దరు, అసిస్టెంట్ సెక్రటరీ జనరల్‌గా నలుగురు, కార్యదర్శులుగా 10 మంది, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏడుగురు, ఒక్కరు ట్రెజరర్‌గా 39 మంది సభ్యులతో జేఏసీ ఏర్పడినట్లు ప్రతినిధులు తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

జూనియర్ కాలేజీలకు గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సెలవుల్లోను తరగతులు నిర్వహించే యాజమాన్యాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ ఇంటర్ బోర్డు కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్, ఏలూరు టౌన్ యూనియన్ ఉపాధ్యక్షుడు దేవరాజు బుధవారం ఏలూరు ఇంటర్ బోర్డు ఆర్ఐవో చంద్రశేఖర్‌కు వినతిపత్రమిచ్చారు.

టీడీపీ కకావికలం

తమ్ముళ్ల హాహాకారాలు.. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు కరువు

సాక్షి, అమరావతి : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు సమన్వయకర్తల ఎంపికకు డబ్బు మూటలనే ప్రధాన అర్హతగా నిర్ణయించడం ఆ పార్టీలో సీనియర్ నేతలను కలవరపరుస్తోంది. ఆది నుంచి టీడీపీని నమ్ముకున్న వారిని కాదని.. డబ్బు మూటలను చూపుతున్న వారినే సమన్వయకర్తలుగా నియమిస్తుండటంతో సీనియర్ నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని బుధవారం ఆ పార్టీని వీడారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. సీఎం వైఎస్ జగన్‌తో కలిసి పని చేస్తానని ప్రకటించారు. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో రూ.20 కోట్లు డిపాజిట్ చేసిన వారికే టికెట్ ఇస్తానంటూ చంద్రబాబు తెగేసి చెప్పడంతో మాజీ మంత్రి పీతల సుజాత ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో తనను కాదని పక్కన పెట్టి.. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని నియమించాలని చంద్రబాబు ఆలోచిస్తుండటంతో ఆ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మవరం సుబ్బారెడ్డి గందరగోళంలో పడ్డారు. డబ్బు మూటలే ప్రాతిపదికగా సమన్వయకర్తలను చంద్రబాబు మార్చేస్తుండటం.. కేశినేని నాని బాటలోనే సీనియర్ నేతలు ఒకరి వెంట ఒకరు పార్టీని వీడుతుండటంతో 'దేశం' కకావికలమవుతోంది. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి ముందే పార్టీ బలహీనంగా మారడంతో తెలుగు తమ్ముళ్లలో హాహాకారాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో రోజురోజుకు మద్దతు పెరుగుతుండటంతో ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు అత్యధిక నియోజకవర్గాల్లో అభ్యర్థులు ముందుకు రావడం లేదు. దాంతో ఎన్నికల్లో ఉనికి చాటుకోవడం కోసం జనసేనతో పొత్తుకు చంద్రబాబు పాకులాడారు. కానీ.. క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన నేతల మధ్య సఖ్యత కుదరక పోవడంతో పొత్తు కుంపట్లను రాజేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్.. తెనాలిలో జనసేన నేత నాదేండ్ల మనోహర్, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. టీడీపీ బలహీనంగా మారడం.. టీడీపీ–జనసేన పొత్తు కుంపట్లను రాజేస్తుండటంతో 2019 ఎన్నికల కంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమికి ఘోర పరాజయం తప్పదనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది.


అన్నమయ్య టీడీపీలో ఆధిపత్య పోరు

- నియోజకవర్గాల్లో నువ్వా నేనా అంటున్న కీలక నేతలు
- అభ్యర్థుల ప్రకటనలో టీడీపీ తాత్సారం
- నలిగిపోతున్న తమ్ముళ్లు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో టీడీపీ కీలక నేతల మధ్య గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ నేనే ఉండాలి.. నేనే పోటీ చేయాలి.. అంటూ సొంత ప్రతిష్టను పెంచుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటూ కత్తులు దూసుకుంటున్నారు. జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా దూసుకుపోతున్న తరుణంలో ఉన్నవాళ్లు కూడా జారిపోతే పరిస్థితి మరింత దిగజారిపోతుందని అధిష్టానం కూడా చోద్యం చూస్తుండడంతో ఎటూ తేల్చుకోలేక క్యాడర్ అయోమయంలో ఉంది.

అన్నిచోట్ల ఇదే తంతు

- రాయచోటిలో ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌ల మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతుండగా.. మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరడంతో నాలుగో వర్గం ముందుకు వచ్చింది.
- రాజంపేటలో మాజీ ఎమ్మెల్సీ బత్యాల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్‌రాజు, గంటా నరహరి వర్గాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతుండగా.. జనసేన కలయికతో క్యాడర్ అయోమయంలో పడింది.
- రైల్వేకోడూరులో టీడీపీ నేత కస్తూరి విశ్వనాథనాయుడు, గతంలో పోటీ చేసిన అభ్యర్థి నరసింహప్రసాద్ వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులున్నాయి. గతంలో చిట్వేలిలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగిన విషయం తెలిసిందే.
- మదనపల్లెలో దొమ్మలపాటి రమేష్, శ్రీరామ్ చినబాబు వర్గాల మధ్య అంతర్యుద్ధం సాగుతుండగా, తాజాగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేరికతో మూడు వర్గాలు అయ్యాయి.
- తంబళ్లపల్లెలో టీడీపీ నేత శంకర్‌యాదవ్‌తో పాటు మరో ఇద్దరు చక్రం తిప్పుతుండటంతో అక్కడ కూడా అయోమయ పరిస్థితి నెలకొంది.



డబ్బుంటేనే 'రా.. కదలి రా'
అమ్మకానికి టికెట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8 మంది ఇన్‌చార్జ్‌ల మార్పునకు టీడీపీ సిద్ధం

'బీసీ జనార్దన్‌రెడ్డి! నీ బనగానపల్లి నువ్వు చూసుకో! డోన్‌తో ఏం పని? ఏం మంత్రి కావాలనుకుంటున్నావా? నువ్వు అనుకుంటున్నావేమో! నీతో ఏం కాదు! ధర్మవరం సుబ్బారెడ్డికి కూడా చెప్పు! నా పేరు పెద్దపాడు మహేశ్వరరెడ్డి, డోర్ నెంబర్ 3/129. నేను 28 కేసుల్లో ముద్దాయిని, రౌడీషీటర్‌ని. క్రిమినల్‌ని!''

– బీసీ జనార్దన్‌రెడ్డికి మహేశ్వరరెడ్డి హెచ్చరిక

'రేయ్! ఏం అనుకుంటున్నావ్! ఏం చంపుతావా? నా వెంట్రుక పీకండ్రా అందరూ కలిసి! నీకు ఏదైనా ఉంటే చంద్రబాబును అడుగు పో! తమాషాలు చేస్తున్నావా?'

– మహేశ్వరరెడ్డి హెచ్చరికకు జనార్దన్‌రెడ్డి జవాబు

ఈ ఇద్దరి మాటలు గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతున్నాయి. టీడీపీలో 'నోటు' దురుసు, విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో.. పార్టీ అధిష్టానం వైఖరి ఏమిటో చెప్పేందుకు ఈ సంభాషణే ఉదాహరణ.

సాక్షి ప్రతినిధి కర్నూలు: బనగానపల్లి ఒక్కటే కాదు, నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్.. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ వర్గవిభేదాలతో టీడీపీ రోజురోజుకూ బలహీన పడుతోంది. దీనికితోడు రాబిన్‌శర్మ టీం, ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని ప్రకటించిన టీడీపీ డబ్బు మూటలనే ప్రధాన అర్హతగా చూస్తున్నట్టు సమాచారం. టికెట్లను అమ్మకానికి పెట్టినట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా 8 మంది ఇన్‌చార్జ్‌లను మార్చడంతోపాటు పొత్తులో భాగంగా రెండు స్థానాలను జనసేనకు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో విసిగిపోయిన పార్టీ ఇన్‌చార్జ్‌లు అధిష్టానం తుది నిర్ణయం వెలువరించిన వెంటనే పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. కచ్చితంగా తమకు టికెట్ దక్కదని భావనకు వచ్చిన వారు ఇప్పటికే ప్రత్యామ్నాయ అన్వేషణలో ఉన్నట్టు సమాచారం. నంద్యాల జిల్లాలో టికెట్ల ఖరారులో బీసీ జనార్దన్‌రెడ్డి తలదూర్చడంపై కొందరు నేతలు గుర్రుగా ఉన్నారు.

బాబు మాటతప్పి.. 'కోట్ల'వైపు

నంద్యాల జిల్లాలో డోన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డి పోటీ చేస్తారని ఏడాది కిందట స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. అయితే తాజాగా సుబ్బారెడ్డికి మొండిచేయి చూపి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని డోన్ అసెంబ్లీ బరిలో దించేందుకు టీడీపీ సిద్ధమైంది. రెండు సార్లు ఎంపీగా ఓడిపోయిన కోట్ల, మూడోదఫా కూడా ఓటమి తప్పదని ఎమ్మిగనూరు అసెంబ్లీ ఆశించారు. అయితే పార్టీ డోన్ సీటు ప్రతిపాదించినట్టు సమాచారం. డోన్‌లో అత్యంత బలంగా ఉన్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఢీకొట్టలేనని గ్రహించిన కోట్ల పోటీకి సుముఖత చూపడం లేదని తెలుస్తోంది.

- నంద్యాల ఇన్‌చార్జ్‌గా ఉన్న భూమా బ్రహ్మానందరెడ్డిని ఇప్పటికే తప్పించి ఫరూక్‌ను ఇన్‌చార్జ్‌గా టీడీపీ అధిష్టానం ప్రకటించింది. అప్పటి నుంచి భూమా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.
- శ్రీశైలంలో ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖరరెడ్డి స్థానంలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డికి టికెట్ ఖరారైందని సమాచారం. నంద్యాల, శ్రీశైలం ఇన్‌చార్జ్‌ల మార్పులో డబ్బు మూటలు ప్రధాన పాత్ర పోషించాయంటున్నారు.
- నందికొట్కూరులో 2019లో ఓడిపోయిన బండి జయరాజు స్థానంలో జయసూర్యను ఖరారు చేసినట్లు చర్చ జరుగుతోంది.
- పొత్తులో భాగంగా ఆళ్లగడ్డ అసెంబ్లీని జనసేనకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. దీంతో అఖిల ప్రియకు టిక్కెట్ లేనట్లేనని ప్రచారం జరుగుతోంది. ఈ నెల 9న ఆళ్లగడ్డలో జరిగిన రా..కదలిరా!' సభలో కూడా అఖిల అభ్యర్థిత్వాన్ని చంద్రబాబు ఖరారు చేయక పోవడం గమనార్హం.

టీడీపీలో కొడుకు.. బీజేపీలో తండ్రి

కర్నూలు టీడీపీ ఇన్‌చార్జ్‌గా టీజీ భరత్ కొనసాగుతున్నారు. ఆయన తండ్రి టీజీ వెంకటేశ్ బీజేపీలో ఉన్నారు. తండ్రీకొడుకులు తమ స్వార్థం కోసం చెరోపార్టీలో ఉండటంతో ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. సర్వేల్లో భరత్ ఓడిపోతారని తేలడంతో తమ పార్టీలో ఉంటే టీజీ వెంకటేశ్‌కు టికెట్ ఇచ్చే యోచన చేస్తామని టీడీపీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

- మంత్రాలయంలో తిక్కారెడ్డి స్థానంలో రాఘవేంద్రకు టికెట్ ఖరారైనట్లు ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.
- ఆదోనిలో మీనాక్షినాయుడు తన కుమారుడు భూపాల్‌చౌదరికి టికెట్ ఇవ్వాలని అడుగుతున్నారు. అయితే పార్టీ మాత్రం మాన్వి దేవేంద్రప్ప పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా ఆదోని తమకు కావాలని, టీజీ విశ్వప్రసాద్‌కు మాట ఇచ్చానని పవన్ కళ్యాణ్ పట్టుబట్టినట్లు తెలుస్తోంది.
- పత్తికొండలో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కుమారుడు శ్యాంబాబు స్థానంలో ఆయన బాబాయ్ కేఈ ప్రభాకర్‌ను బరిలోకి దింపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కోడుమూరులో గత ఎన్నికల్లో ఓడిన ఐఏఎస్ అధికారి రామాంజనేయులును కాదని ఆకేపోగు ప్రభాకర్‌కు గానీ, కిరణ్మయికి గానీ టికెట్ ఇచ్చే యోచనలో అధిష్టానం ఉన్నట్టు సమాచారం.

అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తి

కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ టికెట్ల వ్యవహారాన్ని బీద రవిచంద్రయాదవ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. టికెట్ కోసం ఎవరైనా వీరి ద్వారా లోకేశ్, చంద్రబాబును కలిస్తే మొదట అడిగే ప్రశ్న 'ఎంత డబ్బు చూపిస్తావ్!' అని. వీరు చెప్పే మొత్తానికి, మరొకరు చెప్పే మొత్తాన్ని బేరీజు వేసి ఎక్కువ చెప్పిన వారి పేర్లను సిఫార్సు చేస్తున్నారు. దీంతో చాలామంది టీడీపీ అధిష్టానం తీరుపై అసంతృప్తితో ఉన్నారు. టికెట్లు ఖరారు చేసిన వెంటనే పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తంగా జిల్లాలో టీడీపీ 8 మంది ఇన్‌చార్జ్‌ల మార్పుతోపాటు 2 స్థానాలు జనసేనకు ఇచ్చేందుకు సిద్ధం కావడం చూస్తే 10 స్థానాల్లో అభ్యర్థులు గెలవలేరని అధిష్టానం స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది. టీడీపీ అధినాయకత్వం తీసుకునే నిర్ణయాలతో ఘోర పరాభవం తప్పదని ఆ పార్టీ ఇన్‌చార్జ్‌లే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

విశాఖ నుంచి 'గంటా' జంప్!

- ఎన్నికలొచ్చిన ప్రతిసారీ నియోజకవర్గాలను మారుస్తున్న టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు
- ఇప్పుడు ఏకంగా విశాఖ జిల్లా నుంచే మకాం ఎత్తివేత
- విజయనగరం జిల్లా నెల్లిమర్లపై కన్ను

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఒక నియోజకవర్గం తరిమేస్తే.. మరో నియోజకవర్గం.. ఆ నియోజకవర్గం నుంచి ఇంకో నియోజకవర్గం.. ఇలా ఎన్నికలు జరిగిన ప్రతిసారీ నియోజకవర్గాలను మారుస్తూ.. ప్రజలను ఏమారుస్తూ వస్తున్న టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఇప్పుడు తట్టాబుట్టా సర్దుకుని విశాఖ జిల్లా నుంచే మకాం మార్చేస్తున్నారు. ఇప్పటికే పోటీచేసిన నియోజకవర్గాల్లో ఎక్కడా ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో.. ఆయనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విశాఖలోని ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేసినా గెలిచే అవకాశం లేకపోవడంతో.. జిల్లా నుంచే జంప్ అవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈసారి విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఆయన ఎంచుకున్నట్టు సమాచారం. నెల్లిమర్లలో పోటీ చేస్తే ఎలా ఉంటుందనే విషయంపై సర్వే కూడా చేయించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రజలు నిలదీస్తారనే భయంతో..!

ఒకసారి పోటీ చేసిన ఏ నియోజకవర్గంలోనూ తిరిగి పోటీ చేయకపోవడానికి గంటా వైఖరే కారణమన్న విమర్శలున్నాయి. గెలవకముందు అనేక హామీలిచ్చి ఆ తర్వాత మిన్నకుండిపోవడం ఆయనకు అలవాటు. పోటీ చేసిన స్థానంలో మరోసారి పోటీ చేస్తే ఎక్కడ తనను ప్రజలు నిలదీస్తారోననే భయం గంటాను వెంటాడుతోంది. 2019లో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూడా ప్రజలకు కనిపించకుండాపోయారు. కనీసం ఏ ఒక్కరినీ పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడటంతో మళ్లీ గొంతు విప్పారు. ప్రతి ఎన్నికలకు సీటు మార్చే ఇటువంటి నాయకులను పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ.. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ మీద విమర్శలు చేయడంపై రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

భీమిలిలోనూ గెలిచే పరిస్థితి లేకపోవడంతో..

టీడీపీ నుంచి 1999లో రాజకీయరంగ ప్రవేశం చేసిన గంటా అనకాపల్లి ఎంపీగా పోటీ చేశారు. ఆ తర్వాత 2004లో చోడవరం ఎమ్మెల్యేగా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 2009లో అనకాపల్లికి మకాం మార్చి ఎమ్మెల్యేగా బరిలో నిలిచారు. 2014లో భీమిలి నుంచి ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేశారు. 2019లో విశాఖ ఉత్తరం నుంచి బరిలో నిలిచి గెలిచారు. తాజాగా భీమిలి నుంచి పోటీ చేద్దామని భావించినా.. గతంలో అక్కడి ప్రజలను పట్టించుకోకపోవడంతో పాటు ఏ రంగంలోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదు. మరోవైపు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు నేతృత్వంలో భీమిలిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. అంతేకాకుండా ఆయన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో తాను భీమిలిలో పోటీ చేసినా గెలిచే పరిస్థితి లేదని గ్రహించిన గంటా విజయనగరం జిల్లాపై కన్నేశారు.

టికెట్ మాదంటే మాది

అనంతపురం టీడీపీలో కత్తిమీద సాములా అభ్యర్థుల ఎంపిక

కళ్యాణదుర్గంలో పయ్యావుల అనుచరుడికి టికెటిస్తే ఓడిస్తామంటున్న తమ్ముళ్లు

ధర్మవరంలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు

టికెట్ల కేటాయించకముందే కత్తులు దూసుకుంటున్న తమ్ముళ్లు

అనంతపురం టీడీపీలో అభ్యర్థుల్ని ప్రకటించకముందే నియోజకవర్గాల్లో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి వైరి వర్గాలు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. టికెట్ మాదంటే మాది అని సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఇంత జరుగుతున్న టీడీపీ అధినాయకత్వం చోద్యం చూస్తుండడంపై పార్టీ శ్రేణులు అసహనంతో ఉన్నాయి. ప్రతి నియోజకవర్గంలో టీడీపీలో రెండు మూడు గ్రూపులు తమదే టికెట్ అంటూ సోషల్ మీడియాలో ప్రకటించేసుకుంటుండగా.. చివరికి ఎవరికి టికెట్ దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. మాకు కాదని టికెట్ ఇస్తే ఓడిస్తామంటూ సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సార్వత్రిక ఎన్నికల వేళ ఉమ్మడి అనంతపురం టీడీపీలో టికెట్ల ఎంపిక అభ్యర్థుల మధ్య చిచ్చు పెడుతోంది. రేసులో ఉన్న నాయకులు గ్రూపులుగా విడిపోయారు. సామాజిక మాధ్యమాల్లో ఫలానా వారికే టికెట్ అని కొన్ని గ్రూపులు ట్రోల్ చేస్తున్నాయి. కళ్యాణదుర్గంలో ఉమా మహేశ్వరనాయుడికి ఎమ్మెల్యే టికెట్ అంటూ ప్రచారం జరుగుతోంది. ఆయన పయ్యావుల కేశవ్‌కు అనుచరుడు. దీంతో ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గం కత్తులు నూరుతోంది. మేం 2014లో గెలిచాం.. 2019లో ఓడిన ఉమాకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తోంది. వీళ్లెవరూ కాకుండా బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబును కళ్యాణదుర్గం నుంచి బరిలోకి దించే యోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల్లో భారీగా డబ్బు ఖర్చు చేస్తారనే ఉద్దేశంతో ఆయన పేరు తెరపైకి వచ్చింది. అతనికి టికెట్ ఇస్తే ఉమా, ఉన్నం వర్గాలు కలిసి పనిచేసే పరిస్థితి లేదు. అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న కాల్వ శ్రీనివాసులు ప్రతి నియోజవర్గంలోనూ గ్రూపులు పోషించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.

సూరి వర్సెస్ శ్రీరాం

2019లో ఎన్నికల్లో ఓడిపోగానే కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీలోకి వెళ్లిన వరదాపురం సూరి మళ్లీ ప్రత్యక్షమయ్యారు. దీంతో పరిటాల శ్రీరాం–సూరి వర్గాల మధ్య ధర్మవరంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నువ్వెంతంటే నువ్వెంతంటూ సవాళ్లు విసురుకుంటున్నాయి.

'పల్లె'త్తు మాట అనను.. పోరు బాటే

ఇన్నాళ్లూ తనకే టికెట్ అంటూ ధీమాగా ఉన్న పల్లె రఘునాథరెడ్డి ఇప్పుడు మండిపడుతున్నారు. ఇక్కడ మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పకు టికెట్ అంటూ ప్రచారం జరగడంతో 'పల్లె' వర్గం కత్తులు దూస్తోంది. ఇన్నాళ్లూ కనిపించని కిష్టప్పకు ఇప్పుడే ప్రజలు గుర్తుకొచ్చారా? అంటూ మండిపడుతున్నారు. కదిరిలో కందికుంటకు టికెట్ ఇస్తే ఆయనకు మద్దతు ఇచ్చేదే లేదంటూ అత్తర్ చాంద్‌బాషా బహిరంగంగా చెబుతున్నారు. ఈ రెండు వర్గాల మధ్య నలిగిపోవడమెందుకని చాలామంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.

అలకబూనిన పార్థసారథి

పెనుకొండలోనూ తాజాగా సవితమ్మకు టికెట్ ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో బీకే పార్థసారథి అలకబూనారు. 'నేను ఎంపీగా వెళ్లను.. నేనూ ఇక్కడే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా' అంటున్నారు. మడకశిరలో రెండువర్గాల మధ్య చిచ్చురేపి తిప్పేస్వామి చలికాచుకుంటున్నారని ఎస్సీ, ఎస్టీలు భావిస్తున్నారు.

తాడిపత్రిలో జేసీకి సహకరించం

తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి కొడుకు అస్మిత్‌రెడ్డికి టికెట్ దాదాపు ఖరారైంది. జిల్లాలో ఏ ఒక్క నేత కూడా జేసీకి మద్దతు ఇవ్వడం లేదు. తీవ్ర అవినీతిలో కూరుకుపోయిన జేసీ సోదరుల పేరు చెప్పడానికి కూడా ఏ నాయకుడూ ముందుకు రాలేదు. శింగనమలలో పోటీచేసి ఓడిపోయిన బండారు శ్రావణికి 'యువగళం' పాదయాత్ర సమయంలో తీవ్ర అవమానం జరిగింది. శ్రావణి తండ్రిపై దాడి చేసినా లోకేశ్ పట్టించుకోలేదు. దీంతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తలు టీడీపీపై అసంతృప్తితో ఉన్నారు. దళితులపై దాడి చేసినా టీడీపీ అధినాయకులు పట్టించుకోలేదని, మళ్లీ టికెట్ కోసం పాకులాడటం అవమానంగా ఆ వర్గాలు భావిస్తున్నాయి.

పనికిరాని బాబు.. పచ్చి మోసగాడు

చంద్రబాబుపై ఎంపీ కేశినేని ధ్వజం

సాక్షి, అమరావతి: ''చంద్రబాబు పచ్చి మోసగాడు.. ఈ రాష్ట్రానికి పనికిరాని వ్యక్తి అని తెలిసి కూడా విజయవాడపై ప్రేమ, నియోజకవర్గం కోసమే టీడీపీలో ఇంతకాలం ఉన్నా..'' అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వ్యాఖ్యానించారు. టీడీపీలో ఎన్నో అవమానాలను ఓర్చుకున్నానని, ఇక భరించలేక బయటికి వచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 'సీఎం జగన్ పేదల పక్షపాతి. ఆయన విధానాలు నాకు నచ్చాయి. సీఎం జగన్ వెనుక నడవాలని నిర్ణయించుకున్నా. పార్టీ కోసం ఆయన ఏం చేయమంటే అది చేస్తా..' అని పేర్కొన్నారు. తాను నైతిక విలువలు పాటించే వ్యక్తినని, టీడీపీకి రాజీనామాతోపాటు ఎంపీ పదవికి రాజీనామాను స్పీకర్ ఫార్మాట్‌లో పంపుతానన్నారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరతానని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలసిన అనంతరం ఎంపీ కేశినేని నాని మీడియాతో మాట్లాడారు. సీఎంను మర్యాద పూర్వకంగానే కలిశానని చెప్పారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో కేశినేని, అయోధ్య, అరుణ్‌కుమార్, వెలంపల్లి, అవినాశ్

నాతో నెల జీతాలు ఇప్పించారు..

పేదలకు అండగా ఉన్న సీఎం జగన్ వెంట నడవాలని నిర్ణయించుకున్నట్లు ఎంపీ కేశినేని నాని వెల్లడించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడితో ప్రెస్‌మీట్ పెట్టించి తనను దూషించారని, చెప్పు తీసుకొని కొడతానని ఓ క్యారెక్టర్‌లెస్ వ్యక్తి తిట్టినా పార్టీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను గొట్టంగాడు అని దారుణంగా అవమానించినా భరించానన్నారు. 'ఉమ్మడి కృష్ణా జిల్లాలో పార్టీని నా భుజస్కంధాలపై నడిపించా. పార్టీ కోసం నా సొంత వ్యాపారాలను పక్కనపెట్టా. చంద్రబాబు పాదయాత్ర, స్థానిక సంస్థల ఎన్నికలను నా భుజాలపై మోశా. కొందరికి నెలవారీ జీతాలు ఇవ్వమని చంద్రబాబు చెబితే డబ్బులు ఖర్చు పెట్టా. తొమ్మిదేళ్లుగా పార్టీలో ఉంటే నేను చేసిన తప్పేమిటో కనీసం చెప్పాలి కదా?' అని ఎంపీ కేశినేని పేర్కొన్నారు.

లోకేశ్.. అఫ్ట్రాల్

'టీడీపీ కోసం నేను అమ్ముకున్న ఆస్తుల విలువ రూ.2 వేల కోట్లు ఉంటుంది. చివరకు నా కుటుంబంలో చిచ్చు పెట్టారు. నా కుటుంబ సభ్యులతో, రౌడీలతో కొట్టించాలని లోకేశ్ ఎందుకు ప్రయత్నించారు? లోకేశ్ అనే వ్యక్తి అఫ్ట్రాల్..! చంద్రబాబు కుమారుడిగా మినహాయిస్తే ఆయనకు ఎలాంటి అర్హతా లేదు. అతడికి పార్టీ అన్నీ ఇచ్చినా ఓడిపోయాడు. నేను నా సొంత వనరులతో గెలిచా. అలాంటిది అతడి వద్ద మోకరిల్లాలంటే సాధ్యం కాదు' అని కేశినేని స్పష్టం చేశారు.

బొండా భార్యను నిలబెడితే ప్రమాదం..

'విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బొండా ఉమ భార్యను నిలబెడితే చాలా ప్రమాదం. నీ కుమార్తెను పోటీ చేయించు అని చంద్రబాబు నాతో అన్నారు. విజయవాడ మేయర్ అభ్యర్థిగా శ్వేతను చంద్రబాబే నిర్ణయించారు. ఆయన మూడు రోజులు అడిగితేనే ముందుకొచ్చాం. టీడీపీ కోసం సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని చాలా మంది హితవు చెప్పినా వినకుండా పార్టీలో కొనసాగా' అని కేశినేని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం కార్యక్రమాలకు హాజరు కానివ్వలేదు

'చంద్రబాబు పచ్చి మోసగాడని ప్రపంచానికి తెలుసు. ఇంత దగా చేస్తాడనుకోలేదు. ప్రోటోకాల్ ప్రకారం ఎంపీగా ముఖ్యమంత్రి కార్యక్రమాలకు నేను హాజరు కావాలి. కానీ సీఎం కార్యక్రమాలకు చంద్రబాబు నన్ను హాజరు కానివ్వలేదు. చంద్రబాబు ఏపీకి పనికి రాని వ్యక్తి. టీడీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ఇప్పటికే ప్రకటించా. నా రాజీనామా ఆమోదం పొందగానే వైఎస్సార్‌సీపీలో చేరుతా' అని ఎంపీ కేశినేని చెప్పారు.

బెజవాడ, గుంటూరు నిజం.. అమరావతి ఓ కల

'నాకు విజయవాడ అంటే ప్రాణం. విజయవాడ కోసం చంద్రబాబు రూ.100 కోట్లైనా ఇచ్చాడా? కానీ విజయవాడ కోసం నేను ఎంతో చేశా. షాజహాన్ తాజ్‌మహల్ కడితే నేను అమరావతి కడతానంటూ చంద్రబాబు గొప్పలు చెప్పారు. విజయవాడ, గుంటూరు మాత్రమే నిజం.. అమరావతి ఒక కలే. అది భ్రమరావతి. అక్కడంతా రియల్ ఎస్టేట్' అని కేశినేని నాని పేర్కొన్నారు.

కేశినేని బాటలో క్యాడర్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎంపీ కేశినేని నాని టీడీపీని వీడటంతో నగర పరిధిలో పార్టీ క్యాడర్ ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైంది. విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ మూడు నియోజక వర్గాల్లోనూ కేశినేని నానికి బలమైన క్యాడర్ ఉంది. నానికి మద్దతుగా వారంతా వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు. టీడీపీ నేతలు బొండా ఉమా, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా తదితరులపై తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు క్యాడర్‌ను పట్టించుకోరన్నది బహిరంగ రహస్యమే! లోకేశ్ వ్యవహార శైలితో పార్టీకి భవిష్యత్ లేకుండా పోయిందని కార్యకర్తలు వాపోతున్నారు. మరోవైపు ఎంపీ కేశినేని నాని బుధవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలసిన సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ కీలక నేతలంతా అక్కడే ఉండటం ఇకపై వారంతా సమన్వయంతో పని చేస్తారనే సానుకూల సంకేతాలను పంపింది.

గ్రామీణ ప్రాంతాల్లో పట్టు

ఎంపీ కేశినేని నానికి ఎన్టీఆర్ జిల్లా మైలవరం నుంచి జగ్గయ్యపేట, తిరువూరు వరకు బలమైన అనుచర గణం ఉంది. ప్రధానంగా వారంతా దేవినేని ఉమా బాధితులే కావడం గమనార్హం. గ్రామాల్లో కేశినేని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఓ మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ స్థాయి నేతలతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు వైఎస్సార్ సీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మైలవరంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, నందిగామలో ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు తదితరులకు కేశినేని నానితో మొదటి నుంచి సత్సంబంధాలున్నాయి. నియోజక వర్గ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా వారు కలసి పని చేయడాన్ని అన్ని వర్గాలు ప్రశంసించాయి. తాజా పరిణామాలు తిరువూరు, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయనున్నాయి. కాగా, చంద్రబాబు పచ్చి మోసగాడని, ఈ రాష్ట్రానికి పనికి రాని వ్యక్తి అని ఎంపీ కేశినేని నాని తాజాగా చేసిన వ్యాఖ్యలు టీడీపీలో కలకలం రేపుతున్నాయి. బాబు మోసాలను బహిర్గతం చేస్తూ కేశినేని మాట్లాడిన మాటలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. కేశినేని పార్టీని వీడటం ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీకి గట్టి షాక్ తగిలినట్లేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా...

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా పవిత్ర మురళీకృష్ణ



భవానీపురం (విజయవాడపశ్చిమ): ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన ఎస్ఎమ్ పవిత్ర మురళీ కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరాము బుధవారం విడుదల చేసిన జీవోను ఆమె అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వేల్పూరులో పిండమార్పిడి ద్వారా సత్ఫలితాలు



దూడ, జన్మనిచ్చిన ఆవు

అచ్చంపేట: పిండమార్పిడి విధానం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని పశుసంవర్ధకశాఖ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ముత్తారావు తెలిపారు. మండలంలోని వేల్పూరులో పిండ మార్పిడి విధానం ద్వారా రైతు పొన్నెకంటి వెంకట్రావుకు చెందిన ఆవు ఆరోగ్యవంతమైన దూడను ప్రసవించగా బుధవారం శాస్త్రవేత్తలు, పశువైద్యాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముత్తారావు మాట్లాడుతూ తమశాఖకు చెందిన సీనియర్ పశువైద్యాధికారి డాక్టర్ మల్లయ్య ఆవుకు పిండమార్పిడి విధానం ద్వారా వైద్యసేవలు అందించారన్నారు. వారి సేవలు ఫలించి దూడ జన్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ కాంతారావు, సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట్రామయ్య, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్యామీదేవి పాల్గొని రైతు పొన్నెకంటి వెంకట్రావును అభినందించారు.

19 నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక సర్వే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక స్థితిగతుల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.గిరిజాశంకర్ బుధవారం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ నెల 19వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేని పదిరోజుల్లో.. ఈ నెల 28వ తేదీకి పూర్తిచేయాలని నిర్దేశించారు. సర్వేకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ నెల 11వ తేదీలోగా శిక్షణ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీలోగా సర్వే సిబ్బందిని, పర్యవేక్షణ సిబ్బందిని మ్యాపింగ్ చేయాలని, 17వ తేదీలోగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు. సర్వే సమయంలో మిస్ అయిన కుటుంబాలు, వ్యక్తులు ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీలోపు స్వయంగా గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి తమ వివరాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం సర్వే వివరాలను సచివాలయాల వారీగా సరిచూసుకోవడంతోపాటు ధ్రువీకరణతో ఫిబ్రవరి 15వ తేదీలోగా ఖరారు చేయాలని నిర్దేశించారు. దీనిపై జిల్లా, మండల, మున్సిపల్ అధికారులకు తగిన ఆదేశాలు జారీచేయాలని కలెక్టర్లకు సూచించారు.

సీఎం ఫొటో ముద్రణపై కౌంటర్ దాఖలు చేయండి

- ధ్రువీకరణ పత్రాల్లో ఫొటోపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు
- తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కుల, స్థానికత, జనన ధ్రువీకరణ పత్రాలపై సీఎం వైఎస్ జగన్ ఫొటోతో పాటు నవరత్నాల లోగోను ముద్రించటంపై హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరింది. ఈ విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా సీఎస్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, గ్రామ వార్డు సచివాలయాల శాఖ ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీలకు జారీ చేసే కుల, స్థానికత, జనన ధ్రువీకరణ పత్రాలపై ముఖ్యమంత్రి ఫొటోతో పాటు నవరత్నాల లోగో ముద్రణను చట్ట విరుద్ధంగా ప్రకటించి, ఇకపై వాటిని ముద్రించకుండా అధికారులను నియంత్రిస్తూ ఆదేశాలు జారీ చేయాలంటూ అమరావతి బహుజన సొసైటీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ, ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో కేంద్ర హోం శాఖ మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ జీవో ఉందని తెలిపారు. వీటి ప్రకారం ధ్రువీకరణ పత్రాలపై జాతీయ చిహ్నం మాత్రమే ముద్రించాల్సి ఉంటుందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

జగనన్న కాలనీలకు స్వాగత ద్వారాలు

25, అంతకంటే ఎక్కువ ఇళ్లు ఉన్న జగనన్న కాలనీలకు ప్రత్యేకం
5,684 కాలనీల్లో నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



5,684 ఆర్చిల నిర్మాణానికి శ్రీకారం

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద నిరుపేదలకు ప్రభుత్వం గృహ యోగం కల్పిస్తోంది. జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి గేటెడ్ కమ్యూనిటీల రీతిలో తీర్చిదిద్దుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రూ. 75 వేల కోట్ల విలువ చేసే స్థలాలను 30.7 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసింది. అంతేకాకుండా ఇంటి నిర్మాణానికి రూ. 2.70 లక్షల ఆర్థికసాయం అందజేస్తోంది. 17,005 వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్తగా ఊళ్లనే నిర్మిస్తోంది. కాలనీల్లో మౌలిక వసతులను కల్పించి గేటెడ్ కమ్యూనిటీల్లా రూపొందిస్తోంది. ఇందులో భాగంగా 25 అంతకంటే ఎక్కువ ఇళ్లు ఉన్న కాలనీలకు స్వాగత ద్వారాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

21.75 లక్షల (19.13 లక్షల సాధారణ +2.62 లక్షల టిడ్కో) ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. సాధారణ ఇళ్లు నిర్మిస్తున్న 5,684 కాలనీలకు ఆర్చ్‌లు నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.100 కోట్లు ఖర్చు చేసేందుకు పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేసింది. ఇప్పటికే ఈ పనుల కోసం 2,314 ప్రాంతాల్లో టెండర్లను ఖరారు చేయగా వీటిలో 594 కాలనీల్లో పనులు ప్రారంభించారు. పలు కాలనీల్లో వీటి నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి. ఖరీదైన ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రూ. 32,909 కోట్లతో కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, నీటి సరఫరా తదితర సౌకర్యాలను కల్పిస్తోంది.

పట్టు సడలని దీక్ష



- వికేంద్రీకరణకు మద్దతుగా 1,200 రోజులుగా రిలే నిరాహార దీక్షలు
- మూడు రాజధానులకే తమ మద్దతని బహుజన పరిరక్షణ సమితి స్పష్టీకరణ

తాడికొండ: మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపడుతోన్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1,200వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సమితి నేతలు దీక్షా శిబిరం వద్ద మాట్లాడారు. చంద్రబాబు అండ్ కో కుల ఉగ్రవాదులు, ఎన్ఆర్ఐలు కలిసి అమరావతి పేరుతో ఫేక్ ఉద్యమాన్ని నడిపిస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న చంద్రబాబు నిత్యం అదే పంథాలో ప్రజలను మోసం చేయాలనే దురుద్దేశంతో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అబద్ధాలు వల్లిస్తూ నిజాలను దాచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బహుజనులను అణగదొక్కడం, తన సామాజిక వర్గాన్ని పైకి లేపడమే చంద్రబాబు లక్ష్యమని, ఆయన దుర్మార్గ ఆలోచనలు గ్రహించిన ప్రజలు ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. బాబు అవినీతిపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించి అమరావతి ఉద్యమ మూలాలకు పెట్టుబడులు పెడుతున్న వ్యక్తుల వివరాలపై నిఘా పెడితే రాజధాని దోపిడీ మొత్తం బయటపడుతుందని చెప్పారు. సమితి నేతలు కారుమూరి పుష్పరాజు, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు, బొలిమేర శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, మహిళలు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్- భారత్ సత్సంబంధాలు భేష్

ఇజ్రాయెల్ రాయబారి నార్‌గిలోన్



నకరికల్లు: ఇజ్రాయెల్–భారత్ సంబంధాలు మెరుగుపరచడంలో భారత్ కృషి అభినందనీయమని ఇజ్రాయెల్ రాయబారి నార్‌గిలోన్ కొనియాడారు. రైతుల ప్రయోజనాల కోసం ఏపీ ప్రభుత్వం కృషి ఆదర్శనీయమన్నారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి వద్ద ఇండో–ఇజ్రాయెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాజెక్టు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. నార్‌గిలోన్ మాట్లాడుతూ.. ప్రాజెక్టుల ఏర్పాటుతో భారత్–ఇజ్రాయెల్ సంబంధాలు మరింత మెరుగుపడతాయన్నారు. రాబోయే రోజుల్లో భారత్‌లో మరో 14 ప్రాజెక్టులు తీసుకొస్తామని వివరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి అహర్నిశలు పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గుండ్లపల్లి సమీపంలో సుమారు 25 ఎకరాల్లో రూ.25 కోట్ల ఇండో–ఇజ్రాయెల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 16,106 హెక్టార్లలో పండ్ల తోటలు, కూరగాయలు, 1.39 లక్షల ఎకరాల్లో మిర్చి, సుగంధ ద్రవ్యాలు సాగు జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జేసీ ఏ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆప్కోలో సంక్రాంతి ప్రత్యేక ఆఫర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆప్కో విక్రయశాలల్లో సంక్రాతి పండుగ సందర్భంగా సరికొత్త వస్త్ర శ్రేణిపై 30శాతం ప్రత్యేక రాయితీ అమలు చేస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ కమిషనర్, ఆప్కో వైస్ చైర్మన్, ఎండీ ఎంఎం నాయక్ బుధవారం తెలిపారు. ఎంపిక చేసిన వస్త్ర శ్రేణిపై 50 శాతం వరకు ప్రత్యేక రాయితీని ఇస్తున్నామన్నారు. ఈ అవకాశం ఈ నెల 21 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. చేనేత మగ్గాలపై నేసిన, నాణ్యమైన, పేరెన్నికగల వెంకటగిరి, మంగళగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ, పట్టు, కాటన్ చీరలు, మదనపల్లి, ధర్మవరం పట్టు చీరలు, పోలవరం, అంగర, బందరు, రాజమండ్రి మోరి కాటన్ ఫ్యాన్సీ చీరలు, తువాళ్లు, ధోవతులు, లుంగీలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

టెండర్ ప్రక్రియ కొనసాగించుకోండి

- బీచ్ శాండ్ తవ్వకాల పీడీవోఎంపికపై హైకోర్టు
- టెండర్లను మాత్రం ఎవరికీ ఖరారు చేయవద్దు
- పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం
- విచారణ ఫిబ్రవరి 21కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం, శ్రీకాకుళం జిల్లా గార మండలం పరిధిలో బీచ్ శాండ్ తవ్వకాల విషయంలో ప్రాజెక్టు డెవలపర్ అండ్ ఆపరేటర్ (పీడీవో) ఎంపికకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అనుమతినిచ్చింది. అయితే టెండర్లను మాత్రం ఎవరికీ ఖరారు చేయవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ కేంద్ర గనుల శాఖ కార్యదర్శి, కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, అణుశక్తి కార్యదర్శి, రాష్ట్ర గనుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భీమునిపట్నం, గార మండలం పరిధిలో బీచ్ శాండ్ తవ్వకాల విషయంలో పీడీవో ఎంపికకు సంబంధించి ఖనిజాభివృద్ధి సంస్థ టెండర్లను ఆహ్వానిస్తూ గతేడాది డిసెంబర్ 14న జారీ చేసిన డాక్యుమెంట్‌ను సవాలు చేస్తూ విశాఖపట్నం, అక్కయ్యపాలెంకు చెందిన జమ్మిశెట్టి వెంకట సత్యనారాయణ మూర్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు.

రేపటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 12న బ్రహ్మోత్సవాలకు అంకురారోహణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయి. 13 నుంచి స్వామి, అమ్మ వార్లకు విశేష వాహన సేవలు నిర్వహిస్తారు. 13న భృంగి వాహన సేవ, 14న రావణ వాహన సేవ, 15న నంది వాహన సేవ, బ్రహ్మోత్సవ కల్యాణం, 16న కైలాస వాహన సేవ, 17న పూర్ణాహుతి, 18న అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం జరుగుతాయి. మకర సంక్రాంతి రోజున స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తారు.

అంగన్‌వాడీలపై తీసుకున్న చర్యలేంటి?

- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- సమ్మెపై ఎస్మా ప్రయోగించాం
- నోటీసులు కూడా జారీ చేశాం
- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం
- తదుపరి విచారణ 22కి వాయిదా

సాక్షి, అమరావతి: గర్భిణిలు, శిశువులకు పౌష్టికాహారం అందచేయాల్సిన అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే వారిపై ఏం చర్యలు తీసుకున్నారని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీల సమ్మెను విరమింప చేసేందుకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం లేక గర్భిణిలు, శిశువులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కృష్ణా జిల్లాకు చెందిన న్యాయవాది కొలుసు ఉషారాణి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై శుక్రవారం మధ్యాహ్నం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది జీఆర్ సుధాకర్ వాదనలు వినిపిస్తూ, డిమాండ్ల సాధన పేరుతో అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన పలు కార్యక్రమాల అమలుకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ముఖ్యంగా పౌష్టికాహారం అందక గర్భిణిలు, శిశువులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, పౌష్టికాహారాన్ని ఎలా సరఫరా చేస్తున్నారని ప్రశ్నించింది. అలాగే సమ్మె చేస్తున్న వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారని కూడా ప్రశ్నించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, ప్రభుత్వ న్యాయవాది నర్సింహారెడ్డి స్పందిస్తూ, అంగన్‌వాడీలు గత 20 రోజులుగా విధులకు దూరంగా ఉన్న విషయం వాస్తవమేనన్నారు. సమ్మె విరమింప చేసేందుకు వారితో చర్చలు జరుగుతున్నాయని శ్రీరామ్ తెలిపారు. ఎస్మా కూడా ప్రయోగించామన్నారు. గ్రామ సచివాలయాలు, రెవెన్యూ పంచాయతీరాజ్ శాఖల సేవలను వాడుకుంటున్నామని తెలిపారు. ఈ ఏర్పాట్లు ఎంత మాత్రం సరిపోవని, ఈ విషయాన్ని తాము అంగీకరిస్తున్నామన్నారు. సమ్మె చేస్తున్న వారికి నోటీసులు కూడా ఇచ్చామన్నారు. విధుల్లో చేరకుంటే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏజీ వివరించారు.

షరతులతో చంద్రబాబుకు ముందస్తు బెయిల్

ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక, మద్యం కేసుల్లో మంజూరు చేసిన హైకోర్టు

- వారంలోపు దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలి
- కేసు గురించి బహిరంగంగా మాట్లాడవద్దు
- ఎప్పుడు పిలిస్తే అప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలి
- కేసులపై సమాచారం ఇచ్చే వారిని బెదిరించడం, ప్రలోభపెట్టడం చేయరాదు
- మద్యం కేసులో కొల్లు రవీంద్ర, శ్రీనరేష్‌లకు కూడా ముందస్తు బెయిల్

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ భూ కుంభకోణం, ఉచిత ఇసుక, మద్యం విధానాల్లో అక్రమాలపై సీఐడీ నమోదు చేసిన కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ అప్పటి కమిషనర్ శ్రీ నరేష్‌లకు కూడా ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. ఇప్పటి నుంచి వారంలోపు దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని చంద్రబాబు, రవీంద్ర, శ్రీ నరేష్‌లను హైకోర్టు ఆదేశించింది. రూ. లక్షకు రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలంది. ముందస్తు బెయిల్‌పై విడుదలైన తరువాత ఎప్పుడు పిలిస్తే అప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. అయితే 48 గంటల ముందు నోటీసు ఇవ్వాలని దర్యాప్తు అధికారికి స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. ఈ కేసుల గురించి తెలిసిన వ్యక్తిని.. ఆ కేసుల వాస్తవాలను కోర్టుకు గానీ, పోలీసులకు గానీ చెప్పకుండా బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ, వాగ్దానాలు చేయడం గానీ ఎంత మాత్రం చేయడానికి వీల్లేదంది. ఈ కేసులకు సంబంధించి ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయడానికి వీల్లేదని బాబు తదితరులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం తీర్పులు వెలువరించారు.

కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడంలేదు..

తాను వెలువరించిన ఈ తీర్పులు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి ఇవ్వడం లేదని, ఇందులో వ్యక్తం చేసిన అభిప్రాయాలు కేవలం ప్రాథమికమైనవేనని, కేవలం ఈ ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణకే ఈ అభిప్రాయాలు పరిమితమని న్యాయమూర్తి తన తీర్పుల్లో పేర్కొన్నారు. ఈ తీర్పుల్లో వ్యక్తం చేసిన అభిప్రాయాలకు ప్రభావితం కాకుండా దర్యాప్తును కొనసాగించుకునే స్వేచ్ఛ దర్యాప్తు సంస్థకు ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ ఇటీవల కొన్ని మీడియా చానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసు దర్యాప్తును ప్రభావితం చేసేలా, సాక్షులను బెదిరించేలా మాట్లాడారని, ఈ విషయాన్ని ఐఆర్ఆర్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పునిచ్చే సమయంలో పరిగణనలోకి తీసుకోవాలన్న సీఐడీ మెమోపై కూడా న్యాయమూర్తి తన తీర్పులో చర్చించారు. లోకేశ్ ఇంటర్వ్యూ ఆధారంగా బాబు ముందస్తు బెయిల్‌ను నిర్ణయించజాలమని న్యాయమూర్తి తేల్చి చెప్పారు.

గతంలో పూర్తయిన వాదనలు

కావాల్సిన వారి కోసం ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పులతో పాటు క్విడ్ ప్రో కోకు పాల్పడినందుకు సీఐడీ కేసు నమోదు చేసి అప్పటి సీఎం చంద్రబాబు, అప్పటి మంత్రులు నారాయణ, లోకేశ్ తదితరులను నిందితులుగా చేర్చింది. అలాగే, ఉచిత ఇసుక పథకం పేరుతో కోట్లాది రూపాయలు ఖజానాకు నష్టం కలిగించినందుకు సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక బాబు సీఎంగా ఉండగా తమ పార్టీకి చెందిన నేతల డిస్టిలరీలు, బార్లకు లబ్ధి చేకూర్చడం వల్ల ఖజానాకు రూ. 1,500 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక విచారణ జరిపిన సీఐడీ, అప్పటి ఎక్సైజ్ కమిషనర్ శ్రీనరేష్, అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, చంద్రబాబులపై కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ వారు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై వేర్వేరుగా న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జున రావు విచారణ జరిపారు. ఇటీవల ఈ వ్యాజ్యాలపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలన్నింటిపై బుధవారం మధ్యాహ్నం ఆయన తన తీర్పును వెలువరించారు.

ఓటుకు కోట్లు కేసు విచారణ ఏప్రిల్‌కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణ సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఓటుకు కోట్లు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు పేరు చేర్చాలని, ఈ కేసును సీబీఐకు అప్పగించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ బుధవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవిందకుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రం తరఫు న్యాయవాది విచారణ వాయిదా వేయాలని లెటర్ సర్క్యులేట్ చేసిన కారణంగా విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణ ఏప్రిల్ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

శ్రీశారదా పీఠాధిపతికి 'అయోధ్య' ఆహ్వానం



పెందుర్తి: అయోధ్య రామ జన్మభూమిలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ విశేషోత్సవానికి విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి ఆహ్వానం అందింది. బుధవారం చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో స్వామీజీని కలిసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆహ్వానపత్రికను అందించి వేడుకకు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి: ఎంపీ కృష్ణయ్య

భవానీపురం (విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వెనుకబడిన కులాల వర్గాలు వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ హక్కుల సాధన సమితి నూతన రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైంది. ఆర్.కృష్ణయ్య హైదరాబాద్‌లోని తన నివాసంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. సమితి గౌరవ అధ్యక్షులుగా దగ్గడ్ సాయి, రాష్ట్ర అధ్యక్షుడిగా పిల్లి రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోమలి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శిగా మచ్చ నాగేంద్ర, సంయుక్త కార్యదర్శిగా చింతల వెంకటరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా చాపల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లి ప్రసాద్, గౌరవ సలహాదారులుగా డాక్టర్ ఎస్.మారేశ్, చెరుకుల రాజేందర్ ఎన్నికయ్యారు. కృష్ణయ్య మాట్లాడుతూ అందరం కలిసి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

క్లుప్తంగా...

కొందరినే అనుమతిస్తాం

రాహుల్ జోడో యాత్రపై మణిపూర్

ఇంఫాల్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తలపెట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభానికి మణిపూర్‌లోని బీజేపీ సంకీర్ణ సర్కారు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. జనవరి 14న మణిపూర్‌ను యాత్రకు శ్రీకారం చుట్టాలని కాంగ్రెస్ నిర్ణయించడం తెలిసిందే. ఇంఫాల్‌లోని హప్తా మైదానం నుంచి యాత్ర ప్రారంభానికి పార్టీ అనుమతి కోరింది. అందులో పాల్గొనే వారి సంఖ్య పరిమితంగా ఉండాలని ఇంఫాల్ ఈస్ట్ కలెక్టర్ కార్యాలయం బుధవారం జారీ చేసిన అనుమతి ఉత్తర్వుల్లో పేర్కొంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ఈ మేరకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది. యాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనే వారి సంఖ్య, పేర్లను ముందుగానే తెలపాలని షరతు విధించింది. ఈ నేపథ్యంలో ఇంఫాల్ నుంచి యాత్ర ప్రారంభంపై కాంగ్రెస్ పునరాలోచనలో పడింది. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు.

'370'పై రివ్యూ పిటిషన్లు

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన 370 ఆర్టికల్ రద్దు సబబేనన్న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై సమీక్ష కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. జమ్మూ కశ్మీర్ హైకోర్టు బార్ అసోసియేషన్, అవామీ నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్ సహా పలువురు ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు చేశారు. ధర్మాసనం తీర్పు లోపభూయిష్టమని, 370 ఆర్టికల్ తాత్కాలిక ఏర్పాటనడం సబబు కాదని పేర్కొన్నారు.

భాగవత్‌కు 'అయోధ్య' ఆహ్వానం

న్యూఢిల్లీ: అయోధ్యలో జనవరి 22న రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌కు ఆహ్వానం అందింది. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా, వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ బుధవారం ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అధికారికంగా ఇప్పటిదాకా దాదాపు 6,000 మందికి ప్రాణప్రతిష్ఠకు ఆహ్వానాలు అందాయి.

బ్యాట్ గుర్తు ఇమ్రాన్ పార్టీదే

పెషావర్: పాకిస్థాన్‌లో కీలకమైన జాతీయ ఎన్నికల ముందు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ)కి భారీ ఊరట దొరికింది. పార్టీ ఎన్నికల చిహ్నమైన క్రికెట్ బ్యాట్‌ను దానికే తిరిగి కేటాయిస్తూ పెషావర్ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. పీటీఐకి బ్యాట్ చిహ్నాన్ని రద్దు చేస్తూ దేశ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టేసింది. అది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

హ్యాట్రిక్‌పై బీజేపీ గురి...!

లోక్‌సభ ఎన్నికల్లో 50 శాతం ఓట్లే లక్ష్యం



ముమ్మరంగా కసరత్తు

- ఈసారి ఎక్కువ స్థానాల్లో బరిలోకి
- 70 ఏళ్లు దాటిన వారికి నో టికెట్!
- మూడుసార్లకు మించి నెగ్గినా అంతే
- బలహీన స్థానాల బాధ్యతలు మంత్రులకు

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ నెగ్గి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్న బీజేపీ ఆ దిశగా సన్నాహాలను వేగవంతం చేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తాలూకు ఊపును కొనసాగించేలా పార్టీ నేతలను, శ్రేణులను సమాయత్తం చేస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 50 శాతానికి పైగా ఓట్ల సాధనను బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది! ఈ మేరకు రాష్ట్రాలవారీగా ముఖ్య నేతలకు అధినాయకత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ఇటీవలి బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు నేతలందరికీ ఈ మేరకు స్పష్టం చేయడంతో పాటు ఆ దిశగా బాధ్యతలు కూడా అప్పగించినట్టు సమాచారం. 50 శాతం ఓట్ల లక్ష్యసాధన కోసం 2019తో పోలిస్తే ఈసారి వీలైనన్ని ఎక్కువ లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఇందుకు ఎన్డీఏ మిత్రపక్షాలను ఒప్పించే ప్రయత్నాలకు పార్టీ ఇప్పటికే శ్రీకారం చుట్టింది. 2019తో పోలిస్తే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సంఖ్య తగ్గడం కూడా తాను ఎక్కువ చోట్ల పోటీ చేసేందుకు వీలు కల్పిస్తుందని బీజేపీ భావిస్తోంది. పంజాబ్‌లో అకాలీదళ్, బిహార్లో జేడీ(యూ)తో బీజేపీకి ఇప్పటికే తెగదెంపులవడం తెలిసిందే. తమిళనాడులో అన్నాడీఎంకే, రాజస్థాన్‌లో ఆరెల్పీలతోనూ అటూ ఇటుగా అదే పరిస్థితి. ఇక మహారాష్ట్రలో శివసేన చీలికలో ఏక్‌నాథ్ షిండే వర్గానికి బీజేపీ మద్దతుగా నిలిచి ప్రభుత్వ ఏర్పాటుకు దోహదపడింది. కనుక షిండే సేనకు వీలైనన్ని తక్కువ లోక్‌సభ సీట్లిచ్చి అత్యధిక స్థానాల్లో తానే పోటీ చేసేలా కన్పిస్తోంది.

నెలాఖరు నుంచి జాబితాలు...!

జనవరి నెలాఖరు, లేదా ఫిబ్రవరి తొలి వారం నుంచి బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల జాబితాలు విడుదలయ్యే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ''తొలి జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వంటి దిగ్గజాల పేర్లుంటాయి. తద్వారా ఎన్నికల వాతావరణానికి దేశవ్యాప్తంగా ఊపు తేవాలన్నది లక్ష్యం'' అని వివరించాయి. 2019 లోక్‌సభ ఎన్నికలప్పుడు కూడా మోదీ, షా, రాజ్‌నాథ్ పేర్లు తొలి జాబితాలోనే చోటుచేసుకోవడం తెలిసిందే. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ స్థానాలు నెగ్గేందుకు బీజేపీ పలు చర్యలు చేపడుతోంది...

1. తొలి జాబితాలో వీలైనన్ని ఎక్కువ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనుంది. ముఖ్యంగా 2019లో పార్టీ ఇబ్బందులను ఎదుర్కొన్న, తక్కువ మెజారిటీతో నెగ్గిన స్థానాలపై ఈ జాబితాలో బీజేపీ ప్రధానంగా దృష్టి పెట్టనుంది. నిజానికి వీటిని 'సవాలు స్థానాలు'గా ఎప్పుడో గుర్తించింది. గత ఎన్నికల ఫలితాలు రాగానే వాటిపై గట్టిగా దృష్టి పెట్టింది. ఆయా స్థానాల్లో పరిస్థితిని మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నిస్తూ వస్తోంది.

2. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గాను 2019 ఎన్నికల్లో బీజేపీ 436 చోట్ల పోటీ చేసింది. 303 స్థానాలు నెగ్గి 133 చోట్ల ఓటమి చవిచూసింది. వాటితో పాటు బాగా బలహీనంగా మరో 31 స్థానాలపై బీజేపీ ఈసారి బాగా ఫోకస్ చేస్తోంది. వీటిని తొలి జాబితాలో చేర్చనుంది.

3. ఈ 164 'టార్గెటెడ్' స్థానాల్లో గెలుపు బాధ్యతలను అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, సీనియర్ నేతలకు అప్పగించనుంది. వీటినిప్పటికే రెండు గ్రూపులుగా బీజేపీ విభజించింది. 45 మంది కేంద్ర మంత్రులు ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు స్థానాల చొప్పున బాధ్యతలను భుజాలకెత్తుకుంటారు.

4. ఢిల్లీ పీఠానికి రాచబాటగా పరిగణించే కీలకమైన ఉత్తరప్రదేశ్‌పై ఈసారి బీజేపీ మరింతగా ఫోకస్ చేస్తోంది. రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లకు గాను 2019 ఎన్నికల్లో 16 చోట్ల బీజేపీ ఓటమి చవిచూసింది. అనంతరం రాయ్‌బరేలీ, మెయిన్‌పురి స్థానాలను ఉప ఎన్నికల్లో చేజిక్కించుకుంది. మిగతా 14 లోక్‌సభ స్థానాల్లో పార్టీ బాగా బలహీనంగా ఉందన్న అంచనాతో వాటిపై బాగా దృష్టి పెడుతోంది. రాయ్‌బరేలీ, మెయిన్‌పురితో పాటు ఈ 14 స్థానాలకూ అభ్యర్థులను తొలి జాబితాలోనే ప్రకటించే యోచనలో ఉంది. వీటిలో సమాజ్‌వాదీ పార్టీ కంచుకోటలుగా చెప్పే పలు స్థానాలున్నాయి.

5. ఇలాగే బిహార్లో కూడా క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉన్నట్టు భావిస్తున్న నవడా, సుపౌల్, కిషన్‌గంజ్, కతీహార్, ముంగేర్, గయ వంటి స్థానాలు కూడా బీజేపీ తొలి జాబితాలోనే ఉంటాయని భావిస్తున్నారు.

6. మధ్యప్రదేశ్‌లో పీసీసీ మాజీ చీఫ్, కాంగ్రెస్ కురువృద్ధుడు కమల్‌నాథ్ కంచుకోటైన ఛింద్వారాతో పాటు ఆ పార్టీకి పట్టున్న పలు స్థానాలపై బీజేపీ గట్టిగా దృష్టి పెట్టింది. ఛింద్వారా బాధ్యతలను కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు అప్పగించారు.

7. కేరళలో కూడా త్రిసూర్, తిరువనంతపురం, పథినంతిట్ట వంటి స్థానాల్లో విజయవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు బీజేపీ అంచనా వేస్తోంది. త్రిసూర్ నుంచి సినీ హీరో సురేశ్ గోపిని బరిలో దించుతుందన్న అంచనాలున్నాయి.

8. మహారాష్ట్రలో ఎన్సీపీ చీఫ్ వరద్ పవార్ కంచుకోటైన బారామతితో పాటు బుల్డానా, ఔరంగాబాద్ వంటి లోక్‌సభ స్థానాల్లో ఈసారి ఎలాగైనా పాగా వేసి తీరాలని బీజేపీ పట్టుదలగా ఉంది. ఇక పంజాబ్‌లో అమృత్‌సర్, ఆనంద్‌పూర్ సాహిబ్, భటిండా, గురుదాస్‌పూర్ తదితర లోక్‌సభ సీట్లపై కూడా పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

9. పంజాబ్, మహారాష్ట్ర, బిహార్లలో స్థానిక పార్టీలతో బీజేపీ పొత్తు చర్చలు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. పరిస్థితులు, అవసరాలను బట్టి ఈ రాష్ట్రాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వెళ్లాలన్న యోచనలో అధినాయకత్వం ఉంది.

10. 70 ఏళ్లు పైబడ్డ నేతలకు ఈసారి టికెట్లు ఇవ్వొద్దన్న యోచన కూడా బీజేపీ అధినాయకత్వం పరిశీలనలో ఉందని విశ్వసనీయ సమాచారం! మూడుసార్లకు మించి నెగ్గిన వారిని కూడా పక్కన పెట్టనుందని చెబుతున్నారు. వారికి బదులు కొత్త ముఖాలకు చాన్సివ్వాలని మోదీ–షా ద్వయం సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చారని బీజేపీ వర్గాల్లో గట్టిగానే వినిపిస్తోంది. ఇది నిజమే అయితే అందరికీ వర్తింపజేస్తారా, మినహాయింపులుంటాయా అన్నది చూడాలి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రజల్లోకి వెళ్లండి

- కాంగ్రెస్ శ్రేణులకు ఖర్గే ఉద్బోధ
- అనవసర వ్యాఖ్యలొద్దని సూచన


సాక్షి, న్యూఢిల్లీ: కొన్ని నెలలుగా అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ చాలా కష్టపడి పని చేశారని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అందుకు తగ్గ ప్రతిఫలం దక్కుతుందన్న నమ్మకముందని ధీమా వ్యక్తం చేశారు. ''కేవలం భారీ సభలకే పరిమితమైతే చాలదు. ప్రజల్లోకి వెళ్లాలి. వారితో మమేకమై పని చేయాలి. అప్పుడే వారి విశ్వాసాన్ని పొందగలం'' అంటూ నేతలకు, శ్రేణులకు ఉద్బోధించారు. బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏఐసీసీలోని పలు విభాగాల చీఫ్‌లు, ముఖ్య నేతలతో ఆయన సమీక్ష జరిపారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపై చర్చించారు. పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రపై దిశానిర్దేశం చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు భేటీలో పాల్గొన్నారు.

ఓట్లను సీట్లుగా మార్చాలి

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 4.92 కోట్ల ఓట్లొచ్చినా సీట్లు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదని ఖర్గే గుర్తు చేశారు. అందుకే దేశం కోరుతున్న మార్పు సాకారం కావాలంటే కాంగ్రెస్ శ్రేణులన్నీ అట్టడుగు స్థాయిలో రాత్రింబవళ్లు కష్టపడాలని సూచించారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర విజయానికి కృషి చేయాలన్నారు. బీజేపీ పదేళ్ల వైఫల్యాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. విపక్ష ఇండియా కూటమి బలోపేతం అవుతుండటంతో పాలక ఎన్డీఏలో కలవరపాటు మొదలైందన్నారు. ప్రత్యర్థుల అబద్ధపు ప్రచారాన్ని ఎదుర్కోవాలన్నారు. దేశంలో కాంగ్రెస్ అనుకూల వాతావరణాన్ని చెడగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు.

జమిలి ఎన్నికలు... కోవింద్ కమిటీకి 5,000 సూచనలు

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో ఏర్పాటైన 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' కమిటీకి ప్రజల నుంచి ఇప్పటిదాకా 5,000 పై చిలుకు సలహాలు, సూచనలు అందినట్టు సమాచారం. కమిటీ దీనిపై గత వారం సలహాలను ఆహ్వానించడం తెలిసిందే. జనవరి 15 దాకా అందే సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. గత సెప్టెంబర్లో ఏర్పాటైన కోవింద్ కమిటీ ఇప్పటిదాకా రెండుసార్లు సమావేశమైంది. జమిలి ఎన్నికలపై సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ ఆరు జాతీయ, 33 గుర్తింపు పొందిన పార్టీలకు లేఖలు రాసింది. లా కమిషన్‌తో సమావేశమై అభిప్రాయాలను తెలుసుకుంది. జమిలి ప్రతిపాదనను, కోవింద్ కమిటీ ఏర్పాటును కాంగ్రెస్, పలు ఇతర విపక్షాలు ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకించడం తెలిసిందే.



విశ్వామిత్ర భారత్

వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

- గ్లోబల్ ఎకానమీలో గ్రోత్ ఇంజన్‌గా ఇండియా
- ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగడం ఖాయం
- ఇండియా అంకితభావం, పట్టుదల, నిరంతర శ్రమతో ప్రపంచం సురక్షితం
- రాబోయే 25 సంవత్సరాలు భారతీయులకు అమృత కాలం

గాంధీనగర్: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్ నూతన ఆశారేఖగా ఆవిర్భవించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచ దేశాలు భారత్‌ను స్థిరత్వానికి ఒక ముఖ్యమైన మూలస్తంభంగా, నమ్మకమైన మిత్రదేశంగా, భాగస్వామిగా, గ్లోబల్ ఎకానమీలో గ్రోత్ ఇంజన్‌గా, గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా, టెక్నాలజీ హబ్‌గా, ప్రజాస్వామ్య సౌధంగా పరిగణిస్తున్నాయన్నారు. మారుతున్న ప్రపంచ క్రమంలో విశ్వమిత్రగా భారత్ అవతరిస్తోందన్నారు. గాంధీనగర్‌లో బుధవారం పదో 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సు' ప్రారంభోత్సవంలో మోదీ ప్రసంగించారు. త్వరలో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని రేటింగ్ ఏజెన్సీలన్నీ చెబుతున్నాయని గుర్తుచేశారు. ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించడంతోపాటు వాటిని సాధించగలమన్న విశ్వాసాన్ని ప్రపంచానికి భారత్ ఇస్తోందన్నారు.

పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు

ప్రపంచ అభివృద్ధికి, శ్రేయస్సుకు 140 కోట్ల మంది భారతీయులు ప్రాధాన్యతలు, ఆకాంక్షలు ఒక ఆధారంగా నిలుస్తున్నాయని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. ఇండియా ప్రాధాన్యతలు చాలా స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. స్థిరమైన పారిశ్రామికాభివృద్ధి, ఆధునిక మౌలిక వసతులు, నూతన తయారీ రంగం, కొత్తతరం నైపుణ్యాలు, భవిష్యత్తు టెక్నాలజీ, కృత్రిమ మేధ, నవీన ఆవిష్కరణలు, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన వనరులు, సెమీ కండక్టర్ల తయారీకి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిణామాల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి అద్భుత అవకాశాలు ఉన్నాయని వివరించారు. గత పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని, మన ఆర్థిక వ్యవస్థకు ఈ సంస్కరణలే చోదకశక్తిగా మారుతున్నాయని వెల్లడించారు. కొన్ని నెలల క్రితమే 75వ స్వాతంత్య్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నామని, 25 ఏళ్ల తర్వాత 100వ స్వాతంత్య్ర దినోత్సవాలు జరుపుకోబోతున్నాయని చెప్పారు. రాబోయే 25 సంవత్సరాలు మనకు అమృత కాలమని ఉద్ఘాటించారు. 'అభివృద్ధి చెందిన భారత్' అనే లక్ష్యాన్ని ఈ అమృత కాలంలో సాధించుకోవాలని ప్రజలను పిలుపునిచ్చారు.

విదేశీ పెట్టుబడులకు వెల్‌కం


మనందరి ఉమ్మడి కృషి వల్ల 21వ శతాబ్దంలో ఇండియాకు ఉజ్వలమైన భవిష్యత్తు లభించబోతోందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గత ఏడాది జీ20 కూటమికి భారత్ సారథ్యం వహించిందని, ప్రపంచ భవిష్యత్తు కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను అందించిందని తెలియజేశారు. ఐ2యూ2(ఇండియా, ఇజ్రాయెల్, యూఏఈ, యూఎస్ఏ) గ్రూప్‌తోపాటు ఇతర బహుముఖీన సంస్థలతో సంబంధాలను నిరంతరం బలోపేతం చేసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీని సమర్థవంతంగా వాడుకుంటూ దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశామని, 40 వేలకుపైగా కాలం చెల్లిన నిబంధనలను సులభతర వాణిజ్య విధానం, జీఎస్టీ కింద రద్దు చేశామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్శించడానికి, గ్లోబల్ బిజినెస్‌కు ఇండియాను గమ్యస్థానంగా మార్చడానికి మూడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై(ఎఫ్‌టీఏ) సంతకాలు చేశామని ప్రధాని మోదీ చెప్పారు. పలు కీలక రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెట్టామని వివరించారు. గత పదేళ్లలో పెట్టుబడి వ్యయాన్ని 10 రెట్లు పెంచామన్నారు.

టెక్నాలజీతో జీవితాల్లో మార్పు

గ్రీన్ ఎనర్జీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారత్ శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీలో మూడు రెట్లు, సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 20 రెట్లు ప్రగతి నమోదైందని తెలిపారు. గత పదేళ్లలో చౌక ధరకే ఫోన్లు, డేటా వంటివి దేశంలో సరికొత్త డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చాయని అన్నారు. ప్రతి గ్రామానికీ ఆప్టికల్ ఫైబర్, 5జీ టెక్నాలజీ రాకతో సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు వచ్చిందని చెప్పారు. 2028కల్లా భారత్ 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి సంపన్న దేశంగా మారుతుందన్నారు.

2,100 కిలోల గంట.. 108 అడుగుల అగరుబత్తి

అయోధ్య రాముడికి దేశ విదేశాల నుంచి ఎన్నెన్నో కానుకలు



న్యూఢిల్లీ: అయోధ్యలో నిర్మించిన భవ్యమందిరంలో కొలువు దీరబోతున్న బాల రాముడికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అరుదైన కానుకలు వెల్లువెత్తుతున్నాయి. 108 అడుగుల పొడవైన అగరుబత్తి, 2,100 కిలోల బరువైన గంట, 1,100 కిలోల బరువైన భారీ ప్రమిద, బంగారు పాదుకలు, 10 అడుగుల ఎత్తయిన తాళం, తాళంచెవి, ఒకేసారి ఎనిమిది దేశాల సమయాన్ని సూచించే గడియారం తదితర ప్రత్యేక కానుకలను అయోధ్య రాముడికి సమర్పించేందుకు భక్తులు ఇప్పటికే సిద్ధమయ్యారు. ఈ నెల 22వ తేదీన రామ మందిరంలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దేశ విదేశాల నుంచి బహుమతులు అందుతున్నాయి. సీతమ్మ పుట్టిన ఊరు జనక్‌పూర్ ప్రస్తుతం నేపాల్‌లో ఉంది. నేపాల్ నుంచి అయోధ్యకు వెండి చెప్పులు, బంగారు ఆభరణాల వంటి 3,000కుపైగా బహుమతులు వచ్చాయి. ఇక శ్రీలంకలోని అశోక్ వాటిక నుంచి తీసుకొచ్చిన ఒక అరుదైన రాయిని అక్కడి ప్రతినిధులు అయోధ్యలో అందజేశారు.

7,000 కిలోల 'రామ్ హల్వా'

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కోసం గుజరాత్ భక్తులు 44 అడుగుల పొడవైన ఇత్తడి జెండా స్తంభాన్ని పంపిస్తున్నారు. మహారాష్ట్రకు విష్ణు మనోహర్ అనే వంట మాస్టర్ 7,000 కిలోల 'రామ్ హల్వా' తయారు చేసి అయోధ్యలో భక్తులకు పంపిణీ చేస్తారు. శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవా సంస్థాన్ 200 కిలోల భారీ లడ్డూ తయారీలో నిమగ్నమైంది. అయోధ్యకు లక్ష లడ్డూలు పంపిస్తామని తిరుమతి తిరుపతి దేవస్థానం(టీటీడీ) ప్రకటించడం తెలిసిందే. సీతమ్మ కోసం సూరత్‌లో ప్రత్యేకంగా చీర తయారు చేస్తున్నారు. సూరత్‌కు చెందిన ఓ వజ్రాల వ్యాపారి 2 కిలోల వెండి, 5,000 అమెరికన్ వజ్రాలతో కూడిన నెక్లెస్ రాముడికి బహూకరించబోతున్నారు.

రామాలయ ప్రారంభోత్సవానికి... ఖర్గే, సోనియా దూరం

- రాజకీయ ప్రాజెక్టుగా రామ మందిరం
- అసంపూర్తి ఆలయాన్నే ప్రారంభిస్తున్నారు
- ఎన్నికల లబ్ధికి బీజేపీ యత్నమంటూ ధ్వజం
- రామునిపై సోనియాకు విశ్వాసం లేదు: బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్యలో జనవరి 22న జరిగే రామాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి దూరంగా ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి నిర్ణయించుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఈ మేరకు వెల్లడించారు. కేవలం లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ, ఆరెస్సెస్ కలిసి రామ మందిరాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయని విమర్శించారు. అందుకే అసంపూర్తి ఆలయాన్ని హడావుడిగా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. ఖర్గే, సోనియా, అధీర్‌లను రామ మంది ట్రస్టు, వీహెచ్‌పీ నేతలు డిసెంబర్‌లో కలిసి రామ మందిర ప్రారంభోత్సవానికి రావాలంటూ వ్యక్తిగతంగా ఆహ్వాన లేఖలు అందించారు. కానీ అది పక్కా ఆరెస్సెస్, బీజేపీ రాజకీయ సంరంభమని జైరాం విమర్శించారు. ''కోట్లాది మంది భారతీయులు రాముడిని పూజిస్తారు. మతం మనిషి వ్యక్తిగత విషయం. అందుకే రామున్ని పూజించే కోట్లాది మంది సెంటిమెంట్లను గౌరవిస్తూనే ఆహ్వానాన్ని నేతలు సున్నితంగా తిరస్కరించారు'' అన్నారు.

వారిని ప్రజలు బాయ్‌కాట్ చేస్తారు

కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ దుయ్యబట్టింది. రాముని అస్తిత్వాన్నే నిరాకరిస్తున్నామంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ నుంచి ఇంకేం ఆశించగలమని ఎద్దేవా చేసింది. హిందూ మతాన్ని, హిందువులను అవమానించడం కాంగ్రెస్‌కు, విపక్ష ఇండియా కూటమి పక్షాలకు కొత్తేమీ కాదంటూ మండిపడింది. రామునిపై నమ్మకం లేదని సోనియా మరోసారి నిరూపించుకున్నారని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ విమర్శించారు. వారిని దేశ ప్రజలు బాయ్‌కాట్ చేస్తారని మరో మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు.

షిండే వర్గమే అసలైన శివసేన

- ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పిటిషన్లను తిరస్కరిస్తున్నాం
- మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ స్పష్టీకరణ



స్పీకర్ నర్వేకర్ (పైన), శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే, సీఎం ఏక్‌నాథ్ షిండే

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన రాజకీయ పార్టీ అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ బుధవారం తేల్చేశారు. ఏడాదిన్నరగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరదించారు. శివసేన పార్టీ 2022 జూన్‌లో రెండుగా విడిపోయిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు రెండు పక్షాలుగా చీలిపోయారు. ఒక వర్గానికి నేతృత్వం వహిస్తున్న ఏక్‌నాథ్ షిండే బీజేపీ, ఎన్సీపీ మద్దతుతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. మరో వర్గానికి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వం వహిస్తున్నారు. తమ వర్గమే అసలైన శివసేన అంటూ ఇరువురు నేతలు వాదిస్తున్నారు. అవతలి వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ షిండే, ఉద్ధవ్ ఠాక్రే అసెంబ్లీ స్పీకర్‌కు విజ్ఞాపనలు సమర్పించారు. వీటిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ తన నిర్ణయం ప్రకటించారు. షిండే వర్గమే అసలైన శివసేన అని స్పష్టం చేశారు. ఉద్ధవ్ వర్గానికి చెందిన సునీల్ ప్రభును విప్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈ తొలగింపు 2022 జూన్ 21 నుంచి వర్తిస్తుందన్నారు. షిండే వర్గానికి చెందిన భరత్ గోగావాలేను అధికారికంగా విప్‌గా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. ఏ ఒక్క ఎమ్మెల్యేపై కూడా అనర్హత వేటు వేయడం లేదన్నారు. పార్టీ నుంచి నేతలను బహిష్కరించే అధికారం శివసేన చీఫ్‌కు లేదని పేర్కొన్నారు. 2018 నాటి శివసేన రాజ్యాంగాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఉద్ధవ్ వర్గం కోరగా, స్పీకర్ అంగీకరించలేదు. 1999 నాటి రాజ్యాంగాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. శివసేన ఎన్నికల సంఘం సైతం ఈ రాజ్యాంగాన్నే గుర్తించిందని పేర్కొన్నారు. మొత్తం 54 మంది ఎమ్మెల్యేలకు గాను 37 మంది ఎమ్మెల్యేలు షిండే వర్గంలోనే ఉన్నాయని గుర్తుచేశారు. స్పీకర్ నిర్ణయంపై షిండే వర్గం సంబరాలు చేసుకుంది. సీఎం ఏక్‌నాథ్ షిండే కూడా దీనిపై హర్షం వ్యక్తం చేశారు.

సుప్రీంను ఆశ్రయిస్తాం: ఉద్ధవ్ వర్గం

స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని శివసేన(ఉద్ధవ్) ప్రకటించింది. స్పీకర్ నిర్ణయాన్ని అంగీకరించబోమని ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. ఇదంతా బీజేపీ కుట్ర అని పార్టీ నేతలు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్ మండిపడ్డారు. బాల్ ఠాక్రే స్థాపించిన శివసేనను ఎవరూ అంతం చేయలేరన్నారు. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ వ్యవహారమని ఆరోపించారు. షిండే వర్గమే అసలైన శివసేన అయితే తమ వర్గం ఎమ్మెల్యేలపై ఎందుకు అనర్హత వేటు వేయలేదని ప్రశ్నించారు. స్పీకర్ నిర్ణయాన్ని ప్రజాస్వామ్య హత్యగా ఉద్ధవ్ ఠాక్రే అభివర్ణించారు.

వినూత్నమైన కోవిడ్ వ్యాక్సిన్

అభివృద్ధి చేసిన బెంగళూరు ఐఐఎస్సీ సైంటిస్టులు



బెంగళూరు: కర్ణాటకలోని బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) సైంటిస్టులు వినూత్నమైన కోవిడ్–19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. సార్స్–కోవ్–2కు చెందిన అన్ని రకాల సబ్ వేరియంట్లను ఇది సమర్థంగా ఎదుర్కొంటోందని చెబుతున్నారు. భవిష్యత్తులో పుట్టుకొచ్చే వేరియంట్లపైనా పోరాడగలదని అంటున్నారు. ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ నేతృత్వంలో ఐఐఎస్సీ మాలిక్యులర్ బయోఫిజిక్స్ యూనిట్ బృందం తయారు చేసిన ఈ టీకాకు ఆర్ఎస్2 అని పేరుపెట్టారు. కోవిడ్–19పై జరుగుతున్న పోరాటంలో ఈ వ్యాక్సిన్ ఒక విప్లవాత్మకమైన ముందడుగు అని సైంటిస్టులు అభివర్ణించారు. ఇది వేడిని తట్టుకోగలదని, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. కరోనా వైరస్‌కు చెందిన స్పైక్ ప్రొటీన్లలోని రెండు కాంపోనెంట్ల సమ్మేళంతో ఆర్ఎస్2 టీకాను అభివృద్ధి చేశారు. ఇదొక సింథటిక్ యాంటీజెన్. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కరోనా టీకాలతో పోలిస్తే ఆర్ఎస్ఈ టీకా మరింత ఎక్కువ రక్షణ ఇస్తుందని ఐఐఎస్సీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇందులోని ఎస్2 అని సబ్ యూనిట్ వైరస్ మ్యుటేషన్లను సమర్థంగా తట్టుకుంటుందని పేర్కొన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం, 11, జనవరి, 2024




దుర్గమ్మ సేవలో అమర్‌నాథ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బుధవారం దర్శించుకున్నారు.



రద్దీగా బెజవాడ బస్టాండ్

సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు వెళ్తున్న విద్యార్థులు, ప్రయాణికులతో విజయవాడ ఆర్టీసీ బస్టాండు రద్దీగా మారింది. వివిధ ప్రాంతాలకెళ్లే బస్సులన్నీ కిటకిటలాడాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 522.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

స్మృతి వనంలో పండుగ వాతావరణం



పటమట(విజయవాడతూర్పు): ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం నిర్మాణ పనులు తుది దశకు చేరిన సందర్భంగా స్వరాజ్‌మైదాన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 19న స్మృతి వనం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు స్మృతి వనం ప్రారంభ పనుల్లో నిమగ్నమయ్యారు. విజయవాడ నగర పాలక సంస్థ సహకారంతో ఏలూరు, చిత్తూరు, రాజమండ్రి, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులందరూ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమండ్రి నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అందాలను వీక్షించారు. ప్రారంభ వేడుకల కోసం అందరూ ఎదురు చూస్తున్నారని స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి తెలిపారు.

దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు రూ.3 లక్షల విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు విజయవాడకు చెందిన భక్తులు రూ. 3 లక్షల విరాళాలు బుధవారం అందజేశారు. నిమ్మగడ్డ రాజేంద్ర, రూపలతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం, గోసంరక్షణకు మరో రూ. లక్ష, మల్లేశ్వర స్వామి ఆలయాభివృద్ధి పనులకు రూ. లక్ష అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు ఇచ్చారు.

దుర్గమ్మ సన్నిధికి సనాతన హిందూ ధర్మ ప్రచారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కృష్ణ ధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు బుధవారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ పర్యవేక్షణలో పలువురు ఆధ్యాత్మికవేత్తలు, సుమారు 650 మంది హరిదాసులు, సనాతన హిందూ ధర్మ ప్రచారం చేస్తూ ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. తొలుత ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి బయలుదేరి కుమ్మరిపాలెం, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, బ్రాహ్మణ వీధి మీదగా ఆలయానికి చేరుకున్నారు. ఆధ్యాత్మిక వేత్తలను ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఉమామహేష్ సత్తా



విజయవాడ స్పోర్ట్స్: ఇండోనేషియాలోని జకర్తాలో జరుగుతున్న ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారుడు మద్దినేని ఉమా మహేష్ సత్తా చాటాడు. ఈ నెల 5న ప్రారంభమైన ఈ పోటీలకు ఉమామహేష్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి రెండు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీం చాంపియన్‌షిప్ విభాగంలో గోల్డ్ మెడల్ అందుకున్నాడు. అదేవిధంగా బుధవారం ఉదయం జరిగిన టీం చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.

ఆధునికంగా ఆస్పత్రులు..

- రూ.170 కోట్లతో వైద్య కళాశాలలో నాడు–నేడు పనులు
- జీ+6 అంతస్తులతో క్యాజువాలిటీ భవనం
- కళాశాల భవనం పక్కనే లెక్చర్ హాల్స్, గ్యాలరీ నిర్మాణం
- 250 సీట్లకు అనుగుణంగా భవనాల నిర్మాణం
- అన్ని వసతులతో తీర్చిదిద్దేందుకు ప్రణాళిక



విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న క్యాజువాలిటీ భవనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆస్పత్రులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దారు. నాడు–నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేసి గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్ సీలు మొదలుకొని జిల్లా స్థాయి సమగ్ర వైద్యశాలల వరకూ రూపురేఖలు మార్చేశారు. ఆస్పత్రుల్లో సదుపాయాలు మెరుగుపర్చి వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ చేశారు. ఆస్పత్రులను ఆధునికంగా మార్చారు. విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల, ప్రభుత్వాస్పత్రుల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాడు–నేడు ద్వారా రూ.170 కోట్లతో పనులు చేపట్టారు. వైద్య కళాశాల భవనం లోపల ప్రాంతంతో పాటు, డయాగ్నోస్టిక్ బ్లాక్ పక్కన భవన నిర్మాణ పనులు వేగంగా నడుస్తున్నాయి. అవి అందుబాటులోకొస్తే విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వాస్పత్రుల్లో మరిన్ని వసతులు సమకూరుతాయి.



అదనపు భవనాల నిర్మాణం

చురుగ్గా పనులు.....

ప్రభుత్వాస్పత్రి డయాగ్నోస్టిక్ బ్లాక్ పక్కన జీ+6 అంతస్తులతో క్యాజువాలిటీ భవనాన్ని నిర్మిస్తున్నారు. రూ. 40 కోట్ల అంచనాతో పనులు కొనసాగుతున్నాయి. ఒక్కో అంతస్తులో 1612 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఈ భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో క్యాజువాలిటీతో పాటు, అత్యవసరంగా ఇన్వెస్టిగేషన్ చేసేందుకు ఎక్స్‌రే యూనిట్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటివి ఏర్పాటు చేస్తారు. మిగిలిన మూడు అంతస్తుల్లో ట్రామా కేర్ యూనిట్, అక్యూట్ మెడికేర్ యూనిట్, ఎమర్జెన్సీ ఆర్థోపెడిక్ వార్డు వంటి అత్యవసర చికిత్స అందించే రోగులకు ఆయా వార్డుల్లో ఉంచుతారు. అందుకు సంబంధించి అత్యాధునిక పరికరాలను సైతం ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థులకు అనుగుణంగా..

ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో ప్రస్తుతం ఉన్న భవనాల లోపలి వైపు రెండు అంతస్తులతో మరో భవనం నిర్మాణం చేస్తున్నారు. ప్రస్తుతం 150 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, అవి 250కు పెరిగినా ఇబ్బంది లేకుండా, విద్యార్థులకు అనువుగా ఈ భవనాన్ని నిర్మాణం చేపడుతున్నారు. అందులో భాగంగా 7426 చదరపు మీటర్లతో గ్రౌండ్‌ఫ్లోర్‌ను రూ. 50 కోట్లుతో నిర్మించనున్నారు. ఈ భవనంలో సెంట్రల్ వర్క్‌షాపు నిర్వహించుకునేలా లెక్చర్ హాల్ గ్యాలరీ ఏరియా, మరో 2 లెక్చర్ హాల్స్, ల్యాబ్ క్లస్టర్స్ 3, ప్రొఫెసర్స్ వెయిటింగ్ రూమ్స్, మ్యూజియమ్, రీడింగ్ రూమ్, టీచర్ ట్రైనింగ్ ఏరియా, అకడమిక్ అండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్స్, ఎలక్ట్రికల్ రూమ్స్ వంటివి ఏర్పాటు చేస్తారు. అనంతరం మరో రెండు అంతస్తుల నిర్మాణానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటితో పాటుగా విద్యార్థుల హాస్టల్ భవనాలు వంటివి మరో రూ.80 కోట్లతో చేపట్టనున్నారు.

జూన్ నాటికి పూర్తిచేసేలా పనులు



వైద్య కళాశాలలో జీ+2 అంతస్తులతో భవనాలు నిర్మించేందుకు నాడు–నేడు పథకం ద్వారా రూ.50 కోట్లతో గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అవి జూన్ నాటికి పూర్తి చేసే లక్ష్యం పెట్టుకున్నాం. ఆ భవనం అందుబాటులోకి వస్తే వైద్య విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు వస్తాయి. లెక్చర్ హాల్స్, రీడింగ్ రూమ్, మ్యూజియం, ల్యాబ్ క్లస్టర్స్‌ను ఏర్పాటు చేయనున్నాం.

డాక్టర్ కంచర్ల సుధాకర్,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల

ఆస్పత్రుల రూపురేఖలే మారాయి



నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రులు ఎంతో అభివృద్ధి చెందాయి. తొలిదశలో చేపట్టిన పనుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలే మారిపోయాయి. డెలివరీ రూమ్, ఓపీ చాంబర్స్, ల్యాబొరేటరీ పరికరాలు ఏర్పాటు చేశారు. అంతేకాదు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతో రోగులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయి. ప్రస్తుతం నాడు–నేడుతో వైద్య కళాశాలలో అదనపు భవనాల నిర్మాణంతో ల్యాబ్ క్లస్టర్స్ అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ నిర్ణయంతో వైద్య విద్యార్థులు, రోగులకు ఎంతో ప్రయోజనకరం.

పి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి,
ఏపీ ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర

ఈ నెల 23న భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతదేశ సాంస్కృతిక వారసత్వం, అద్భుతమైన చారిత్రక, పర్యాటక ప్రదేశాలను ప్రజలందరూ సందర్శించుకునేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ సర్క్యూట్ రైళ్లను నడుపుతోంది. అందులో భాగంగా దక్షిణ భారతదేశంలోని పలు పుణ్య క్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను దర్శించుకునేందుకు ఈ నెల 23న జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర పేరుతో భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలు నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ రైలుకు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్లలో బోర్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. 8 రాత్రిళ్లు, 9 రోజులు సాగే ఈ ప్రయాణంలో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తంజావూరులోని జ్యోతిర్లింగ దర్శనంతో పాటు పలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలను దర్శించుకోవచ్చు.

ప్యాకేజీ వివరాలు...

ఈ ప్రత్యేక యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సదుపాయం, పర్యాటక ప్రదేశాలను దర్శించుకునేందుకు రోడ్డు మార్గంలో రవాణా, రాత్రిళ్లు బస ఏర్పాట్లు ఉంటాయి. మూడు కేటగిరిలో ఉండే ఈ ప్యాకేజీలో ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ రూ.14,100, 3 ఏసీ రూ.21,500, 2 ఏసీ రూ. 27,900 టారిఫ్ నిర్ణయించారు. ఆసక్తి కలిగిన యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా గానీ, విజయవాడ రైల్వే స్టేషన్‌లోని కార్యాలయంలో గానీ, 9281495848 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

అవినీతి రహిత పాలనతోనే దేశాభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి యశోనాయక్

- కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్
- కోడూరులో వికసిత భారత్ సంకల్ప యాత్ర భారీ సభ

కోడూరు: అవినీతికి తావు లేకుండా ప్రతి రూపాయిని ప్రజలకు సక్రమ మార్గంలో అందించి, పరిపాలన చేయడం వల్లే దేశం అభివృద్ధి చెంది పేదలు ఉన్నతంగా బతుకుతారని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు, పర్యాటకశాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్ అన్నారు. కృష్ణాజిల్లా కోడూరు టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో యశోనాయక్ పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. పేదలు, అణగారిన వర్గాల వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతోనే కేంద్రం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేదల ఆర్థిక కష్టాలు, ఆకలి బాధలను అర్థం చేసుకున్న ప్రధాని మోదీ పీఎం అంత్యోదయ అన్న యోజన ద్వారా 80 కోట్ల కుటుంబాలకు ఉచితంగా రేషన్‌ను అందించినట్లు పేర్కొన్నారు. హర్ ఘర్ జల్ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 12 కోట్ల కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కేంద్రం చర్యలు తీసుకుందని తెలిపారు. రాబోయే కాలంలో నూరు శాతానికి దీనిని పెంచనున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా అధికార యంత్రాంగం పనితీరుపై కేంద్ర మంత్రి ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మోదీ ఆశయాలకు తగట్టుగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంకల్ప యాత్రకు సంబంధించిన ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమ స్పెషల్ ఆఫీసర్, ఐఏఎస్ ఎం.రామచంద్రుడు, డీపీఓ నాగేశ్వరనాయక్, ఆర్డీఓ శ్రీవాణి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచ్ వెన్నా షైనీ, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరువోలు బుచ్చిరాజు, జిల్లా ఇన్‌చార్జి కపర్ధి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శేషుకుమార్, తుంగల మురళీకృష్ణ, పుప్పాల రాము తదితరులు పాల్గొన్నారు.

ఓడ రేవుల అభివృద్ధికి కేంద్రం సాయం

చిరువోలు(మోపిదేవి): ఓడ రేవుల అభివృద్ధికి కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర ఓడరేవులు షిప్పింగ్ జలమార్గాలు, పర్యాటక శాఖా మంత్రి శ్రీపాద యశోనాయక్ అన్నారు. బీజేపీ నాయకులు బుచ్చిరాజు ఇంటి వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిన్న ఓడరేవుల అభివృద్ధి రాష్ట్రం పరిధిలో ఉంటుందని, పెద్ద ఓడ రేవుల నిర్మాణానికి కేంద్రం అవసరమైతే పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 10 ఓడరేవులు అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, సర్పంచ్ మేరీరాణి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు క్రీడాకారులకు అవార్డులు



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ క్రీడాకారులు అవార్డుల పంట పండించారు. ఈ విషయాన్ని బుధవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ విలేకరులకు తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించి చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారన్నారు. తూర్పు గోదావరి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 8, 9వ తేదీల్లో కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పురుషుల, మహిళల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు షేక్ నస్రిన్ చాందినీ 63 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని, 70 కేజీల విభాగంలో కె.పూజిత వెండి పతకాన్ని, 57 కేజీల విభాగంలో కె.అనూష వెండి పతకాన్ని సాధించినట్లు తెలిపారు. బాడీ బిల్డింగ్ పురుషుల విభాగానికి సంబంధించి కె.కోటేశ్వరరావు 63 కేజీల విభాగంలో వెండి పతకాన్ని సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ అథారిటీ సెక్రటరీ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. విజేతలకు వ్యాయామ అధ్యాపకులు ఎం.శివశంకర్, డి.పూజితను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహ కార్యదర్శి రామకృష్ణ, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ కోదండ రామారావు, అధ్యాపకులు అభినందించారు.

దుర్గమ్మ సేవలో కేంద్ర ఎన్నికల కమిషనర్లు



అనూప్ చంద్రపాండే, అరుణ్‌గోయల్‌కు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న కలెక్టర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్‌గోయల్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. దర్శనానంతరం ఎలక్షన్ కమిషనర్లకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావులు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, పట్టువస్త్రాలను అందించారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా, జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆలయ ఈఈ ఎల్.రమాదేవి, ఏఈవో ఎన్. రమేష్‌బాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నెహ్రూనగర్: విజయవాడ స్వరాజ్య మైదానంలో ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. బుధ వారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ఎత్తయిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని పీఠం 80 అడుగులతో కలిపి మొత్తం 205 అడుగుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని ఆయనకు సముచిత స్థానం కల్పించినందుకు అంబేడ్కర్ అభిమానులు, రాష్ట్ర ప్రజలందరి తరపున ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఓపెన్ థియేటర్, బుద్దిస్ట్ మెడిటేషన్ హాల్, పదివేల పుస్తకాలతో లైబ్రరీ, ఫౌంటెన్లు, పార్కు వంటి అన్ని రకాల సదుపాయాలతో దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత సుందరంగా అద్భుతంగా నిర్మించడం జరిగిందన్నారు. అంబేడ్కర్ స్మృతి వనంతో విజయవాడ ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు.

ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి



మంత్రి జోగి రమేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న యూనియన్ నాయకులు

- గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- ఘనంగా ఏపీ జెన్‌కో ఎంప్లాయిస్ యూనియన్ రజతోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ జెన్‌కోలో పని చేసే విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేటింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) రజతోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని చెప్పారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. వేడుకలకు అధ్యక్షత వహించిన 1535 యూనియన్ ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ ఏపీ జెన్‌కోలో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తూ సంస్థ అభివృద్ధి కోసం కష్టపడుతున్న వారిని క్రమబద్ధీకరణ చేసి దళారీ వ్యవస్థ (కాంట్రాక్టర్లు) లేకుండా వేతనాలను ప్రత్యక్ష పద్ధతిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉద్యోగులందరికి అపరిమిత వైద్య చికిత్స కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. 2014 నాటికి ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల పర్మినెంట్ చేయటం శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎంఏ వజీర్, రాష్ట్ర అధ్యక్షుడు వి.రామకృష్ణా రెడ్డి, 1104 రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య, 327 రాష్ట్ర అధ్యక్షుడు బి.సాయి కృష్ణ, ముఖ్యసలహాదారు మూర్తి, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఏవీ కిరణ్, ఓసీ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కె. శ్రీనివాస్, బీసీ అసోసియేషన్ లైజాన్ ఆఫీసర్ పి.రాజయ్య పాల్గొన్నారు. అదే విధంగా 1535 యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రాధాకృష్ణ, ఎన్. మధుబాబు, ఎం.లక్ష్మణరావు, పి.మహేశ్వరరెడ్డి, ఎం.వినయ్ కుమార్, ఏపీలోని అన్ని జనరేటింగ్ స్టేషన్ల ప్రాంతీయ కార్యవర్గ సభ్యులు, హెచ్ – 48 రాష్ట్ర అధ్యక్షుడు వై.రవీంద్రనాథ్‌రెడ్డి, హెచ్ – 43 యూనియన్ గౌరవాధ్యక్షుడు పి. వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పరు ఢీకొని ముగ్గురి దుర్మరణం



ఘటనాస్థలంలో మృతదేహాలు

తిరువూరు: రైలు అందుకోవాలనే తొందరలో బైక్‌పై వేగంగా వెళ్తున్న వారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మండలం, రామచంద్రాపురం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. గంపలగూడెం మండలం వినగడపకు చెందిన షేక్ ఖాసిం సాహెబ్, షేక్ హుసేన్‌బీ దంపతులు. నాలుగేళ్ల కిందటే ఖాసిం మరణించాడు. వారి కుమారుడు షేక్ నాగుల్‌మీరాకు వివాహమై ఇద్దరు పిల్లలు కలిగాక కుటుంబ కలహాల కారణంగా అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో కొడుకుని బెంగళూరులో ఉన్న కోడలి వద్దకు తీసుకెళ్లి కాపురం చక్కదిద్ది సమస్య పరిష్కరించాలని హుసేన్‌బీ భావించింది. ఇందు కోసం బెంగళూరు వెళ్లేందుకు రైల్వే రిజర్వేషన్ కూడా చేసుకున్నారు. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో హుసేన్‌బీ (55) తన కుమారుడు షేక్ నాగుల్‌మీరా (30) మేనల్లుడు నాగుల్‌మీరా (28)తో కలిసి బెంగళూరు బయలుదేరింది. రైలు అందుకునేందుకు ఆలస్యం అవుతుందన్న ఉద్దేశంతో ద్విచక్రవాహనాన్ని వేగంగా పోనిస్తున్నారు. తిరువూరు నుంచి మైలవరం వైపు వెళ్తున్న వారి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురూ తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.కొండూరు ఎస్‌ఐ అంకారావు తెలి పారు. మృతదేహాలను తిరువూరు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

క్లుప్తంగా

గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ.10 లక్షల పట్టివేత



జగ్గయ్యపేట): మండలంలోని రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టు వద్ద రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణబాబు తెలిపారు. బుధవారం సాయంత్రం సమయంలో నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐ జానకీరామ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గాజువాకకు చెందిన కనుమూరి హరినాథరాజు వద్ద రూ.10 లక్షల నగదును గుర్తించామన్నారు. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవటంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆక్వా రైతు మృతి



కోనేరుసెంటర్(మచిలీపట్నం): విద్యుదాఘాతంతో ఓ ఆక్వా రైతు మృతి చెందాడు. ఈ ఘటన బందరు మండలం గుండుపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. రూరల్‌– 2 ఎస్‌ఐ పద్మ కథనం మేరకు.. గుండుపాలెంనకు చెందిన తుమ్మా దుర్గారావు (49) రెండు ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నాడు. బుధవారం మోటర్ వేసేందుకు షెడ్డు వద్దకు వెళ్లాడు. స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా కుప్పకూలి చనిపోయాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం దుర్గారావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ కృష్ణా జిల్లా కమిటీ నియామకం

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణా జిల్లా నూతన కమిటీని నియమించినట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయిశ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడిగా చక్కా చెన్నకేశవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంట్రప్రగడ వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా వేముల శ్రీనివాస్, కోశాధికారిగా ఘంటసాల రాజమోహన్ (కన్నయ్య)ను నియమించామని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలోని 25 మండలాల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

• రబీ రెడీ

రబీ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఖరీఫ్ పనులు తుది దశకు చేరటంతో రబీ సాగు పనులు చేపడుతున్నారు. అపరాల సాగుకు ఆస్కారం లేని భూముల్లో దాళ్వా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో వరి నారుమడులు పోసుకున్నారు. దమ్ము చేసి నాట్లకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. తుపాను నేపథ్యంలో చల్లిన మినుము విత్తనాలు దెబ్బతినటంతో ప్రభుత్వం 80 శాతం రాయితీపై మినుము విత్తనాలను సరఫరా చేసింది. బయటి మార్కెట్‌లోనూ మినుము, పెసర కొనుగోలు చేసి పొలాల్లో చల్లారు. ప్రస్తుతం మూడు, నాలుగు ఆకులు తొడిగి అపరాలు, మినుము పొలాలు కళకళలాడుతున్నాయి.

– కంకిపాడు (పెనమలూరు)



కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో సిద్ధమవుతున్న వరి నారుమడి



ఈడుపుగల్లులో ట్రాక్టరుతో పొలం దమ్ము చేస్తున్న రైతు



కంకిపాడులో పొలం దమ్ము పనులకు నీరు పెడుతున్న దృశ్యం



కోలవెన్ను గ్రామంలో సాగు చేసిన అపరాలు

11 నుంచి జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు



గుడివాడ టౌన్: ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), ఆయన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు (చిన్ని) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీల ప్రదర్శన జయప్రదం చెయ్యాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల బ్రో చర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఏడు విభాగాలకు చెందిన ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతాయని తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకుని జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనే ఎడ్ల జతలకు తొమ్మిది రకాల బహుమతులు ఇస్తామన్నారు. గుడివాడ నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ పోటీల ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పార్టీ నాయకులు గాదిరెడ్డి రామిరెడ్డి, పాలడుగు రాంప్రసాద్, అల్లం రామ్మోహనరావు, కె.ఆంజనేయ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రైలులో ఆభరణాల చోరీ.. నిందితుడి అరెస్టు

రూ.16 లక్షల ఆభరణాలు స్వాధీనం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలులో బంగారు ఆభరణాలు ఉన్న సూట్‌కేసును చోరీ చేసిన నిందితుడిని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) అరెస్టు చేసి, రూ.16 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మెహర్ జ్యోతి డిసెంబర్ 22న ఈస్ట్ గోదావరి జిల్లా ద్వారంపూడిలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి అదే నెల 29వ తేదీ రాత్రి రాజమండ్రి నుంచి సికింద్రాబాద్‌కు గరిబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. తన సూట్‌కేసును బెర్త్ కింద పెట్టి నిద్రపోయారు. రైలు మరుసటి రోజు తెల్లవారు జాము 2.25 గంటలకు విజయవాడ స్టేషన్ చేరుకుంది. ఆ సమయంలో మెహర్ జ్యోతికి సూట్‌కేసు కనిపించలేదు. రైలులో పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె తన ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ నెల ఐదో తేదీన విజయవాడ జీఆర్‌పీ పోలీసులకు చోరీపై ఫర్యాదు చేశారు. సూట్‌కేసులో డైమండ్ నెక్లెస్ సహా రూ.16 లక్షల విలువైన ఆభరణాలు, రూ.5 వేల నగదు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన జీఆర్‌పీ పోలీసులు రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఆర్‌పీఎఫ్ పోలీసుల సహకారంతో ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడింది భీమవరానికి చెందిన సురేష్‌కుమార్ అలియాస్ చందుగా గుర్తించారు. బుధవారం ఉదయం 11 గంటలకు విజయవాడ గవర్నర్‌పేటలోని జైహింద్ కాంప్లెక్స్ వద్ద నిందితుడు ఉండటాన్ని గుర్తించి జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖర్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న నగలు, నిందితుడితో రైల్వే పోలీసులు

ఫిబ్రవరిలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.వి.శాంతిశ్రీ తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను బుధవారం యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతిశ్రీ మాట్లాడుతూ 'చట్టసభలలో మహిళా రిజర్వేషన్ రాజకీయ సాధికారతకు ఒక కొలమానం' అంశంపై రెండు రోజుల పాటు సదస్సు జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన తరుణంలో, ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సదస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరిశోధన పత్రాలు సమర్పించేవారు ఫిబ్రవరి ఒకటో తేదీలోగా పంపాలని సూచించారు.

పేదరిక నిర్మూలనతోనే దేశాభివృద్ధి

కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్

పామర్రు: పేదరిక నిర్మూలనతోనే దేశాభివృద్ధి సాధ్యమని, పేదలు ఆర్థికాభివృద్ధి సాధించడం ద్వారానే ఇది సాకారమవుతుందని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గ మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ అన్నారు. పామర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు, ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించి ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు కృషిచేస్తోందన్నారు. వివిధ వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ఈ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో పేదలు అందరికీ అవగాహన కల్పించి, వారికి లబ్ధి చేకూర్చేందుకే వికసిత భారత్ సంకల్ప యాత్రను చేపట్టామన్నారు.

364 గ్రామాల్లో వికసిత్ సంకల్ప యాత్ర

కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ.. నవంబర్ 25వ తేదీన ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 364 గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నాటికి మిగిలిన అన్ని గ్రామాల్లో పూర్తిచేస్తామన్నారు. సంకల్ప యాత్ర జిల్లా ప్రభారి (ఇన్‌చార్జి) ఎం.రామచంద్రుడు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక పథకాలు ప్రజలందరికీ తెలియజేయాలన్నదే సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. జల జీవన్ మిషన్‌లో నూరుశాతం ఫలితాలు సాధించి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసిన పామర్రు మండలం ఐనంపూడి గ్రామసర్పంచ్ భట్టు పరంజ్యోతిని, కబడ్డీలో బంగారు పతకం సాధించిన ఎం.ఇంద్రజను కేంద్ర మంత్రి ఘనంగా సత్కరించారు. జల జీవన్ మిషన్, పీఎం ఉజ్వల యోజన, పోషణ్ అభియాన్ పథకాలకింద లబ్ధి పొందిన బైరెడ్డి వాణి, కల్లేపల్లి మోహనలక్ష్మ, ఎస్.నాగలక్ష్మి తమకు ఆ పథకాలు ఏవిధంగా ఉపయోగపడ్డాయో వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ నోడల్ అధికారిగా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉయ్యూరు ఆర్డీఓ డి.రాజు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.పద్మావతి, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు కె.స్వరూపరాణి, పామర్రు సర్పంచ్ కేతావతు కస్తూరి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్

రైతులకు భూసార పరీక్షల పత్రాలు పంపిణీ

కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయిన్, కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా పామర్రులోని రైతులు బుధవారం భూసార పరీక్ష పత్రాలను అందుకున్నారు. మండల పరిధిలో 23,500 ఎకరాల సాగు భూమి ఉంది. పంట పొలాల్లో మట్టి నమూనాలను గతంలో సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వాటి ఫలితాలు రావటంతో కేంద్ర మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా రైతులు ఆరుమళ్ల శివ నాగిరెడ్డి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, బొంతు శశిధర్‌రెడ్డికి అందజేశారు. పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏఓ శివనాగరాణి పాల్గొన్నారు.



భూ సార ఫలితాల పత్రాల పంపిణీ చేస్తున్న మంత్రి యశో నాయక్, కలెక్టర్ రాజాబాబు

వ్యాయామం.. ఆరోగ్య మంత్రం

- విజయవాడలో పెరిగిన వాకర్ల సంఖ్య
- ఇళ్లలోనే వ్యాయామ పరికరాలు
- జీవనశైలి వ్యాధుల కట్టడే లక్ష్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల అలవాట్లలో క్రమేణా మార్పు వస్తోంది. జీవనశైలి వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో వాటి బారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తున్నారు. అందులో భాగంగా నోటిని అదుపులో ఉంచుకోవడం (మితాహారం తీసుకోవడం)తో పాటు వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. ఫలితంగా విజయవాడ నగరంలో వాకింగ్ చేస్తున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతూ వస్తోంది. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారు వాకింగ్‌చేస్తూ కనిపించేవారు. ఇప్పుడు మధ్య వయస్సు వారితో పాటు, మహిళల్లో సైతం వాకింగ్ చేసే వారి సంఖ్య పెరిగింది. అంతేకాదు ఇళ్లలోనే వ్యాయామ పరికరాలు సైక్లింగ్, ట్రెడ్‌మిల్ వంటివి ఏర్పాటు చేసుకుంటూ, అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకుంటున్నారు. ఒక రకంగా కరోనా తర్వాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ బాగా పెరిగింది. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు.



విజయవాడలోని ఓ పార్కులో వాకింగ్ చేస్తున్న ప్రజలు

కొవ్వు పదార్థాలకు దూరం

కరోనా తర్వాత ఆరోగ్య నియమాలు పాటిస్తున్న వారి సంఖ్య పెరిగింది. వ్యాయామం, యోగా, ధ్యానం చేసేందుకు క్యూ కడుతున్నారు. మితాహారం తీసుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఎక్కువ మంది సిరిధాన్యాలను వినియోగిస్తున్నారు. డ్రై ఫ్రూట్స్, ఫ్రూట్స్ కూడా నగర ప్రజలు ఎక్కువగా తీసుకుంటూ, ఆరోగ్య నియమాలను పాటిస్తున్నారు. ఊబకాయం (ఒబెసిటీ) బారిన పడకుండా తక్కువ కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన వాకర్లు

విజయవాడ నగర ప్రజలు వాకింగ్‌పై దృష్టి పెట్టారు. ఒకప్పుడు చాలా తక్కువ మంది వాకింగ్ ట్రాక్‌లు ఉన్న మైదానాల్లో వాకింగ్ చేసేవాళ్లు. ఇప్పుడు ఉదయం, సాయంత్రం వేళల్లో ఏ రోడ్డులో చూసినా వాకింగ్‌చేస్తూ కనిపిస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా, మగవారితో పాటు, మహిళలు సైతం వాకింగ్ చేస్తున్నారు. తమ ఆరోగ్యం కోసం తీరిన సమయంలో ఒక గంట కాళ్లకు పనిచెపుతున్నారు. ప్రజల ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా కార్పొరేషన్ సైతం పలు పార్కులు, కాలువ గట్లుపై వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసింది.


అదుపులో ఉంచుకునే యత్నం

ప్రభుత్వ గణాంకాల ప్రకారం వయస్సు 35 ఏళ్లు దాటిన వారిలో 14 శాతం మంది మధుమేహం, 12.5 శాతం మంది రక్తపోటు బాధితులు ఉన్నారు. వాస్తవంగా మరింత మంది ఉంటారనేది అంచనా. ప్రీ డయాబెటీస్, రక్తపోటు వచ్చే అవకాశం ఉన్న వారు రెట్టింపు సంఖ్యలో ఉన్నారు. వారంతా ఇప్పుడు వ్యాధులు అదుపులో ఉంచుకునే యత్నం చేస్తున్నారు. అందులో భాగంగా జీవనశైలిలో మార్పుతో పాటు, ఆహార నియమాలు, వ్యాయామంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తున్నారు.

ఇంట్లోనే పరీక్షలు

ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా గ్లూకోజ్ మీటర్, డిజిటల్ బీపీ మిషన్‌లు ఉంటున్నాయి. ఇంట్లో ఎవరో ఒకరు వాటి బారిన పడిన వారు ఉండటమే అందుకు కారణం. తమకు ఉన్న వ్యాధులు అదుపులో ఉన్నాయో లేదో ఇంట్లోనే చెక్ చేసుకుంటున్నారు. ఏదైనా స్థాయిలు పెరిగితే వైద్యులను సంప్రదిస్తున్నారు. అంతేకాదు థర్మోమీటర్, పల్స్ ఆక్సీమీటర్లు కూడా మెడికల్ కిట్‌లో భాగమయ్యాయి. తమ బరువును ఎప్పటికప్పుడు చూసుకునేందుకు వెయిట్ మిషన్‌లు కూడా ఇళ్లలో ఉంటున్నాయి.


ఆరోగ్యంపై అవగాహన పెరిగింది



ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ముందస్తుగానే పరీక్షలు చేయించుకోవడంతోపాటు అవసరమైన మేర మందులు వాడుతున్నారు. ఆహార నియమాలు, వాకింగ్ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారు. మేము నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష, కుటుంబ డాక్టర్ కార్యక్రమాల్లో మధుమేహం, రక్తపోటు ప్రీ స్టేజ్‌లో ఉన్న వారు వస్తున్నారు. వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చి పంపుతున్నాం. జీవనశైలి వ్యాధులకు రెగ్యులర్‌గా మందులు వాడేలా చూస్తున్నారు.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

రెగ్యులర్ పరీక్షలు అవసరమే



నిత్యం ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేయడం అవసరం. మధుమేహం ఉన్నా తమకేమీ కావడం లేదనే భావనతో యువత ఉంది. దీంతో క్రియాటిన్ పెరిగి తమ వద్దకు వస్తున్నారు. మధుమేహం ఉన్న వారు వ్యాధిని అదుపులో ఉంచుకునేందుకు మందులు వాడుతూ, వ్యాయామం, ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా ఎలాంటి దుష్ఫలితాలూ లేకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు.

– డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి, మధుమేహ నిపుణుడు

దిశ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): భార్యను వేధిస్తున్న కానిస్టేబుల్‌పై చిలకలపూడి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోలా రవికిరణ్ 2018లో ఎలక్షన్ బందోబస్తు నిమిత్తం మండవల్లి వెళ్లాడు. అక్కడ వీఆర్‌ఏగా పనిచేస్తున్న పూజితవిమలాదేవితో పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారింది. అప్పటికే వివాహం చేసుకున్న విమలాదేవి భర్తకు ఈ విషయం తెలిసి ఆమెకు విడాకులు ఇచ్చేశాడు. దీంతో 2020లో విమలాదేవిని రవికిరణ్ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజుల పాటు భార్యతో ప్రేమగా ఉన్న రవికిరణ్ ఆ తరువాత ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించటం మొదలుపెట్టాడు. వేధింపులు తట్టుకోలేని భార్య రవికిరణ్‌పై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ మహిళలకు రక్షణగా నిలవాల్సిన కానిస్టేబుల్ భార్యను వేధిస్తున్నాడని తెలుసుకున్న ఎస్పీ పి.జాషువా అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యార్డుకు 72,053 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 72,053మిర్చి బస్తాలు రాగా, నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానంలో 70,571 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9 వేల నుంచి రూ.20 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల ధర రూ.8 వేల నుంచి రూ.23 వేలు, ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.19 వేల వరకు పలికింది.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్(విజయవాడతూర్పు): సుదూర ప్రాంతాలకు ప్రయాణించేవారి సమస్యలను పరిష్కరించేందుకు గురువారం డయల్ యువర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆటోనగర్ డిపో డీఎం కె. ప్రవీణ్‌కుమార్ అన్నారు. బెంగళూరు, మద్రాస్, విశాఖపట్నం, తిరుపతి, కర్నూల్, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రయాణించేవారు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య సమయంలో 9959225464కు ఫోన్ చేయాలని కోరారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట



లబ్బీపేట(విజయవాడతూర్పు): కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ఆమె డివిజన్‌లోని గిరిపురం పంది ఏసోబు వీధిలో రూ.15 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం కార్పొరేటర్ కుక్కల అనిత భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో మంచినీరు, డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులను పెద్ద ఎత్తున చేపట్టినట్లు తెలిపారు.

కొత్త ఫించన్ మంజూరు..

డివిజన్‌లోని 92వ సచివాలయం పరిధిలో ఐదుగురికి కొత్తగా ఫించన్‌లు మంజూరు కాగా, వారికి కుక్కల అనిత బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ కొమ్ము చంటి, కుక్కల రమేష్‌లతో పాటు పార్టీ నేతలు పాల్గొన్నారు.

యువత సహనాన్ని అలవరచుకోవాలి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎంత చిన్న పనిని అయినా సవ్యంగా నమ్మకంగా చేస్తే మంచి ఫలితం వస్తుందని సీతానగరంలోని రామకృష్ణ మఠానికి చెందిన స్వామీ కార్తీక్ మహారాజ్ చెప్పారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మేలుకో నేస్తమా అనే అంశంపై విద్యార్థులకు సదస్సు బుధవారం జరిగింది. స్వామీ కార్తీక్ మహారాజ్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోడానికి సహనంగా ప్రయత్నిస్తే ఎప్పటికైనా వాటిని చేరుకోవచ్చని చెప్పారు. ఒక్క క్షణం సహనంగా ఉంటే కొండంత ప్రమాదాన్ని దూరం చేసుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి, అధ్యాపకుడు బి.శైలజ, ఎంబీఎస్ ప్రసాద్, ఎం.నాగరాజు, కె.విజయభాస్కర్, టి.కొండారెడ్డి, బి.శ్రీనివాసరెడ్డితో పాటుగా అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు స్వామిజీ బహుమతులను అందజేశారు.

పింఛన్ పంపిణీ పూర్తి



ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధి 16వ డివిజన్‌లో నూరు శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్టు సంక్షేమ కార్యదర్శి సాకా సాగర్ తెలిపారు. ఈ డివిజన్‌లో మొత్తం 11,059 పింఛన్‌లు ఉండగా.. ఈ నెల 1 నుంచి 10 వరకు అందిరికీ రూ.3,000 చొప్పున పంపిణీ చేసినట్టు చెప్పారు.

13న ముగ్గుల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గణేశ భక్తబృందం ఆధ్వర్యాన ఈనెల 13వ తేదీ శనివారం స్వర హాస్పిటల్ సహకారంతో సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు భక్తబృందం సభ్యులు జీఎస్ఆర్ దత్తు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతి ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 98855 81579 నంబర్‌లో నమోదు చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

'కొండ'కు అభివృద్ధి తోరణం

కొండ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

- రూ.40 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పన
- మెట్ల మార్గాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు
- మంచినీటి పైప్‌లైన్ల పునర్నిర్మాణం
- పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, యూజీడీ పనుల నిర్వహణ



మొగల్రాజపురంలో నిర్మించిన రిటైనింగ్ వాల్, సీసీ రోడ్డు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కొండ ప్రాంత ప్రజల కష్టాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెడుతోంది. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తోంది. దీంతో స్థానిక నివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం తమ సమస్యలను నిర్లక్ష్యం చేసిందని.. మంచినీటి సమస్య, శిథిలమైన మెట్లతో ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదని గుర్తు చేస్తున్నారు.

దేవినేని అవినాష్ ప్రత్యేక చొరవ..

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన కొండ చివరి ప్రాంతాల వరకూ పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారు.

రూ.5.50 కోట్లతో మంచినీటి పైప్‌లైన్..

కొండ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.5.50 కోట్లు వ్యయంతో కొత్త పైపులైన్ ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న పైప్‌లైన్ శిథిలం కావడంతో దాని స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఈ పనులు 2, 5, 6, 7 డివిజన్ పరిధిలోని మొగల్రాజపురం క్రీస్తురాజుపురం, బెత్లెహేంనగర్, లూర్థునగర్, మాచవరం, మారుతీనగర్, బ్రహ్మానందరెడ్డినగర్, నిమ్మతోట తదితర ప్రాంతాల్లో జరిగాయి. ప్రస్తుతం కొండ చివరి ప్రాంతం వరకూ నీటి కొరత లేకుండా ప్రజలు జీవనం సాగిస్తున్నారు.

మెట్ల పునర్నిర్మాణం..

కొండ ప్రాంతాల్లో గతంలో ఎప్పుడో మెట్లు నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరడంతో మహిళలు, వృద్ధులు కొండపైకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోని మెట్లు మార్గాలను పునర్నిర్మించి ప్రజల కష్టాలను తీర్చారు. అంతేకాక మాచవరం కొండపైన ఉన్న కార్మికనగర్ వాసులు సైతం మార్గం లేక అవస్థలు పడేవారు. మెట్ల కోసం వారు గత ప్రభుత్వం హయాంలో ఉద్యమం కూడా చేశారు. అయినా పరిష్కారం కాలేదు. ప్రస్తుతం కార్మికనగర్‌లో మెట్ల మార్గాలతో పాటు మంచినీటి సౌకర్యం కూడా కల్పించారు.

విద్యుత్ కాంతులు..

ఒకప్పుడు మారుతీనగర్ కార్మికనగర్, శ్రీలంక కాలనీ తదితర ప్రాంతాల్లో నివసించే వారికి విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదు. ఆ ప్రాంతంలో అంతా ఎస్టీలు నివసిస్తుంటారు. ఈ విషయాన్ని దేవినేని అవినాష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ప్రస్తుతం విద్యుత్ లైన్‌లతో పాటు వీధి దీపాలు కూడా వచ్చాయి. భూగర్భ డ్రైనేజీకి కూడా ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొండ ప్రాంతమైన కార్మికనగర్‌లో నిర్మిస్తున్న మెట్లు



మాచవరం కొండ ప్రాంతంలో నిర్మించిన మెట్లు

రూ.6 కోట్లతో అభివృద్ధి చేశాం..



మా డివిజన్‌లోని కుమ్మరిబజార్, బెత్లెహేంనగర్, కార్మికనగర్, దేవినేనినగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇప్పటి వరకూ రూ.6 కోట్లు వెచ్చించి రోడ్లు, మెట్లు మార్గాలు వేశాం. దేవినేని నగర్, శ్రీలంక కాలనీ, కార్మికనగర్ తదితర ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ లైన్‌లు వేశాం. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచని సమస్యలు పరిష్కరించాం.

– అంబడిపూడి నిర్మలకుమారి, కార్పొరేటర్, 2వ డివిజన్

ప్రజల సమస్యలు పరిష్కరించాం..



గత ప్రభుత్వం అమ్మ కల్యాణ మండపం నుంచి విజయనగర్‌కాలనీ వరకూ యూజీడీ పనులు చేసి రోడ్డు వేయకుండా వదిలేయడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. దీంతో రూ. కోటిన్నర వెచ్చించి బీటీ రోడ్డు వేశాం. గంగిరెద్దుల దిబ్బ ప్రాంతాల్లో కొండపై నుంచి దిగేందుకు అనువుగా సీసీ రోడ్డు వేయడంతో పాటు, అక్కడ రూ. కోటి వ్యయంతో యూపీహెచ్‌సీ నిర్మించాం. ఇలా ప్రజల సమస్యలు పరిష్కరించాం.

– కలపాల అంబేడ్కర్, కార్పొరేటర్, 5వ డివిజన్

పండుగలు సంస్కృతికి ప్రతీకలు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మన సంస్కృతీ, సంప్రదాయానికి పండుగలు ప్రతీకలు అని వాటిని గొప్పతనాన్ని పెద్దలు పిల్లలకు తెలియజేయాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి అన్నారు. సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు బుధవారం పుస్తకాల బ్యాగులను పక్కన పెట్టి గంగిరెద్దుల విన్యాసాలు, భోగి పండ్లు, గొబ్బిమ్మల చుట్టూ నృత్యాలు, భోగి మంటలతో సరదాగా గడిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హిందీ భాషా దినోత్సవం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): దేశ వ్యాప్తంగా హిందీ భాష వాడుక పెరుగుతోందని రిటైర్డ్ హిందీ అధ్యాపకుడు, డాక్టర్ వెన్నా వల్లభరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ప్రపంచ హిందీ భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వల్లభరావు మాట్లాడుతూ విదేశాల్లో 153 విశ్వవిద్యాలయాల్లో హిందీ భాషలో బోధన జరుగుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వల్లభరావును కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

హామీల అమలులో సీఎం జగన్ కొత్త చరిత్ర

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



'మీ అవినాష్ అన్న హామీ' కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 95శాతానికి పైగా అమలు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఎం.ఎస్ వీధి, పెద్దిరాజు వీధి, ఆంజనేయులు వీధులలో ఆయన పర్యటించారు. గడప గడపకూ వెళ్లి నాలుగున్నర ఏళ్ల జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలను 'మీ అవినాష్ అన్న హామీ' పేరుతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని, వాటిని వివరిస్తూ రానున్న ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేసిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలను కరపత్రాలు అందజేస్తున్నామన్నారు.

డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులు పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. 3వ డివిజన్‌లో కామినేని నగర్ డొంక రోడ్డు ప్రాంతంలో దేవినేని సుధీర, 12వ డివిజన్‌లో కరివేపాకు రోడ్డు ప్రాంతంలో దేవినేని క్రాంతి, 14వ డివిజన్‌లో అంబేడ్కర్ నగర్ ప్రాంతంలో వై.సిద్ధార్థ గడప గడపకూ వెళ్లి 'మీ అవినాష్ అన్న హామీ' కరపత్రాలు పంపిణీ చేశారు. 3, 14 డివిజన్ల కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, చింతల సాంబశివరావు, కో ఆప్షన్ మెంబర్ ముసునూరు సుబ్బారావు, 12వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ధ్యేయం

స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీ సంఘ సమావేశ మేయర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కంటే మెరుగ్గా విజయవాడను అభివృద్ధి చేస్తున్నామని, నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేస్తున్నామని అన్నారు. అజెండాలో మొత్తం 27 అంశాల ప్రతిపాదన రాగా అందులో 20 అంశాలను ఆమోదించగా ఒక అంశాన్ని తిరస్కరిస్తూ తీర్మానం చేశారు. నాలుగు అంశాలను ర్యాటీపై చేయగా ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరించారు.

ప్రధానాంశాలు ఇవి..

- అజిత్‌సింగ్‌నగర్, వాంబే కాలనీలోని డీబ్లాక్ కల్యాణమండపాన్ని లీజుకు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను కమిటీ సభ్యులు రద్దు చేస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్–3 పరిధిలోని కనకదుర్గానగర్ క్రాస్ రోడ్డు అంతర్గత బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.32లక్షల కార్పొరేషన్ జనరల్‌ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేయాలని వచ్చిన ప్రతిపాదన సభ్యులు ఆమోదించారు.
- సర్కిల్–3 పరిధిలోని సాయిబాబా గుడివద్ద ఉన్న వీఎంసీ కాంప్లెక్స్‌లో 14వ నంబర్ షాపును ఆప్కోకు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.



స్థాయీ సంఘ సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలా మారిందని, దీని ద్వారా డబ్బులు ఆదా అవుతున్నాయని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. బుధవారం 16వ డివిజన్‌లోని 77వ సచివాలయం పరిధిలోని పోలీస్ కాలనీలో ఆయన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి పైగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుడదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం అని అన్నారు. నాడు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం అందరికీ ఉపయోగపడిందన్నారు.

నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మరో మూడు అడుగులు ముందుకు వేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వైద్యం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



మందులను పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

ఆటోనగర్(విజయవాడతూర్పు): పేదలను ఆరోగ్యవంతులుగా చేయడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. బుధవారం రామలింగేశ్వరనగర్ 15వ డివిజన్ లోని 72వ సచివాలయం పరిధి నీలవేణి రోడ్డులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపు జరిగింది. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం పలువురికి కళ్ల జోళ్లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 144 మందికి జరిమానా

గుణదల(విజయవాడ తూర్పు): విద్యుత్ శాఖ గుణదల డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 144 మందికి రూ. 5.20 లక్షల జరిమానా విధించినట్లు ఆ శాఖ ఈఈ జి.కమలకుమారి తెలిపారు. డివిజన్ పరిధిలోని 2,711 గృహాలను, 193 వాణిజ్య సముదాయాలను బుధవారం తనిఖీ చేశామన్నారు. 35 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. అదనపు విద్యుత్ వినియోగిస్తున్న, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిని గుర్తించి జరిమానా విధించామన్నారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, వినియోగదారులు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ఆమె సూచించారు.

ఎన్‌పీఎస్ రద్దు చేసేంత వరకు పోరాడుతాం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌జేసీఏ, ఎన్ఎఫ్ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ పిలుపు మేరకు రైల్వే కార్మికులు బుధవారం విజయవాడ డీఆర్ఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంప్లాయీస్ సంఘ్ విజయవాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్రరావు, ఆమంచి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ అసోసియేషన్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌ల నేతలు శిబిరంలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు రమేష్, దేగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సస్పెక్ట్ షీటర్ల వీరంగం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇద్దరు సస్పెక్ట్ షీటర్లు వీరంగం సృష్టించిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోటకు చెందిన నాగరాజు అనే వ్యక్తి అదే ప్రాంతంలో పుల్కా బండి వద్ద పని చేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కరెంట్ ఆఫీస్ వైపు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్లుగా ఉన్న పిల్లా సాయి, ఉస్తేల చిన్నబాబు ఇద్దరు కలిసి నాగరాజుపై దాడికి పాల్పడి అతని వద్ద నుంచి రూ.8వేలు లాక్కున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన నాగరాజు మేనల్లుడు సాయి తన మామను ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా అతనిపై కూడా దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఇద్దరు పరారయ్యారు. బాధితులను తీసుకుని చిన్నబాబు ఇంటికి వెళ్లగా అతని తల్లి తిరుపతమ్మ బాధితుడి భార్య రమణ, సాయిపై బ్లేడ్‌తో దాడికి పాల్పడింది. పోలీసులు చిన్నబాబు, తన భార్య రమణను స్టేషన్‌కు తరలించారు. పిల్ల సాయి పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాల సాధకుడు సీఎం జగన్



భవానీపురం(విజయవాడ పశ్చిమ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల కోసమే పని చేస్తున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ పేర్కొన్నారు. బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ఎదురుగాగల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకున్న సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రూ.450 కోట్లతో నిర్మించిన ఈ అంబేడ్కర్ స్మృతివనం, అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో దళితులకు అత్యధికంగా మంత్రులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఇచ్చిన చరిత్ర సీఎం జగనన్నదేనన్నారు. పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వరప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్ దళితులకు మేనమామగా అభివర్ణించారు. రానున్న రోజుల్లో దళిత సామాజికవర్గ ప్రజలంతా కలిసి వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యు. రాజేష్, కొర్రపాటి వీరాస్వామి, తెన్నేటి మణికంఠ, ఎం నాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పార్టీలకు అతీతం.. అర్హతే ప్రామాణికం

- వృద్ధురాలికి వితంతు పింఛను మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇటీవల ఆమెను పరామర్శించిన నారా భువనేశ్వరి



శ్రీకాకుళం జిల్లా తోటవాడలో ఎరకమ్మకు పింఛన్ అందజేస్తున్న నాయకులు

బూర్జ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తుందనడానికి ఇది మరో ఉదాహరణ. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం తోటవాడ గ్రామానికి చెందిన గేదెల ఎరకమ్మకు వింతతు పింఛన్ మంజూరైంది. ఆమె భర్త గేదెల సాంబమూర్తి, మాజీ సీఎం చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో చంద్రబాబు భార్య భువనేశ్వరి ఇటీవల గ్రామానికి వచ్చి ఎరకమ్మను పరామర్శించారు. తాజాగా గేదెల ఎరకమ్మకు వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరైంది. పింఛను సొమ్ము రూ.3 వేలను బుధవారం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెకు అందజేశారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామనడానికి ఎరకమ్మకు పింఛను మంజూరే ఉదాహరణ అని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కమిటీ కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, సర్పంచ్ సూర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మ ఆదాయాన్ని దోచుకున్న యనమల

మంత్రి దాడిశెట్టి రాజా మండిపాటు



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: దశాబ్దాల చరిత్రగల తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానంలో అమ్మవారి ఆదాయాన్ని 40 ఏళ్లుగా టీడీపీ నేత యనమల రామకృష్ణుడు దోచుకున్నారని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆరోపించారు. దోపిడీకి పాల్పడిన యనమలకు సిగ్గుంటే అమ్మవారి చెంతకు వచ్చి లెంపలు వేసుకుని క్షమాపణ కోరాలన్నారు. బుధవారం లోవలో రూ.2.30 కోట్లతో నిర్మించనున్న 7 అంతస్తుల రాజగోపురానికి మంత్రి శంకుస్థాపన చేశారు. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సౌజన్యంతో రూ.50 లక్షలతో నిర్మించిన 3 వాటర్ (తలుపులమ్మ తల్లి జల ప్రసాదం) ఆర్వో ప్లాంట్లను, గోదావరి చైతన్య బ్యాంక్ సాయం చేసిన రూ.5 లక్షలతో కొనుగోలు చేసిన హైడ్రాలిక్ ఆటోను మంత్రి ప్రారంభించారు. విలేకరులతో మాట్లాడుతూ.. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయ ఆదాయాన్ని అధికారం ఉన్నన్నాళ్లు యనమల తన సొంత, ప్రైవేట్ ఆస్తిలా దోచుకున్నాడని మండిపడ్డారు. భక్తులు హుండీల్లో వేసిన డబ్బునూ పట్టుకుపోయాడని ఆరోపించారు. సీఎం జగన్ సహకారంతో గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.14 కోట్లతో లోవను తాము అభివృద్ధి చేశామని చెప్పారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా లోవ దేవస్థానాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.

పవన్ కళ్యాణ్‌తో అంబటి రాయుడు భేటీ

సాక్షి, అమరావతి: క్రికెటర్ అంబటి రాయుడు బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పవన్‌కళ్యాణ్‌తో సమావేశమయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి దాదాపు మూడున్నర గంటల పాటు అంబటి రాయుడు జనసేన కార్యాలయంలోనే గడిపారు. ఈ సమావేశం అనంతరం రాయుడు మీడియాతో మాట్లాడడానికి ఇష్టపడలేదు. ఇది మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని జనసేన వర్గాలు తెలిపాయి.

నేను, నా కొడుకు పోటీ చేయం

దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్పష్టీకరణ



శ్మశాన వాటిక ప్రారంభోత్సవంలో మాజీ మంత్రులు దగ్గుబాటి, కామినేని

కారంచేడు: 'ఇకపై నేనుగానీ నా కొడుకుగానీ రాజకీయ పదవుల కోసం పోటీ చేయం' అని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం కారంచేడు మండలంలోని కుంకలమర్రు గ్రామంలో ఎన్‌ఆర్ఐలు, స్థానికుల సహకారంతో రూ.కోటి వెచ్చించి ఏర్పాటు చేసిన హిందూ శ్మశాన వాటికను మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 'గతంలో ఎమ్మెల్యేలు కనీసం రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. మరలా ఆ డబ్బు సంపాదించుకునే అవకాశం, పరిస్థితులు గతంలో ఉండేవేమోగాని ఇప్పుడు మాత్రం లేవు. నా ఉద్దేశంలో అసలు సీటు రానివారు అదృష్టవంతులు. ఓడిపోయిన వారు అక్కడే ఏడుస్తున్నారు, గెలిచిన వారు ఇంటికి వెళ్లి ఏడవాల్సి వస్తోంద' అని అన్నారు.



తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాయుడుపేటకు చెందిన షణ్ముగ శెట్టికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చంద్రశేఖర్



నరసరావుపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లింగాల సాంబయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కోటిరెడ్డి



కాకినాడలో చికిత్స పొందుతున్న కురిమెళ్ల వెంకటరమణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పోతుల సత్యవేణి



అనకాపల్లిలో కుమారుడి ఇంటివద్ద ఉన్న మూలపేటకు చెందిన భీశెట్టి సుబ్బన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దేవి

పింఛన్ల పంపిణీ నేటి వరకు పొడిగింపు

సాక్షి, అమరావతి: అవ్వాతాతల పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీ(గురువారం) వరకు ప్రభుత్వం పొడిగించింది. పెన్షన్ రూ.3,000కు పెంపు నేపథ్యంలో జనవరి 1 నుంచి ఉత్సవాల రూపంలో నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. కాగా, జనవరి 1 నుంచి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 66,34,742 మంది లబ్ధిదారుల కోసం రూ.1,967.34 కోట్లు విడుదల చేసింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి బుధవారం (10వ తేదీ) సాయంత్రం వరకు 65,44,212 మందికి రూ.1,940.24 కోట్లు పంపిణీ చేశారు. ఇప్పటికే 98.64 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యింది. గురువారం కూడా వలంటీర్లు ఆయా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తారని అధికారులు తెలిపారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో

ఎన్నికల నిర్వహణ

- సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- రాష్ట్రంలో 4.07 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు
- వారిలో 2.7 కోట్ల మంది మహిళలు 1.99 కోట్ల మంది పురుషులు
- సీఈసీ రాజీవ్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న సీఈసీ రాజీవ్ కుమార్. పక్కన ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్ గోయల్

సాక్షి, అమరావతి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా స్వేచ్ఛాయుత, పారదర్శక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలకు సమప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛ ఓటర్ల జాబితాతో పాటు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కును కాపాడాలని, పోలింగ్‌లో పెద్దఎత్తున పాల్గొనాలని ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ 2024 ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌లతో కలిసి విజయవాడలో రాజీవ్ కుమార్ రెండు రోజుల సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్లు స్వేచ్ఛగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా 2024లో తొలి సమీక్ష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో మొదలు పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై స్టేక్ హోల్డర్స్ అందరితో సమావేశాలు నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 4.07 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 1.99 కోట్లు, మహిళలు 2.07 కోట్లు ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో 159 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండటం శుభపరిమాణమన్నారు. 2014లో 1013గా ఉన్న పురుష, మహిళా ఓటర్ల నిష్పత్తి ఇప్పుడు 1036కు పెరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 5.8 లక్షల మంది ఉన్నారని, వారు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ కాకుండా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవాలని అనుకున్న వారు ఫాం12డీ పూర్తి చేయడం ద్వారా అవకాశం పొందవచ్చన్నారు. వచ్చే ఎన్నికల్లో 18–19 ఏళ్లు ఉన్న 7.88 లక్షల మంది తొలిసారి ఓటు హక్కును వినియోగంచుకోనున్నట్లు తెలిపారు. ఓటర్ల తుది జాబితాను జనవరి 22న విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ధన ప్రవాహం తగ్గించే విధంగా చర్యలు

ఎన్నికల్లో ధన ప్రవాహంతగ్గించే విధంగా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకోసం అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద వివిధ శాఖలకు చెందిన 139 చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు రాజీవ్ కుమార్ తెలిపారు. మద్యం, నగదు పంపిణీ, బహుమతుల పంపిణీ వంటి వాటి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టడి చేసేందుకు కేంద్రరాష్ట్రాలకు చెందిన 20 టాస్క్‌ఫోర్స్‌లు సమన్వయం చేసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. గత రెండేళ్లుగా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల సమయంలో పెద్దఎత్తున నగదు జప్తు చేశామన్నారు. 2018–19లో రూ. 366 కోట్ల నగదును సీజ్ చేస్తే 2022–23లో ఆ మొత్తం విలువ రూ. 3,247 కోట్లకు చేరిందన్నారు.

అందుబాటులోకి సీవిజిల్ యాప్

నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని ఓటర్లకు పలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఇందుకోసం సీవిజిల్ అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సీవిజిల్ యాప్ ద్వారా ఏదైనా ఫిర్యాదు వస్తే 100 నిమిషాల్లోనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలను జారీ చేసినట్లు తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటర్లకు సంబంధించిన అన్ని సేవలను అందిస్తున్నామని, అలాగే అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా సమర్పించే అఫిడవిట్లు, ర్యాలీల అనుమతి కోసం సువిధ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మొదట ఏ పార్టీ దరఖాస్తు చేస్తే ఆపార్టీకే అనుమతివ్వాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల నేర చరిత్ర తెలుసుకునే విధంగా కేవైసీ (నో యువర్ కాండిడేట్) యాప్‌ను తీసుకురావడంతో పాటు అభ్యర్థి నేరచరిత్రను తప్పనిసరిగా మూడుసార్లు దినపత్రికలు, టీవీ ఛానల్స్‌లో ప్రచురించాల్సిందిగా కోరారు. దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా ఉండే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద అని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్‌గోయల్, రాష్ట్ర ఎన్నికలప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై

టీడీపీది బోగస్ ప్రచారమే

- కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలతో సుస్పష్టం
- పూర్తి స్వచ్ఛతతో ఓటర్ల జాబితా తయారు చేస్తున్నాం: సీఈసీ రాజీవ్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దొంగ ఓట్లు నమోదు, గంపగుత్తగా ఓట్ల తొలగింపు, జీరో ఇంటి నంబర్‌పై ఓటర్ల నమోదు అంటూ తెలుగుదేశం పార్టీ, పచ్చ మీడియా చేసిన ప్రచారంలో వీసమెత్తు నిజం లేదన్న విషయం బట్టబయలైంది. రానున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్, కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ విజయవాడలో రెండు రోజుల సమీక్ష నిర్వహించారు. తొలిరోజు మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం అనంతరం జిల్లాలవారీగా ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. బుధవారం రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన టాస్క్‌ఫోర్స్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఇతర సభ్యులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు చేసిన ఫిర్యాదులు.. వాటిల్లోని వాస్తవాలను అంశాల వారీగా వివరించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ ఏమన్నారంటే..

పలు ఫిర్యాదులు, సూచనలు వచ్చాయి

గుర్తింపు పొందిన ఆప్, బీఎస్పీ, ఐఎన్సీ, టీడీపీ, వైఎస్సార్‌సీపీ వంటి పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు వచ్చి కలిశారు. పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించేస్తున్నారని, చనిపోయిన, డూప్లికేట్, ఒకే ఇంటి నంబర్‌పై 10 కంటే ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నంబర్ పేరున ఓట్లు అంటూ వివిధ అంశాలపై ఫిర్యాదు చేశారు. అలాగే స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రాజకీయ పార్టీల ఫిర్యాదులను అంశాల వారీగా మీ ముందుకు తీసుకు వస్తున్నా.

➤ జనవరి 06, 2023 నుంచి ఆగస్టు 30, 2023 మధ్య తొలగించిన 21 లక్షల ఓట్లను జిల్లా ఎన్నికల అధికారులు పునఃసమీక్షించారు. ఆ 21 లక్షల ఓట్లలో 13,061 ఓట్ల విషయంలోనే తప్పులు దొర్లాయి. అంటే తొలగించిన మొత్తం ఓట్లలో ఇది కేవలం 0.61 శాతం మాత్రమే. తప్పులు దొర్లిన ఓట్లను తిరిగి సవరించడం జరిగింది.

➤ మృతి చెందిన, ఇంటి మార్పు, డూప్లికేట్ ఓటర్లపై వచ్చిన ఫిర్యాదుల విషయానికి వస్తే.. వీటికి సంబంధించి 14.48 లక్షల దరఖాస్తులు వస్తే అందులో 5.65 లక్షల ఓటర్లు చనిపోవడం లేదా శాశ్వతంగా వేరే చోటికి వెళ్లిపోవడం, ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం గుర్తించి వాటిని తొలగించాం.

➤ ఒకే ఇంటి నంబర్‌పై పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేసులను పరిశీలించడానికి మా సిబ్బంది 1.57 లక్షల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించి 20 లక్షల ఓట్లను పరిశీలించడం జరిగింది. అక్టోబర్ 27, 2023 నాడు ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఈ విధంగా 9.49 లక్షల ఓట్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్యను 65,964కు తగ్గించడం జరిగింది. ఇందులో 4.52 లక్షల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు తేలగా 26,679 మంది ఓటర్లకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మిగిలిన వారు ఆ ఇంటి నంబర్లలోనే నివసిస్తున్నారు.

➤ జీరో ఇంటి నంబర్‌తో నమోదయ్యాయంటూ వచ్చిన ఫిర్యాదుల విషయానికి వస్తే.. ఆ విధంగా 2.52 లక్షల కుటుంబాలు కనపడ్డాయి. వాటిలో 97 శాతం చిరునామా నమోదు చేయడం ద్వారా సరిదిద్దడం జరిగింది. పూర్తి స్వచ్ఛత ఉండే విధంగా ఓటర్ల జాబితాను తయారు చేయడానికి శాయశక్తులా కృషి చేశాం.

ఒకరికి ఒక చోటే ఓటు ఉండాలి

ఒకరికి ఒక చోట మాత్రమే ఓటు ఉండాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లను కలిగి ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఎన్నికల చట్ట ప్రకారం ఆస్తులు లేకపోయినా నివసిస్తున్న చోట (ఆర్డినరీ రెసిడెన్స్) ఓటు హక్కు కలిగి ఉండవచ్చు. ఊరిలో ఆస్తులు ఉన్నంత మాత్రాన అక్కడ నివాసం ఉండకపోతే మాత్రం ఓటు నమోదు చేసుకోవడం కుదరదు. తెలంగాణలో ఓటు వేసి ఇప్పుడు అక్కడ తొలగించుకొని ఇక్కడ నమోదు చేసుకుంటున్నారంటూ వస్తున్న ఆరోపణలపై చాలా జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటున్నాం. తప్పుడు స్టేట్‌మెంట్స్ సమర్పించి ఓటు నమోదు చేసుకున్నట్లు తేలితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

నేటి నుంచి విధుల్లోకి మున్సిపల్ కార్మికులు

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సీడీఎంఏ కోటేశ్వరరావు, ఇతర ఉన్నతాధికారులు కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. సీవరేజీ మరణాలకు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రూ.30 లక్షలు పరిహారం చెల్లింపు, సరెండర్ లీవ్ బిల్లులు విడుదల, రెగ్యులర్ కార్మికులకు పీఎఫ్ అకౌంట్ చెల్లింపు, పారిశుద్ధ్య కార్మికులు కానివారి కేటగిరీల మార్పు విషయంలో ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై సత్వరమే చర్యలు తీసుకుంటామని గతంలోనే మంత్రుల బృందం హామీ ఇచ్చింది. అలాగే గతంలో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపును కూడా అంగీకరించింది. కాల్వలు, బాత్రూం క్లీనర్స్, సీవరేజ్, గార్బేజ్ సిబ్బంది, మలేరియా వర్కర్స్ వంటి 10 కేటగిరీల సిబ్బందికి ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేలు వేతనం, రూ.6 వేల అలవెన్సు మొత్తం రూ.21 వేలను ఒకేసారి వేతనంగా ఇస్తామని మంత్రి బొత్స తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులు, డ్రైవర్లకు 18,500 వేతనం, రూ.6 వేలు అలవెన్సులు కలిపి రూ. 24,500 ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలతో పాటు సమ్మె కాలానికి కూడా కార్మికుల వేతనాలను చెల్లిస్తామన్నారు. కార్మికులపై నమోదైన కేసులను ఎత్తివేయనున్నట్టు ప్రకటించారు. ఈ సంక్రాంతికి ప్రతి కార్మికునికి రూ.1,000 ఇస్తామన్నారు. 2019 నుంచి మరణించిన కార్మికుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా పొందేందుకు మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామని, జీవో ఇచ్చిన తర్వాత అప్లై చేసుకుంటే రెండు నెలల్లో ఎక్స్‌గ్రేషియా ఇస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హామీలకు కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయని, గురువారం మినిట్స్ ఇస్తామని మంత్రి బొత్స ప్రకటించారు. చర్చలు సానుకూలంగా జరిగాయని, సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. గురువారం నుంచి కార్మికులు విధుల్లోకి వస్తారన్నారు. జీవో వచ్చాక సమ్మెను విరమిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సంఘాల నాయకులు ఆనందరావు, వై.వి.రమణ (వైఎస్సార్‌టీయూసీ), ఎ.రంగనాయకులు (ఏఐటీయూసీ), పి.సుబ్బారాయుడు (ఏఐటీయూసీ), అబ్రహం లింకన్ (ఐఎఫ్‌టీయూ), జి.ప్రసాద్, కె.ఉమామహేశ్వరరావు (ఏపీసీఐటీయూ), జి.రఘురామరాజు, శ్యామ్ (టీఎన్‌టీయూసీ), మధుబాబు, ఆంజనేయులు (ఏపీ ఎంఈడబ్ల్యుయూ), జీవీఆర్కేహెచ్ వరప్రసాద్, కె.శ్రీనివాసరావు (ఏఐసీటీయూ) పాల్గొన్నారు.

ప్రత్యేక కమిటీ ఏర్పాటు

రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సంఘాల విజ్ఞప్తి మేరకు పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్‌బీల్లో) పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల విధుల స్వభావాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ కమిషనర్లు, సీడీఎంఏ అధికారులు, యూడీఏల వైస్ చైర్మన్లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తూ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులిచ్చారు. వీరు స్కిల్డ్, అన్ స్కిల్డ్ సిబ్బంది విధులు, అందిస్తున్న వేతనాలపై అధ్యయనం చేసి ఏడు రోజుల్లో నివేదిక సమర్పించనున్నారు.

చిరు వ్యాపారులకు నేడు 'జగనన్న తోడు'

- వరుసగా 8వ విడత రుణాలు, వడ్డీ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్
- ఒక్కొక్కరికి రూ.10 వేలు, అంతకు పైన రూ.13 వేల వరకు వడ్డీ లేని రుణాలు
- ఈ విడతలో 3,95,000 మందికి రూ.417.94 కోట్లు
- 5.81లక్షల మందికి రూ.13.64 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్
- నేడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవిస్తూ, మరో ఒకరిద్దరికి సైతం ఉపాధి కల్పిస్తున్న చిరు వ్యాపారులు అధిక వడ్డీల బారిన పడకుండా వారికి అండగా నిలుస్తూ, వారి ఇళ్లలో ముందుగానే పండగ సంతోషాలు వెల్లివిరిసేలా వరుసగా 8వ విడత జగనన్న తోడు పథకం అమలుకు సీఎం వైఎస్ జగన్ గురువారం శ్రీకారం చుడుతున్నారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ 3,95,000 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు, అంతకుపైన రూ. 417.94 కోట్ల వడ్డీ లేని కొత్త రుణాలు సీఎం జగన్ ప్రభుత్వం గురువారం అందిస్తోంది. మొత్తం 16,73,576 మంది లబ్ధిదారుల్లో ఈ విడతలో వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద 5.81 లక్షల మంది లబ్ధిదారులకు రూ.13.64 కోట్లు చెల్లించనున్నారు. ఈ రెండూ కలిపి మొత్తం రూ.431.58 కోట్లను సీఎం వైఎస్ జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.



ఇదీ 'జగనన్న తోడు' పథకం

సీఎం వైఎస్ జగన్ నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు వారి కాళ్ల మీద వారు నిలదొక్కుకొనేలా జగనన్న తోడు పథకం కింద ఆర్థిక చేయూతనిస్తున్నారు. ఒక్కొక్కరికి ఏటా రూ.10 వేల రుణం సున్నా వడ్డీకే అందిస్తున్నారు. రుణాలను సకాలంలో చెల్లించినవారికి ఏడాదికి మరో రూ.1,000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకు వడ్డీలేని రుణం అందిస్తున్నారు. ఇలా ఇప్పటికి ఏడు విడతలు రుణాలు, వడ్డీని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 8వ విడతగా గురువారం అందిస్తున్న రూ.417.94 కోట్ల రుణంతో కలిపి ఇప్పటివరకు చిరువ్యాపారాలు చేసుకునే 16,73,576 మంది లబ్ధిదారులకు అందించిన వడ్డీ లేని రుణాలు రూ. 3,373.73 కోట్లు. అదే విధంగా ఈ విడతలో అందించే వడ్డీతో కలిపి ఇప్పటివరకు 15.87 లక్షల లబ్ధిదారులకు తిరిగి చెల్లించిన వడ్డీ రూ.88.33 కోట్లు. సకాలంలో రుణాలు చెల్లించిన చిరు వ్యాపారులు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని ఆరు నెలలకోసారి సీఎం జగన్ ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోంది.

వీరందరికీ 'జగనన్న తోడు'

10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు స్థలంలో శాశ్వత లేక తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకున్నవారు, తోపుడు బండ్లపై వస్తువులు, కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు అమ్ముకుని జీవించే వారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునేవారు, గంపలు, బుట్టలతో వస్తువులు అమ్మేవారు, చేనేత, సంప్రదాయ చేతివృత్తుల కళాకారులకు ఈ పథకం అందిస్తున్నారు.

దేశానికే ఆదర్శంగా ఏపీ

చిరు వ్యాపారులను ఆదుకోవడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. 'జగనన్న తోడు' ద్వారా పూర్తి వడ్డీ రాయితీ (7.32% నుండి 15.85% వరకు) కల్పిస్తోంది జగనన్న ప్రభుత్వం. దేశవ్యాప్తంగా 'పీఎం స్వనిధి' ద్వారా 58,65,827 మంది చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తే, ఏపీలో సీఎం వైఎస్ జగన్ ఏకంగా 16,73,576 మందికి 'జగనన్న తోడు' ద్వారా వడ్డీ లేని రుణాలు అందించారు. దేశవ్యాప్తంగా 'పీఎం స్వనిధి' కింద ఇప్పటి వరకు చిరు వ్యాపారులకు ఇచ్చిన రుణాలు రూ. 10,220.47 కోట్లు. రాష్ట్రంలో 'జగనన్న తోడు' ద్వారా అందించిన రుణాలే అక్షరాలా రూ.3,373.73 కోట్లు. దేశవ్యాప్తంగా 'పీఎం స్వనిధి' కింద చిరు వ్యాపారులకు రీయింబర్స్ చేసిన వడ్డీ రూ. 138.49 కోట్లు కాగా, 'జగనన్న తోడు' ద్వారా మన రాష్ట్రంలో రీయింబర్స్ చేసిన వడ్డీ రూ.88.33కోట్లు.

దొంగ ఓట్ల సృష్టికర్త చంద్రబాబే

- పక్క రాష్ట్రం ఓట్లు తెచ్చుకుని కుప్పంలో గెలుపు
- మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, వేదికపై మంత్రి మేరుగు, బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: పక్క రాష్ట్రంలో దొంగ ఓట్లను తెచ్చుకుని చంద్రబాబు ఇప్పటి వరకు కుప్పంలో గెలుస్తూ వచ్చారని, అసలు దొంగ ఓట్లకు పునాది వేసింది ఆయనేనని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా దర్శిలో బూచేపల్లి నివాసం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు ముఖ్య అతిథులుగా మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఇకపై చంద్రబాబు కుప్పంలో గెలిచే పరిస్థితి లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఉన్నత కులాల్లో ఉన్న పేదలు, రైతులు, వికలాంగులు, నిరుద్యోగుల కోసం నిరంతరం గొప్ప కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. జగనన్న ఈ నాలుగున్నరేళ్లలో రూ.2.50 లక్షల కోట్లను పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేశారని తెలిపారు. అదే తమ గుండె ధైర్యమని చెప్పారు. దేశం గర్వించేలా రూ.400 కోట్లు ఖర్చు చేసి విజయవాడ నడిబొడ్డులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రైతులు కరెంట్ అడిగితే చంద్రబాబు ప్రభుత్వం కాల్చివేసిన విషయం ప్రజలు ఎప్పటికీ మరచిపోరని చెప్పారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ సుభిక్షమైన పాలన అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం అవుతుందని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, కందుల గౌతమ్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

మంత్రులు రాజన్నదొర, వేణు



సాక్షి, అమరావతి: విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 19న జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, బీసీ సంక్షేమ, సమాచార శాఖమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లిలో 139 కులాలకు చెందిన 56 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర కార్పొరేషన్లలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. శాసనమండలి విప్, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి సమన్వయకర్తగా హాజరైన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర మాట్లాడుతూ.. విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను, ఆశయాలను, లక్ష్యాలను నమ్మే సీఎం జగన్ సామాజిక న్యాయం చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, అగ్రవర్ణాలలో పేదలకు కూడా సామాజిక న్యాయం చేస్తున్న సీఎం జగన్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆ వర్గాలలో నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని వివరించారు. కార్పొరేషన్ల చైర్మన్లు సచివాలయాల ఉద్యోగులతో సమన్వయం చేసుకుని కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పండుగలా నిర్వహిద్దాం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పండుగలా నిర్వహిద్దామని కార్పొరేషన్ల చైర్మన్లకు పిలుపునిచ్చారు. గ్రామ సచివాలయాల పరిధిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంపై ప్రచారం చేయాలని కోరారు. ఆ కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు పాలకులు కాదు సేవకులని అంబేడ్కర్ చెప్పిన మాటలను తుచ తప్పకుండా పాటిస్తున్న నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఈ సమావేశంలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

చంద్రబాబు, బాలకృష్ణను ఇంటికి పంపుతాం: పెద్దిరెడ్డి



హిందూపురం: కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను కచ్చితంగా ఓడిస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పర్యటనలో భాగంగా బుధవారం ఆయన లేపాక్షి మండలం మానేంపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు అభివృద్ధి చేయాలనే ఆలోచన లేకపోవడం హిందూపురం నియోజకవర్గ ప్రజల దురదృష్టమన్నారు. బాలకృష్ణ ప్రజలకు కనిపించే పరిస్థితి కూడా లేదన్నారు. సీఎం జగన్ పాలనలో 99% హామీలు అమలు చేశామని తెలిపారు. మహిళలకు పెద్దఎత్తున లబ్ధి చేకూర్చామన్నారు. హిందూపురంలో జెండా కొడతామన్నారు.

కుప్పంలో గెలుస్తున్నాం: కుప్పంలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని అన్ని సర్వేల్లో వచ్చిందని, అందువల్లే చంద్రబాబు రెండో నియోజకవర్గాన్ని ఎంచుకునే పనిలో ఉన్నారని పెద్దిరెడ్డి ఎద్దేవా చేశారు. షర్మిల పీసీసీ పగ్గాలు తీసుకున్నా.. కాంగ్రెస్ ప్రభావం ఉండబోదన్నారు.

కాకినాడకు మరో కిరీటం



శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం

రూ.2,123.43 కోట్లతో నాలుగో పోర్టు పనులు

పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్న అరబిందో గ్రూపు

16 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు బెర్తుల అభివృద్ధి	ఇప్పటికే 18 శాతం నిర్మాణ పనులు పూర్తి

2025 నాటికి కాకినాడ సెజ్ గేట్‌వే సిద్ధం

మల్టీ ప్రోడక్ట్ ఇండస్ట్రియల్ జోన్‌గా ఈ ప్రాంతం అభివృద్ధి	దీని ద్వారా 13,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా

నాలుగో పోర్టు రాకతో పోర్టుల నగరంగా కాకినాడకు ఖ్యాతి.. తద్వారా తరలివస్తున్న పరిశ్రమలు

రామాయపట్నం.. మూలపేట.. మచిలీపట్నం పరంపరలో రాష్ట్రంలో మరో పోర్టు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే మూడు పోర్టులు (కాకినాడ డీప్ వాటర్, కాకినాడ యాంకరేజ్, రవ్వ క్యాపిటివ్) ఉన్న కాకినాడ సిగలో త్వరలో మరో పోర్టు చేరనుంది. కాకినాడ సమీపంలోని తొండంగి మండలం పెరుమాళ్లపురం వద్ద సుమారు 1,944 ఎకరాల్లో కాకినాడ సెజ్ గేట్‌వే పోర్టు (కే-సెజ్ పోర్టు)ను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మిస్తున్న ఈ పోర్టు పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. తొలిదశలో సుమారు రూ.2,123.43 కోట్ల పెట్టుబడి వ్యయంతో ఏడాదికి 16 మిలియన్ టన్నుల సామర్థ్యం, నాలుగు బెర్తులతో అరబిందో గ్రూపు ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. 2023 ప్రారంభంలో మొదలైన ఈ పోర్టు నిర్మాణ పనులు పరుగులు పెడుతున్నాయి. పోర్టు నిర్మాణంలో కీలకమైన నార్త్ బ్రేక్ వాటర్, సౌత్ బ్రేక్ వాటర్‌ను నిర్మించడానికి 12 లక్షల టన్నుల రాయిని ఇప్పటివరకు వినియోగించారు. బ్రేక్ వాటర్ నిర్మాణం ఇప్పటికే 45 శాతం మేర పూర్తికాగా మొత్తం ప్రాజెక్టులో పనులు 18 శాతం వరకు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

– సాక్షి, అమరావతి

కాకినాడ గేట్‌వే పోర్టు ముఖచిత్రం



విస్తీర్ణం	1,944 ఎకరాలు
ప్రాజెక్టు వ్యయం	రూ. 2,123.43 కోట్లు
పోర్టు వార్షిక సామర్థ్యం	16 మిలియన్ టన్నులు
బెర్తులు	4 1 కోల్, 2 మల్టీపర్పస్, 1 క్రాఫ్ట్ బెర్త్
సౌత్ బ్రేక్ వాటర్	3,000 మీటర్లు
నార్త్ బ్రేక్ వాటర్	850 మీటర్లు
నౌక గరిష్ట సామర్థ్యం	1,20,000 డీడబ్ల్యూటీ
ఉపాధి	13,000 మందికి..

రూ.50,000 కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం..



ఇలా అన్ని మౌలిక వసతులతో పోర్టు అభివృద్ధి చేస్తుండటంతో ఈ పోర్టు పక్కనే దివీస్ భారీ ఫార్మా యూనిట్, రూ.2,000 కోట్లతో లైఫియస్ ఫార్మా పేరుతో పెన్సులిన్ తయారీ యూనిట్‌ను.. రూ.2,000 కోట్లతో క్యూలే ఫార్మా యూనిట్‌ను అరబిందో ఫార్మా ఏర్పాటుచేస్తోంది. వచ్చే ఐదేళ్లలో రూ.50,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఈ సెజ్ ఆకర్షిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ,5,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఫార్మాస్యూటికల్స్, గ్రీన్ హైడ్రోజన్, టెక్స్‌టైల్స్, ఆక్వా, స్టీల్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. కాకినాడ సెజ్‌కు ఆనుకుని ఉన్న ఉప్పాడ వద్ద రాష్ట్ర ప్రభుత్వం మినీపోర్టు తరహాలో భారీ ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేస్తుండటంతో ఆక్వా రంగానికి చెందిన పలు సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే నెక్కంటి సీ ఫుడ్స్, దేవీ ఫిషరీస్, సంధ్య ఆక్వా, కాంటినెంటల్ ఫిషరీస్, ఆదివిష్ణు వంటి పలు సంస్థలు ఉత్పత్తిని ప్రారంభించి 8,000 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. ఇందులో అత్యధికమంది మహిళలు.. పైగా స్థానికులే కావడం గమనార్హం.




పర్యావరణ అనుమతులు మంజూరు..

5,886 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కాకినాడ సెజ్ మధ్యలో ఈ పోర్టు నిర్మాణం జరుగుతోంది. మల్టీ ప్రోడక్ట్ ఇండస్ట్రియల్ జోన్‌గా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి ఈ మధ్యనే కీలక అనుమతులు లభించాయి. ఈ పోర్టు నిర్మాణాన్ని 2025 నాటికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పోర్టులో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి 30 ఏళ్ల వరకు ఆదాయంలో 2.70 శాతం ప్రభుత్వానికి రానుండగా.. 31–40 ఏళ్ల వరకు 5.40 శాతం, 41–50 ఏళ్ల వరకు 10.80 శాతం వాటా ఏపీ మారిటైమ్ బోర్డుకు సమకూరనుంది. ఈ పోర్టు ద్వారా ప్రత్యక్షంగా 3,000 మందికి పరోక్షంగా 10,000 మందికి చొప్పున మొత్తం 13,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. పోర్టు లావాదేవీలు, పరిశ్రమల రాకతో రాష్ట్ర జీడీపీ పెరగడంతో పాటు ఆదాయం, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందని ఆర్థికవేత్తలు స్పష్టంచేస్తున్నారు.



మౌలిక వసతులకు భారీ వ్యయం..

- కే-సెజ్ గేట్‌వే పోర్టును ఇటు కాకినాడతో పాటు అటు అన్నవరం వద్ద జాతీయ రహదారికి రోడ్డు, రైల్వేలైన్ ద్వారా అనుసంధానించనున్నారు.
- సాగరమాల ప్రాజెక్టుకు కింద 40.కి.మీ మేర నాలుగులైన్ల రహదారిని రూ.1,480 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.
- అలాగే, ఈ పోర్టును అన్నవరానికి అనుసంధానిస్తూ రూ.300 కోట్లతో 25కి.మీ మేర రైల్వేలైన్‌ను ఏర్పాటుచేయనున్నారు.
- 24 నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వీలుగా 400/200 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేయడానికి ట్రాన్స్‌కోకు 64 ఎకరాలను కేటాయించారు. 2,000 ఎంవీఏ విద్యుత్‌ను ఉత్పత్తి సామర్థ్యాన్ని తట్టుకునే విధంగా ఈ సబ్‌స్టేషన్‌ను అనుసంధానిస్తున్నారు.
- ఈ సెజ్‌లోని పరిశ్రమల ద్వారా వచ్చే వ్యర్థాలను శుద్ధిచేయడానికి ఒక ఉమ్మడి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయడమే కాకుండా ఈ వ్యర్థాలను గొట్టాల ద్వారా 35 కి.మీ దూరంలోని పాయకరావుపేటవరకు తరలించి అక్కడ నుంచి సుమారు రెండు కి.మీ లోతున సముద్రంలో కలపనున్నారు.
- ఇక్కడ యూనిట్లకు అవసరమైన నీటిని పోలవరం కాలువతో పాటు సుముద్రపు నీటిని శుద్ధిచేసుకుని వినియోగించుకునేందుకు డీశాలినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్నారు.
- అన్నవరం నుంచి పోలవరం కాలువ ద్వారా 100 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయడంతో పాటు రూ.100 కోట్లతో డీశాలినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్నారు.



2025 నాటికి అందుబాటులోకి తెస్తాం..



ఇప్పటికే కీలకమైన బ్రేక్ వాటర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే డ్రెడ్జింగ్ బెర్తుల నిర్మాణ పనులు ప్రారంభించనున్నాం. బ్యాంకులతో రుణాల ద్వారా నిధుల సమీకరణ పూర్తికావడంతో ఇక పనులు వేగవంతం కానున్నాయి. 2025 ద్వితీయ త్రైమాసికం నాటికి పోర్టును పూర్తిస్థాయిలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– ఓం రామిరెడ్డి, ఎండీ, కాకినాడ గేట్‌వే పోర్ట్స్ లిమిటెడ్

మా వాళ్లకు ఉద్యోగాలొస్తాయన్న ఆశ..



నాకున్న నాలుగెకరాల భూమి సెజ్‌కు ఇచ్చాను. ఇక్కడి ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మాలాంటి వాళ్లకు ఉద్యోగాలు వస్తాయి. మా వాళ్లు బాగుపడతారనే నమ్మకంతో భూమి ఇచ్చాను. అందుకు తగ్గట్లుగానే సెజ్‌లో నాలుగేళ్లుగా పనిచేస్తున్నాను. పెద్దగా చదువుకోకున్నా భూమి ఇచ్చాననే కారణంతో ఉద్యోగం ఇచ్చారు. ఇప్పుడిప్పుడే ఫ్యాక్టరీలు వస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– యాదాల చంటిబాబు. ఆవులమంద, పెరుమాళ్లపురం, తొండంగి మండలం

ఇప్పుడు పనులు వేగవంతమయ్యాయి..



గత ప్రభుత్వంలో కంటే ఇప్పుడు చాలా సమస్యలకు పరిష్కారం లభించింది. గతంలో పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు సెజ్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ సెజ్‌కు భూమి ఇచ్చిన వారిలో నేను ఒకడిని. గత పాలనలో కొంతమందిని బెదిరించి భూములు లాక్కున్నారు. అప్పట్లో నాపై అన్యాయంగా 15 కేసులు బనాయించారు. ఈ ప్రభుత్వం వచ్చాక గత డిసెంబరు 26న 12 కేసులు ఎత్తేశారు. మరో 3 కేసులు నాపై పెండింగ్‌లో ఉన్నాయి.

– దూలం శ్రీను, గోర్సపాలెం, తొండంగి మండలం

భారీగా పాండిచ్చేరి మద్యం పట్టివేత



తనిఖీల్లో పట్టుబడ్డ పాండిచ్చేరి మద్యం

తడ(తిరుపతి జిల్లా): పాండిచ్చేరిలో కొనుగోలు చేసి ఆంధ్రాకు తరలిస్తున్న మద్యం బాటిళ్లను తడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌ఐ జేపీ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. తడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నాయుడుపేట డీఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమిళనాడు సరిహద్దుల్లోని బీవీపాళెం వద్ద తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారుజామున చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో నాలుగు బాక్సుల్లో మద్యం రవాణా అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. బాపట్ల జిల్లాకు చెందిన బేబేశ్వరరావుని అదుపులోకి తీసుకుని బాక్సులు పరిశీలించగా 114 ఫుల్ బాటిళ్ల బ్రాందీ, విస్కీతోపాటు 10 క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈ మద్యం విలువ పాండిచ్చేరిలో రూ.66,760 కాగా ఆంధ్రాలో రూ. 1,30,360 ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 సెల్‌ఫోన్లు స్వాధీనం

తడ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ల చోరీలు, మిస్సింగ్‌లకు సంబంధించి అందిన ఫిర్యాదులపై విచారించిన పోలీస్ సిబ్బంది సీఈఐఆర్ యాప్ ద్వారా మూడు నెలల్లో 27 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

తెలుగువాళ్లు నా వల్లే బాగుపడ్డారు

- బొబ్బిలి, తుని సభల్లో చంద్రబాబు ప్రగల్భాలు
- నాకు కష్టం వస్తే ఎనభై దేశాల్లో సంఘీభావం
- నేను ఆ రోజు కష్టపడితే ఈరోజు ప్రజలు అనుభవిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు అభాండాలు



బొబ్బిలిలో చంద్రబాబు మాట్లాడకముందే జనం వెళ్లిపోవడంతో బోసిపోయిన సభా ప్రాంగణం

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి ప్రతినిధి, కాకినాడ/తుని: తెలుగువాళ్లు తన వల్లే బాగుపడ్డారని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చెప్పుకొన్నారు. టెక్నాలజీకి ప్రాముఖ్యత కల్పించి ముందుగా తాను తీసుకున్న నిర్ణయం వల్లే ప్రపంచమంతా తెలుగువారు రాణిస్తున్నారని అన్నారు. తాను ఆరోజు కష్టపడితేనే ఈరోజు ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. ఈరోజు హైదరాబాద్‌పై తన ప్రగాఢ ముద్ర కనపడుతోందని అన్నారు. రా కదలి రా పేరుతో బుధవారం విజయనగరం జిల్లా బొబ్బిలి, కాకినాడ జిల్లా తునిలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. అబద్ధాలు, ప్రగల్భాలు పలుకుతూ ప్రజలను అడిగి మరీ చప్పట్లు కొట్టించుకున్నారు. ఇటీవల తనకు కష్టం వస్తే ఎనభై తొంభై దేశాల్లో సంఘీభావం ప్రకటించారని, అదీ తన సత్తా అని చెప్పారు. ఐదేళ్లుగా మన రాష్ట్రం వెనుకబడిపోయిందని, తామొస్తే ప్రజల భవిష్యత్తు బంగారం చేస్తానని అన్నారు. యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, కరెంటు చార్జీలు తగ్గిస్తాం అంటూ పలు హామీలు గుప్పించారు. తాను చంద్రన్న బీమా, పెళ్లి కానుక, విదేశీ విద్య ఇచ్చానని చెప్పుకొచ్చారు. ఇప్పుడున్నది రద్దుల ప్రభుత్వమని, పేదవాడి వ్యతిరేక ప్రభుత్వమని ఆరోపించారు.

నోటికొచ్చినట్లు...

'పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ ఫొటో పెడతారా? ఆయనో ఏసుప్రభువు. ఎక్కడకు పోతున్నారు? ఆయన పంపించారా ఏసు ప్రభువని? సర్వే రాళ్లపై ఆయన ఫొటో ఏంటి? భూ రక్షణ కాదు. భూ భక్షణ చట్టం. ఇది అమలయితే మీ ఇల్లు మీది కాదు. మీ భూమి మీది కాదు. కబ్జా అయితే నేరుగా హైకోర్టుకు పోవాలి. మీ రికార్డులు తారుమారు చేస్తున్నాడు జగన్. దీనికి మద్దతు ఇవ్వం' అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు.

బొత్సపై నోరు పారేసుకున్న బాబు

'ఉత్తరాంధ్రలో బొత్స ఉన్నాడు. మనిషి లావు. ఆయనేం చెబుతాడో మనకు అర్థం కాదు. విజయసాయి రెడ్డి, సుబ్బారెడ్డి వచ్చారు. బొత్స మాట్లాడడు. పెత్తందార్లకు పెత్తనం' అంటూ దుర్భాషలాడారు. దేశంలో ధనిక ముఖ్యమంత్రుల్లో నంబర్ వన్ పెత్తందారు జగన్ అన్నారు. తునిలో మంత్రి రాజా చెక్ పోస్టులలో వసూళ్లు, మామూళ్ల దెబ్బకు జనం పారిపోతున్నారన్నారు. బియ్యం మాఫియాకు కర్త, కర్మ, క్రియ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడినే అని ఆరోపించారు.

కార్యకర్తలపైనే చులకన మాటలు

ఈ సభల్లో కార్యకర్తలపైనే చంద్రబాబు చులకనగా మాట్లాడారు. 'మా తమ్ముళ్లు మందు బాబులు. సాయంత్రం క్వార్టర్ వేసుకుని నిద్రపోదామనుకుంటారు. మీ బలహీనత ముఖ్యమంత్రికి అర్థమైపోయింది. అందుకే బాదుడే బాదుడు. 50 రూపాయల బాటిల్ ఇప్పుడు రూ.200కు అమ్ముతున్నారు. మద్యం ధరలు పెంచి కాపురాల్లో చిచ్చు పెడుతున్నారు' అంటూ ఆరోపించారు. 'టీడీపీ, జనసేన జెండాలు పట్టుకుని ఇంటింటికీ వెళ్లండి. గ్లాసు కూడా తీసుకెళ్లండి. నీళ్ల తాగడానికి పనికొస్తుంది' అని వ్యాఖ్యానించారు.

పోతాం.. మేమెళ్లిపోతాం..

'రా కదిలి రా' అంటూ టీడీపీ నిర్వహించిన ఈ సభలకు టీడీపీ నేతలు రూ.300ల నుంచి రూ.500 నగదు, క్వార్టర్ మందు, పలావు ప్యాకెట్ ఇచ్చి జనాన్ని అయితే తీసుకు వచ్చారు కానీ, చంద్రబాబు ప్రసంగం అయ్యే వరకు వారిని ఆపలేకపోయారు. పార్టీ కేడర్ ఎంత ప్రయత్నించినా జనం వెళ్లిపోయారు. చంద్రబాబు ప్రసంగం మొదలైన కొద్ది సేపటికే సగం కుర్చీలు ఖాళీ అయిపోయాయి. ముఖ్యంగా మహిళలు మూకుమ్మడిగా లేచి వెళ్లిపోవడంతో పార్టీ కేడర్ చేతులెత్తేసింది. కుర్చీలు ఖాళీ అయిపోయినా, చంద్రబాబు మాత్రం ఎక్కడా ఆపకుండా రెండు సభల్లోనూ గంటకు పైగా ఏకబిగిన ప్రసంగించారు. బొబ్బిలి సభకు పార్టీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత గైర్హాజరయ్యారు.

సంక్రాంతి తర్వాత టీడీపీ ఖాళీ

- చంద్రబాబు తుని సభ తుస్సు
- మీడియా సమావేశంలో మంత్రి దాడిశెట్టి రాజా



తుని: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వచ్చే ఎన్నికల్లో తమదే విజయమంటూ పగటి కలలు కంటున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఎద్దేవా చేశారు. బుధవారం రాత్రి ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మంత్రి రాజా విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు తుని మండలం చామవరంలో షో పెట్టుకుని 10 నిమిషాల వ్యవధిలోనే వెళ్లిపోయారని, జనం లేక పిచ్చి మాటలు మాట్లాడారని తీవ్రస్థాయిలో దాడిశెట్టి ధ్వజమెత్తారు. సంక్రాంతి తర్వాత టీడీపీ మొత్తం ఖాళీ అవుతుందని, అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. 2014–2019 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు కాపులకు ఇచ్చిన హామీలో ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా విచక్షణా రహితంగా కాపులను అవమానానికి గురి చేశారని విమర్శించారు. ఈ విషయాన్ని ఎప్పటికీ కాపులు మర్చిపోలేదన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు, అతని కుమారుడు లోకేశ్ ముఖ్య నాయకులు రూ.లక్షల కోట్లు దోచుకున్నారని దాడిశెట్టి దుయ్యబట్టారు.

మరుగుదొడ్లలోనూ దోచుకున్నారు

తుని నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్వచ్ఛ భారత్ మరుగుదొడ్ల నిర్మాణంలోనూ యనమల సోదరులు, స్థానిక నాయకులు రూ.20 కోట్లు దోచుకున్నారని మంత్రి దాడిశెట్టి ఆరోపించారు. 1975లో తాను పుట్టక ముందే తమ పూర్వీకులు పదెకరాల భూమిని ఇళ్ల స్థలాల కోసం ఉచితంగా దానం చేశారని పేర్కొన్నారు. తాను తుని నియోజకవర్గంలో అవినీతికి పాల్పడ్డానని చంద్రబాబు చేసిన ఆరోపణల్లో ఇసుమంతైనా వాస్తవం లేదని, చంద్రబాబు తిరుపతిలో జేబులు కొట్టారని, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావే స్వయంగా ఈ విషయం చెప్పారని పేర్కొన్నారు. తునిలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బస్సు యాత్ర సభకు వచ్చిన జనంలో పావు వంతు కూడా చంద్రబాబు సభకు రాలేదన్నారు. చంద్రబాబు హయాంలో సాగునీరందక రైతులు ఒక్క పంట కూడా పండించుకునే పరిస్థితి ఉండేది కాదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రెండు పంటలకు సాగునీరు అందించిన ఘనత తమకే దక్కుతోందన్నారు.

వైఎస్సార్ సీపీలో అందరికీ న్యాయం

చంద్రబాబుకు వెన్నుపోటు రాజకీయం తెలుసునని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నమ్మిన వారికి మేలు చేయడం మాత్రమే తెలుసునని దాడిశెట్టి పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి మళ్లీ తాను వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తానని, దీనిపై కొన్ని మీడియా సంస్థలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీలో అసెంబ్లీ టికెట్లు దక్కని నేతలకు తగిన న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక ఎటువంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పే శిరోధార్యమని, దానికి కట్టుబడి ఉంటానని దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'గుంటూరు కారం' టికెట్ ధర పెంపునకు ఓకే

తొలి 10 రోజులు రూ.50 వరకు పెంపునకు అనుమతి

సాక్షి, అమరావతి: ప్రముఖ సినీ నటుడు మహేశ్‌బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమా టికెట్ ధరలను తొలి పది రోజులు గరిష్ఠంగా రూ.50 వరకు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్రంలో సినీ రంగ పరిశ్రమ అభివృద్ధి కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆసియా షూటింగ్'లో స్వర్ణం

సత్తా చాటిన ఏపీ షూటర్ మద్దినేని



సాక్షి, అమరావతి: ఆసియా షూటింగ్ చాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంతర్జాతీయ షూటర్ మద్దినేని ఉమామహేశ్ సత్తా చాటారు. ఇండోనేషియాలోని జకర్తాలో జరుగుతున్న పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ జూనియర్స్‌లో ఇషా అనిల్ తక్సలేతో కలిసి స్వర్ణ పతకం సాధించారు. ఈ ద్వయం చైనాకు చెందిన చూజికింగ్, పాన్ బోవెన్లపై 17–11 స్కోరుతో విజయకేతనం ఎగురవేశారు. మరో వైపు టీమ్ ఈవెంట్‌లో చైనా క్రీడాకారులపై తుది వరకు పోరాడి రజత పతకం పొందారు.

ఏఈఈ ఎంపిక జాబితా విడుదల

సాక్షి, అమరావతి: వివిధ ఇంజినీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్)ను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో చూడాలని కార్యదర్శి ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీలకు సంక్రాంతి సెలవులు

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు గురువారం నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. దీంతో నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఇళ్లకు బయల్దేరారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ):సంక్రాంతి సెలవుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విజయవాడ డివిజన్ మీదుగా మూడు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ మండ్రుప్కర్ బుధవారం ప్రకటించారు. తిరుపతి–సికింద్రాబాద్ (07060) 12న రాత్రి 8.25 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. హెచ్‌ఎస్ నాందేడ్–కాకినాడ టౌన్ (07487) 15న మధ్యాహ్నం 2.25 గంటలకు హెచ్‌ఎస్ నాందేడ్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు కాకినాడ టౌన్ చేరుతుంది. కాకినాడ టౌన్–హెచ్‌ఎస్ నాందేడ్ (07488) రైలు 16 సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.10 గంటలకు హెచ్‌ఎస్ నాందేడ్ చేరుతుంది.



ఏలూరు జిల్లా నూజివీడులో మందుల కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



పల్నాడు జిల్లా నరసరావుపేటలో బీపీ పరీక్ష చేస్తున్న సిబ్బంది



జీవీఎంసీ 27వ వార్డు పరిధి అమర్‌నగర్‌లో బీపీ చెక్ చేస్తున్న వైద్యులు



చిత్తూరులో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ అముద



విజయవాడలో మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాష్

వెన్నుపోటు నేతలకు భంగపాటు



- నెల్లూరు జిల్లాలో ఆ ముగ్గురి పరిస్థితి గందరగోళం
- మరోసారి బయటపడ్డ చంద్రబాబు నైజం
- దిక్కుతోచని స్థితిలో వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు:నమ్మిన వారిని మోసం చేయడం , వారిని నట్టేట ముంచేయడం చంద్రబాబు నాయుడి నైజం. సొంత మామనే వెన్నుపోటు పొడిచి అధికారాన్ని లాక్కున్న చంద్రబాబు నిజస్వరూపం తెలిసి కూడా మరోసారి నెల్లూరు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు బొక్కబోర్లా పడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆ ఎమ్మెల్యేల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పార్టీలోకి ఆహ్వానించినప్పుడు చెప్పిన తియ్యటి మాటలు ఇప్పుడు వినిపించడం లేదు. దీంతో ఆ ముగ్గురి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

మాటమార్చి మోసం చేసి..

వెంకటగిరి, నెల్లూరురూరల్, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు చంద్రబాబు చేసిన మోసంపై మథన పడుతున్నారు. జిల్లాలోనే ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చి సీనియర్ పొలిటీషియన్‌గా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి పరిస్థితి ప్రస్తుతం కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. కాంగ్రెస్ పార్టీలో ఓ వెలుగు వెలిగిన ఆనం ప్రస్తుతం చంద్రబాబు రాజకీయ క్రీడలో ఓ పావుగా మారారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయనను 2016లో ఎమ్మెల్సీ లేదా మంత్రి పదవి ఆశ చూపడంతో టీడీపీలో చేరారు. పచ్చ కండువా కప్పుకోగానే మాట మార్చిన చంద్రబాబు కనీసం ఆత్మకూరు పార్టీ ఇన్‌ఛార్జ్‌గా కూడా ఇవ్వకుండా అవమానించారు. టీడీపీలో జరిగిన అవమానాల్ని తట్టుకోలేక కుమిలిపోతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ అక్కున చేర్చుకుని వెంకటగిరి నుంచి బరిలోకి దింపి గెలిపించుకుంది. అయితే అక్కున చేర్చుకున్న పార్టీనే కాదనుకున్న ఆనం పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేయడంతో ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించాల్సి వచ్చింది. దీంతో ఆనం టీడీపీ నేతలతో టచ్‌లోకి వెళ్లి పార్టీ కండువా కప్పుకోకుండానే లోకేశ్ యువగళం పాదయాత్రలో హల్‌చల్ చేశారు. జిల్లా పార్టీ సారథ్య బాధ్యతలతో పాటు నెల్లూరు సిటీ, ఆత్మకూరు సీట్లు ఇస్తామని టీడీపీ అధినేత నమ్మబలకడంతో ఆనం యువగళంలో పాల్గొన్నారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధినేత మాట మారింది. జిల్లా పార్టీ సారథ్య బాధ్యతలు కాకుండా.. ఒక్క ఆత్మకూరుకే పరిమితం కావాలని ఆదేశాలొచ్చాయి. ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. టీడీపీ అంతర్గత సర్వేల్లో కూడా ఈ విషయం తేలడంతో ఆత్మకూరులో పోటీ చేస్తే ఓటమి తప్పదని తెలుసుకున్న ఆనం తనకు నెల్లూరు సిటీ లేదా వెంకటగిరి స్థానాన్ని కేటాయించాలని చంద్రబాబు వద్ద మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఆత్మకూరు లేదా సర్వేపల్లిలో పోటీ చేయాలని తెగేసి చెప్పడంతో ఆనంకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయానంటూ ఆంతరంగికుల వద్ద వాపోయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఉదయగిరికి చెందిన కొందరు టీడీపీ నేతలు ఆనం వద్దకు వెళ్లి ఉదయగిరి రావాలని ఆహ్వానించగా పార్టీలో తన పరిస్థితి ఏమిటో అర్థం కావటం లేదని వాపోయారని తెలుస్తోంది.

కోటంరెడ్డి సీటు వెనుక కుట్ర

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరిస్థితి కూడా టీడీపీలో అయోమయంగా మారింది. రూరల్ టీడీపీ టికెట్ నీదేనంటూ మాట ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఆ సీటు జనసేనకు ఇచ్చేందుకు తెరవెనుక రాజకీయం చేస్తున్నారన్న సమాచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జిల్లాలో ఒక్క సీటైనా జనసేన అడిగే అవకాశం ఉంది. ముందుగా నెల్లూరు సిటీ మీద జనసేన కన్నుపడింది. అయితే మాజీ మంత్రి పొంగూరు నారాయణ తన సామాజికవర్గంలో ఉన్న పరపతిని ఉపయోగించి జనసేన అధినేత వద్ద పంచాయితీ పెట్టారని, నెల్లూరు సీటు ఆశించకుండా ఉంటే ప్యాకేజీతోపాటు మరోచోట పోటీ చేస్తే అక్కడ అయ్యే ఖర్చంతా తానే భరిస్తానంటూ షరతు పెట్టారని ప్రచారం జరుగుతోంది. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి రూరల్ టికెట్ రాకుండా తెరవెనుక కుట్ర చేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.

చంద్రశేఖర్‌రెడ్డికి చంద్రబాబు ఝలక్

ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ఉదయగిరి టికెట్ నీదేనంటూ చంద్రబాబు మాటలు నమ్మి టీడీపీ కండువా కప్పుకున్న చంద్రశేఖర్‌రెడ్డికి చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. అసెంబ్లీ టికెట్ కాదు కదా ఎమ్మెల్సీ కూడా ఇచ్చేది లేదని, ముందు పార్టీకి పనిచేయాలంటూ ఆదేశాలిచ్చారంట. చంద్రశేఖర్‌రెడ్డి సతీమణికి పార్టీ పదవి ఇచ్చి 'ఈ పదవే నీకు ఎక్కువ ఇక చాలు' అని చెప్పడంతో చంద్రశేఖర్‌రెడ్డి మైండ్ బ్లాంక్ అయిందని చెప్పుకుంటున్నారు. ఇటు ఉదయగిరిలో కూడా టీడీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డికి కనీస గౌరవం కూడా ఇవ్వటం లేదు. పార్టీ కార్యక్రమాలకు కూడా ఆహ్వానించక పోవడంతో ఆయన పరిస్థితి కూడా కుడితిలో పడ్డ ఎలుకలా తయారై ఇంటికే పరిమితం అయ్యారనే ప్రచారం సాగుతోంది.

పర్యాటకంలో 'పీపీపీ'

- గండికోటలో ఎకో, అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి
- విజయవాడలో బెరంపార్కు నుంచి భవానీ ద్వీపానికి రోప్ వే ప్రయాణం
- ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించిన ఏపీటీడీసీ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని అపార పర్యాటక వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఏపీ ప్రభుత్వం పీపీపీ విధానానికి పెద్ద పీట వేస్తున్నది. ఇందులో భాగంగా పర్యాటక సామర్థ్యం ఉన్న ప్రాంతాలను ప్రత్యేకంగా సర్వే చేసింది. వీటిల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా అంతర్జాతీయ స్థాయి పర్యాటక సేవలు అందించేందుకు కసరత్తు చేస్తోంది. తొలుత అడ్వెంచర్‌తో పాటు ఆహ్లాదాన్ని పంచే ప్రాంతాల్లో పర్యాటక అనుభూతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రఖ్యాత హోటల్ రంగ సంస్థలు, కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నది.

'అడ్వెంచర్'కు కేరాఫ్ గండికోట

వైఎస్సార్ జిల్లాలోని గండికోట ప్రాంతాన్ని ఎకో, అడ్వెంచర్ టూరిజానికి చిరునామాగా మార్చేందుకు ఏపీటీడీసీ ప్రణాళికలు రూపొందించింది. గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిలిచే గండికోటలో ఇప్పటికే అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఎర్రమల కొండలను చీలుస్తూ వేగంగా ప్రవహించే పెన్నానదిలో బోటింగ్ సౌకర్యాలను మెరుగుపర్చనుంది. వీటితో పాటు అంతర్జాతీయ హోటల్ రంగ సంస్థ ఒబెరాయ్ త్వరలో ఏడు నక్షత్రాల హోటల్ నిర్మాణాన్ని ప్రారంభించనుంది.

కృష్ణానదిపై 'రోప్ వే'

విజయవాడలోని భవానీ ద్వీపం అభివృద్ధిలో భాగంగా రోప్‌వే ప్రాజెక్టును ప్రతిపాదించింది. విజయవాడలోని బెరంపార్కు నుంచి భవానీద్వీపంలోకి కృష్ణా నదిపై 1.2 కిలోమీటర్ల ఏరియల్ పాసింజర్ రోప్‌వేను నిర్మించనుంది. దీంతో రాష్ట్రంలో ఆరుచోట్ల పాటు సీప్లేన్, మరో ఫైవ్‌స్టార్‌హోటల్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానిస్తున్నది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో కన్వెన్షన్ సెంటర్‌తో కూడిన హోటల్ నిర్మాణం, తిరుపతి జిల్లాలోని తుపిలిపాలెం బీచ్‌లో హోటల్ సౌకర్యంతో కూడిన బీచ్ రిసార్టు, నంద్యాల జిల్లాలో వెల్‌నెస్ టూరిజం, వేసైడ్ ఎమినిటీస్ కల్పనకు టెండర్లు ఆహ్వానించింది.

సంక్రాంతికి తెలంగాణ నుంచి అదనంగా వెయ్యి ప్రత్యేక బస్సులు

ఏపీఎస్‌ఆర్టీసీ నిర్ణయం



సాక్షి, అమరావతి: అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో ఆర్టీసీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఇటీవల పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీకి ఉన్న పరిమితులను ఏపీఎస్‌ఆర్టీసీ సమర్థంగా అందిపుచ్చుకోవడమే అందుకు తాజా నిదర్శనం. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు అదనంగా వెయ్యి సంక్రాంతి స్పెషల్ బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. వాస్తవానికి ఆర్టీసీ సంక్రాంతి స్పెషల్ కింద 6,725 బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో హైదరాబాద్ నుంచి సంక్రాంతికి ముందు 1,600 బస్ సర్వీసులు, సంక్రాంతి తరువాత 1,500 బస్ సర్వీసులు నిర్వహించాలని ప్రణాళిక రూపొందించింది. ఏటా సంక్రాంతి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు నడిపేది. కానీ తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తుండటంతో అంచనాలకు మించి మహిళా ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సంక్రాంతికి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపలేమని తెలంగాణ ఆర్టీసీ చేతులెత్తేసింది. ఈ అవకాశాన్ని ఏపీఎస్‌ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. పండుగకు హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు వచ్చేవారికి సౌలభ్యంగా ఉండేందుకు అదనంగా వెయ్యి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి ఏపీలోని విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, అమలాపురం, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, చీరాల, విశాఖపట్నాలకు అదనపు వెయ్యి బస్సు సర్వీసులు నడుపుతారు. బెంగళూరు, చెన్నైల నుంచి కూడా మన రాష్ట్రంలోని తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. వీటితోపాటు విజయవాడ నుంచి కర్నూలు, అనంతపురం, తిరుపతిలకు అదనపు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అదనంగా ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించామని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకాతిరుమలరావు చెప్పారు.

ఇక ఆర్టీసీ కార్గో పార్సిళ్ల పికప్ - డోర్ డెలివరీ

ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు



సాక్షి, అమరావతి: ఇంటి వద్దే కార్గో పార్సిళ్ల పిక్ అప్, గమ్యస్థానంలో డోర్ డెలివరీ సేవలను సకాలంలో అందిస్తామని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. తక్కువ ఖర్చుతో త్వరగా పార్సిళ్లను గమ్యస్థానానికి చేర్చడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే కార్గో డోర్ పిక్ అప్, డోర్ డెలివరీ విధానాన్ని ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు బుధవారం ప్రారంభించారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకుంటే ఇంటికే వచ్చి పార్సిల్‌ను తీసుకువెళ్లడంతోపాటు నిర్ణీత చిరునామాకు డోర్ డెలివరీ చేస్తారు. వాస్తవానికి కార్గో పార్సిళ్ల డోర్ పిక్ అప్, డోర్ డెలివరీ సేవలను ఆర్టీసీ కొంతకాలం క్రితం ఓ ప్రైవేటు స్టార్ట్ అప్ కంపెనీ భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చింది. కానీ ఆ విధానం అంతగా విజయవంతం కాకపోవడంతో మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో సొంతంగానే పిక్ అప్, డోర్ డెలివరీ సేవలు అందించాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా విజయవాడ నుంచి రాష్ట్రంలోని 84 కేంద్రాలకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని బుధవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. గరిష్ఠంగా 50 కిలోల పార్సిళ్లను ఆ 84 కేంద్రాల్లో ఆర్టీసీ బస్ స్టేషన్లకు 10 కి.మీ. పరిధి వరకు డోర్ డెలివరీ చేస్తుంది. కార్గో పార్సిళ్లను బుక్ చేసుకునేందుకు సంప్రదించాల్సినవెబ్‌సైట్:https:// apsrtclogistics. in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 11-1-2024



పండగ శోభ

వాకిళ్లు కళ కళ

**సంక్రాంతి వచ్చిందంటే
ప్రతి వాకిలి ముగ్గులతో మురిసిపోతుంది.
తెల్లటి చుక్కలు మల్లెల్లా ఇంటిముందు వికసిస్తాయి.
రంగులు పూసుకొని ముస్తాబవుతాయి.
స్త్రీలు తెల్లవారుజాము నుంచి ఓపిగ్గా వీటిని తీర్చుదిద్దుతారు.
నిలువు చుక్కలు, అడ్డ చుక్కల మధ్య
మెలి తిరుగుతూ రేఖలు కదులుతాయి.
ఈ ముగ్గుల వెనుక చాలా విశేషాలున్నాయి.
శుభాలూ ఉన్నాయి.
బోసి వాకిలిని ముగ్గుతో
ఎందుకు కళను నింపాలో తెలుసుకుందాం.**

సంవత్సరమంతా ఇంటి వాకిలి ముందు సుద్ద ముక్కతో అమ్మ గీసే ముగ్గు వేరు. సంక్రాంతి రాగానే వేసే ముగ్గు వేరు. సంక్రాంతి పండగ నెలంతా ఇంటిముందు పెద్ద ముగ్గులు పడతాయి. తెల్లగీతలతో ఒక్కోసారి, రంగులతో నిండి ఒక్కోసారి. పండగ నెల వస్తే వీధిలోని స్త్రీలంతా తెల్లవారు జామున లేచి ఇంటి ముందు పెద్ద ముగ్గును వేయడానికి ఇష్టపడతారు. కాని అది ఒక నిమిషంతో అయ్యేదా? వాకిలి చిమ్ముకోవాలి, కళ్లాపి చల్లుకోవాలి, తర్వాత చుక్కలు పెట్టాలి, చుక్కలు కలపాలి, రంగులు అద్దాలి.... యోగా అంటారు గాని ఇంతకు మించిన యోగా లేదు. ఇంతకు మించిన వ్యాయామమూ లేదు. ముగ్గు పెట్టాక ఇంటికి ఇంతకు మించిన కళ లేదు.

మనకు ఉంది... మరి క్రిమి కీటకాలకు?

సంక్రాంతికి పంట చేతికొస్తుంది. కొత్త బియ్యం ఇంట చేరుతాయి. గాదెలు నిండుతాయి. వడ్ల బస్తాలున్న ఇల్లు సమృద్ధిగా కనిపిస్తుంది. కాని పండించింది మనమే తింటే ఎలా? క్రిమి కీటకాదులకు? ముగ్గు ఒక పంపకం. ముగ్గు ఒక దానం. ముగ్గు ఒక సంతర్పణ. ఎందుకంటే ముగ్గును బియ్యం పిండితో వేస్తారు. బియ్యం సమృద్ధిగా ఉన్నప్పుడు బియ్యం పిండితో పెద్ద పెద్ద ముగ్గులు వేయడానికి కొదవేముంది? ఆ పిండి ముగ్గు వేస్తే ఆ పిండిని చీమలు, క్రిములు, కీటకాలు ఆరగిస్తాయి. అలా ప్రకృతిని సంతృప్తి పరిచిన ఇంటిని ప్రకృతి కాచుకుంటుంది. శుభం జరుగుతుంది.

ముగ్గు ఆడవాళ్ల సొంతం

భారతీయ సంస్కృతిలో హరప్పా, మొహెంజోదారో కాలం నాటి నుంచే అంటే క్రీ.పూ 2000 కాలం నుంచే ముగ్గులు ఉన్నట్టు ఆధారాలున్నాయి. తమిళనాడులో ముగ్గుకు విశేష ఆదరణ ఉంది. ఉత్తరాదిలో ముగ్గును 'రంగోలి' అంటారు. తెలుగువారి సంస్కృతిలో ముగ్గు ఉందనడానికి సాహిత్య తార్కాణాలున్నాయి. కాకతీయుల గాథను తెలిపే 'క్రీడాభిరామం'లో 'చందంబున గలయంపి చల్లినారు... ముగ్గులిడినారు' అని ఒక పద్యంలో ఉంది. శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్త మాల్యద'లో 'బలువన్నె ముగ్గుబెట్టి' అని ఒక పద్యంలో రాశాడు. అయితే తొలి రోజుల్లో పురుషుల కళగా ఉన్న ముగ్గు క్రమేపి స్త్రీల కళగా మారింది. స్త్రీని ఇంటి పట్టునే ఉంచడం వల్ల, వంటకు, పూజకు, భక్తి గీతాలకు మాత్రమే అనుమతించడం వల్ల, చాలాకాలం ఇతర లలిత కళలకు దూరంగా ఉంచడం వల్ల 'ఎవరి కంట పడకుండా' ఇంటి పట్టున సాధన చేసుకునే ముగ్గు మీద ఎవరికీ అభ్యంతరం లేకపోయింది. దాంతో స్త్రీలు తమ సృజనాత్మకతను ముగ్గుల్లో చూపారు. ముగ్గుల వల్ల కొద్దో గొప్పో లెక్కలు తెలియడం, ధ్యాస నిలవడం, వేసుకున్న ముగ్గును చూసి సంతృప్తి చెందడం ఆడవాళ్లకు వీలయ్యింది. అంతేకాదు తెల్లవారు జామున స్త్రీలు లేచి వీధి మొత్తాన్ని పలకరించుకుంటూ మానవ సంబంధాలు పెంచుకునే వీలు చిక్కింది. కష్టసుఖాలు మాట్లాడుకునే వీలు కూడా. మనం వేసిన ముగ్గున మరుసటి రోజున మనమే చెరిపివేయడంలో ఎప్పటికప్పుడు జీవితాన్ని కొత్తగా మొదలెట్టాలన్న భావన, గతం గతః అనుకునే తాత్త్వికత ఏర్పడతాయి. ఇప్పటి కాలంలో కూడా ముగ్గుల్లో మగవాళ్లకు ప్రవేశం లేకపోవడం గమనార్హం.

రకరకాల ముగ్గులు

ముగ్గుల్లో చాలా రకాలు ఉన్నాయి. వాటి చుక్కలను బట్టి, రూపాలను బట్టి ఆధ్యాత్మిక, ధార్మిక వ్యాఖ్యానాలు ఉంటాయి. తొమ్మిది చుక్కల ముగ్గు నవగ్రహాలకు ప్రతీక అని, చుక్కలు లేకుండా రెండు అడ్డగీతలు గీసి ఖండించుకునే త్రికోణాలతో వేసే ముగ్గు కుండలినికి గుర్తు అని అంటారు. అలాగే పురాణాలను తెలిపే, అవతారాలను సూచించే ముగ్గులు ఉంటాయి. రాను రాను ఈ ముగ్గులు సందేశాత్మకంగా కూడా మారాయి. దేశభక్తిని తెలిపే నాయకుల బొమ్మలు, జాతీయ పతాకాలు ముగ్గుల్లో చేరాయి. ఒక్కోసారి నిరసనలకు, నినాదాలకు కూడా వేదికలయ్యాయి. ముగ్గు ప్రథమ లక్ష్యం పారిశుద్ధత. ఇంటిముంగిలిని శుభ్రం చేసుకుని వేస్తారు కాబట్టి ఆ రోజుల్లో కాని ఈ రోజుల్లోకాని సగం రోగకారకాలు ఇంట్లో రాకుండా ఉంటాయి. అయితే రాను రాను స్త్రీలు బద్ధకించి ఆధునికత పేరుతో స్టిక్కర్ ముగ్గులతో సరి పెట్టడం కనిపిస్తోంది. చిటికెన వేళ్ల మధ్య ముగ్గు ఎంత ధారగా వేయడం వస్తుందో అంత నైపుణ్యం వచ్చినట్టు. ముగ్గు వేయడంలో నైపుణ్యం వస్తే జీవితాన్ని చక్కదిద్దుకోవడంలో కూడా నైపుణ్యం వస్తుంది. సంక్రాంతిని బ్రహ్మాండమైన ముగ్గులతో స్వాగతం చెపుదాం.



కాంతి శారద
శ్రీనివాస్
మెట్టుగూడ,
సికింద్రాబాద్



19 చుక్కలు, 9 వచ్చేవరకు
సంధు చుక్క

ముగ్గు ముచ్చట



కె. చందన శ్రీ అంజని
ఓం శాంతినగర్
కడప



19 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



సి.రాజ్యలక్ష్మి
హైదరాబాద్

18 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు
సరి చుక్క







ఎమ్. ధనలక్ష్మి
కల్లూరిపల్లి,
నెల్లూరు

15 చుక్కలు
1 వచ్చేవరకు
సరి చుక్క



శోభా రాణి
హైదరాబాద్

16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు
చుక్క వదిలి చుక్క



ఇటీవల మానవ అక్రమ రవాణాలో ఆధునికత చోటు చేసుకుంది. సాంకేతిక యుగంలో మనం ఉపయోగించే రకరకాల మాధ్యమాలు ఇందుకు ప్రధాన కారణం అవుతున్నాయి. ఈ నవీన కాలంలో హ్యూమన్ ట్రాఫికింగ్ ఏ విధంగా జరుగుతుందో అవగాహన పెంచుకుంటే, జాగ్రత్త పడటం సులువు అవుతుంది.



ట్రాఫికింగ్ నెట్‌తో జాగ్రత్త!

ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీజ (పేరుమార్చడమైంది) తన తల్లి ఫోన్‌ని ఉపయోగిస్తుండేది. శ్రీజకు తోడబుట్టిన అక్కచెల్లెళ్లు ముగ్గురు ఉన్నారు. తండ్రి మరణించడంతో తల్లి నాలుగిళ్లలో పాచి పని చేస్తూ పిల్లలను పోషిస్తుంది. ఒక రోజు మొత్తం శ్రీజ కనిపించకపోవడంతో కంగారు పడి పోలీసులను సంప్రదించారు. రెండు రోజులు వెతకగా శ్రీజ కలకత్తాలో ఉన్నట్టు తెలిసింది. అపరిచిత వ్యక్తి ప్రేమ పేరుతో ఫోన్ ద్వారా నమ్మబలికి, శ్రీజ ను రప్పించినట్టుగా, అటు నుంచి ఆమెను మరో చోటుకి తరలించే ప్రయత్నం చేసినట్టు గుర్తించి, తిరిగి తీసుకొచ్చి, తల్లికి అప్పజెప్పారు. ఆడపిల్లలు/మహిళలను తప్పుదోవ పట్టించే నేర ప్రక్రియలో ఇంటర్నెట్ ఒక మాధ్యమంగా మారింది.

•••

సామాజిక మాధ్యమాలలో కనిపించిన 'కిడ్నీ కావలెను' అనే ప్రకటన చూసిన రమేష్ (పేరు మార్చడమైనది) అందులో ఇచ్చిన ఫోన్ నెంబర్‌ను సంప్రదించాడు. అవతలి వ్యక్తులు చెప్పిన విషయాలు విని, ఒక కిడ్నీ ఇస్తే తనకు ఆర్థిక బాధలు తొలగిపోతాయని భావించాడు. చెప్పిన చోటికి వెళ్లిన అతను తిరిగి ఇంటికి చేరుకోలేదు.

•••

లైంగిక అత్యాచారం, శ్రమ దోపిడి, శిశువుల అమ్మకాలు, అవయవాలు, వధువుల అక్రమ రవాణాలో ఇప్పటి వరకు ఒక దశలో ఉన్నాయి. ఇప్పుడు ఇంటర్నెట్ ద్వారా ట్రాఫికర్లు సైబర్ స్పేస్‌ను కూడా ఉపయోగించుకుంటున్నారు. దీంతో ఈ సమస్య ప్రభుత్వం, పోలీసులు, న్యాయవ్యవస్థకు పెద్ద సవాల్‌గా నిలిచింది.

- సైబర్ ట్రాఫికింగ్‌లో లైంగిక దోపిడీ ప్రాబల్యం రకరకాల రూపాలను చూపుతుంది. యుఎన్ డాట్ జిఎఫ్‌టి గ్లోబల్ రిపోర్ట్ ప్రకారం సైబర్ ట్రాఫికింగ్‌లో లైంగిక దోపిడీకి, మానవ అక్రమ రవాణా 79 శాతం ఉన్నట్టు గుర్తించింది. బాలికలు 13 శాతం, పురుషులు 12 శాతం, బాలురు 9 శాతం అక్రమ రవాణాకు గురైనట్టు పేర్కొంది.

సైబర్ ఫేక్...

- ట్రాఫికర్లు మహిళలపై హింసకు సోషల్ మీడియా ద్వారా కొత్త మార్గాలను తెరిచారు. నేరస్తులు సోషల్ మీడియా ద్వారా బాధితులను ఆకర్షించడం, మోసగించడం, ట్రాప్ చేయడం ఈ విధానంలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. సామాజిక మాధ్యమాల ద్వారా ముఖ్యంగా అమ్మాయిలను /మహిళలను ట్రాప్ చేయడానికి నేరస్తులు రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. ఫేక్ ఐడీలను సృష్టించి స్కూల్, కాలేజీ యువతుల భావోద్వేగాలపైన తమ ప్రభావం చూపుతుంటారు. ప్రేమ పేరుతో చాటింగ్ చేస్తూ, కానుకల ద్వారా ఆకర్షిస్తూ, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోల ద్వారా బెదిరిస్తూ ఇల్లు దాటేలా చేస్తుంటారు.
- సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో బాధితులను తమకు అనుకూలంగా మార్చడం, నియంత్రించడం వంటివి జరుగుతున్నాయి.
- ఉద్యోగాల పేరుతో యువకులను ఆకర్షించి, వారు సైబర్ నేరాలకు పాల్పడేలా వేధింపులకు లోను చేయడం.
- అద్దె గర్భం (సరోగసీ విధానం) కూడా ఇప్పుడు ఆన్‌లైన్ వేదికగా కొత్త పుంతలు తొక్కుతోంది. నమ్మి వెళ్లిన వాళ్లు కొత్త సమస్యలలో చిక్కుకునే పరిస్థితి ఎదురైంది.
- పోర్నోగ్రఫీ అక్రమ రవాణాకు ప్రతి క్షణం ఆజ్యం పోస్తూనే ఉంది. ఈ విష చట్రంలోకి ప్రపంచ వ్యాప్తంగా 12 నుంచి 14 ఏళ్ల లోపు బాలికలు చేరుతున్నట్టు, ఈ అక్రమ రవాణాకు గురవుతున్నట్టు నివేదికలు తెలుపుతున్నాయి.

డిజిటల్ వేగం

వాడుకలో సౌలభ్యంతో పాటు వేగం ఉండటం వల్ల కూడా నేరస్థులు తమ సామర్థ్యాలను మెరుగుపరచుకుని ఇంటర్నెట్ మాధ్యమాల్లో వాటిని చూపుతున్నారు. దీని వల్ల డిజిటల్ జాడలు కనిపెట్టి, మనవారిని రక్షించడం అనేది పెద్ద ప్రయాసగా మారింది.

అప్రమత్తతే అడ్డుకట్ట

ఇంటర్నెట్ వాడకం వల్ల అపారమైన ప్రయోజనాలు ఉన్నట్టే, సరిహద్దులు దాటి సుదూర దేశాల నుండి మనల్ని మరో మార్గంలో ప్రయాణించేలా చేయడానికి సైబర్ ట్రాఫికర్స్ పొంచి ఉన్నారు. అందుకే, సోషల్ మీడియా వాడకంలో తల్లిదండ్రులు ఎప్పుడూ తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి. స్కూళ్లు, కాలేజీలు ఇంటర్నెట్ వాడకం ద్వారా జరిగే నష్టాలు, మానవ అక్రమ రవాణాకు జరుగుతున్న ప్రయత్నాల గురించి అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది.

డార్క్ టీమ్స్ ఉంటాయి జాగ్రత్త

సైబర్ ఎనేబుల్డ్ హ్యూమన్ ట్రాఫికింగ్ అనేది ఈ మధ్య కొత్త పదం వచ్చింది. మన దేశం నుంచి విదేశాలకు మంచి ఉద్యోగం ఇప్పిస్తామని తీసుకెళ్లి, సైబర్ క్రైమ్ చేయిస్తుంటారు. విదేశాలకు వెళ్లాలనే కోరిక అధికంగా ఉన్నవారిని గుర్తించి ఈ విధానానికి ఎంచుకుంటారు. తాము చెప్పినట్టుగా ఒప్పుకోనివారిని వేధిస్తారు. లేదంటే, వారి ఆర్థిక స్థితిని బట్టి డబ్బు వసూలు చేసి, వదిలేస్తారు. ఆ తర్వాత సైబర్ ట్రాఫికింగ్‌లో ఆర్గాన్ ట్రేడింగ్, సరోగసి కూడా ప్రధానంగా ఉన్నాయి. నేరస్థులు సైబర్ డార్క్ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తారు. వీరి ద్వారా అమాయకులను ట్రాప్ చేసి, అక్రమ రవాణాకు పాల్పడుతుంటారు. అందుకని అపరిచితులతో పరిచయాలను పెంచుకోవద్దు. ఒంటరి మహిళలను ట్రాప్ చేయడానికి సైబర్ నేరగాళ్లు ఎప్పుడూ శోధిస్తూనే ఉంటారు. మన వివరాలను ఆన్‌లైన్‌లో బహిరంగ పరచకూడదు. ఆన్‌లైన్ అగ్రిమెంట్ లాంటివి చేయకూడదు. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే ప్రకటనలు చూసి మోసపోకూడదు.



– అనీల్ రాచమల్ల,
సైబర్ నిపుణులు, ఎండ్ నౌ ఫౌండేషన్

స్ఫూర్తి

బాధ కాదు బాట చూడాలి

బెంగళూరుకు చెందిన వీణా అంబరీష బస్సు ప్రమాదంలో కుడి కాలిని కోల్పోయింది. ఆ తరువాత డిప్రెషన్ బారిన పడింది. ఆ చీకటి నుంచి అతి కష్టం మీద బయటపడి అర్ధంతరంగా ఆగిపోయిన చదువును కొనసాగించింది. ఆ తరువాత ఎంబీఏ చేసింది.'కరీ దోశ' పేరుతో ఫుడ్ స్టాల్ ప్రారంభించి తన కాళ్ల మీద తాను నిలబడుతూ ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది వీణా అంబరీష.



కొన్ని సంవత్సరాల క్రితం..

భరతనాట్యం డ్యాన్సర్ అయిన వీణ తన ఆరంగేట్రం కోసం సన్నాహాలు చేసుకుంటోంది. కాలేజీకి వెళ్లడానికి రోడ్డు దాటుతున్నప్పుడు బస్సు ఢీకొట్టడంతో ప్రమాదానికి గురై కుడికాలు కోల్పోయింది.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయిన తరువాత వాకింగ్ స్టిక్‌తో నడవడం మొదలు పెట్టింది. చాలా కష్టంగా అనిపించేది.

భరతనాట్య కళాకారిణిగా పేరు తెచ్చుకోవాలని ఎన్నో కలలు కన్న వీణ తనకు జరిగిన ప్రమాదాన్ని జీర్ణించుకోలేపోయింది. కలల రెక్కలు విరిగిన బాధ ఆమె కళ్లలో కన్నీరై కనిపించేది.

'నాకు ఇలా జరిగిందేమిటి!' అని ఒకటికి పది సార్లు అనుకోవడం వల్ల వీణ పరిస్థితి ఎక్కడి దాకా వెళ్లిందంటే...'ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో దారి లేదు' అని బలంగా అనుకునేంతగా. అయితే వీణ తన నిర్ణయం మార్చుకోవడానికి ఒక దృశ్యం కారణం అయింది. ఆ దృశ్యం తనకు వేకప్-కాల్‌గా పనిచేసింది.

ఫిజికల్ డిజేబిలిటీ సర్టిఫికెట్ తీసుకోవడానికి విక్టోరియా హాస్పిటల్‌కు వెళ్లిన వీణ అక్కడ ఒక మహిళను చూసింది. ఆమెకు రెండు కాళ్లు లేవు. ఆమె తన బిడ్డను లాలిస్తూ బువ్వ తినిపిస్తోంది. ఒక క్షణం ఆమె ముఖం వైపు చూసింది వీణ. రవ్వంత బాధ కూడా ఆమె ముఖంలో కనిపించలేదు. జీవనోత్సాహంతో ఆ ముఖం వెలిగిపోతోంది.

తాను ఏవైతే పెద్ద సమస్యలు అనుకుంటుందో అవి గాలిలో దూదిపింజల్లా ఎగిరిపోయాయి.

ఈ ఒక్క దృశ్యం వీణ ఆలోచనలో పూర్తిగా మార్పు తీసుకువచ్చింది.

'ఏదో సాధించాలి' అనే ఉత్సాహం మనసులోకి వచ్చింది. ఆగిపోయిన చదువును కొనసాగించింది. మంచి మార్కులతో పరీక్షలు పాసైంది. ఆ తరువాత ఎంబీఏ పూర్తి చేసింది. బ్యాంకులలో సేల్స్ ఆఫీసర్‌గా, ఐటీ పరిశ్రమలో సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేసింది. ఒకవైపు గంటల కొద్దీ చేసే ఉద్యోగం... మరోవైపు పిల్లల ఆలనా పాలనా కష్టమనిపించింది. ఒక సౌత్ అమెరికన్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు ఎడతెగకుండా జరిగే మీటింగ్‌లు, పనిభారం వల్ల కాలికి ఇన్‌ఫెక్షన్ వచ్చి హాస్పిటల్‌లో పదిహేను రోజులు ఉండాల్సి వచ్చింది. ఈ సమయంలోనే సొంతంగా ఏదైనా చేయాలని నిర్ణయించుకుంది వీణ. దానికి ఫిట్‌నెస్ ట్రెయినర్ అయిన ఆమె భర్త ప్రోత్సాహం తోడైంది.

గత సంవత్సరం బెంగళూరులో 'కరీ దోశ' పేరుతో దోశ స్టాల్ మొదలు పెట్టినప్పుడు 'ఎంబీఏ చదివి ఇదేమిటీ' అన్నట్లుగా మాట్లాడారు కొద్దిమంది. వారి మాటలేవీ పట్టించుకోలేదు వీణ. ప్రత్యేకత ఉంటేనే ఫుడ్ స్టాల్ అయినా పెద్ద వ్యాపారమైనా విజయం సాధిస్తుంది. మరి 'కరీ దోశ' స్పెషల్ ఏమిటి? కరీ దోశే!

తమిళనాడులోని మధురై ప్రాంతంలో 'కరీ దోశ'గా పిలిచే వేడి వేడి దోశ దానిపై ఆమ్లెట్, మటన్ కీమా చాలా ఫేమస్. కరీ దోశ బెంగళూరులో కూడా హిట్ అయింది. ఈ దోశ కోసం కస్టమర్‌లు పొద్దున్నే లైన్ కడతారు.

స్టాల్ ప్రారంభించడానికి ముందు 'కరీ దోశ' రుచులలో ప్రావీణ్యం సంపాదించడానికి రెండు నెలల పాటు ఇంట్లోనే ఉంది వీణ. వంటగది తన పాఠశాలగా, ప్రయోగశాలగా మారింది.

'కరీ దోశ' స్టాల్ పొద్దున ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండు వరకు అందుబాటులో ఉంటుంది. ఇక మిగిలిన సమయమంతా ఇంట్లోనే పిల్లలతో గడుపుతుంది వీణ.

చిరునవ్వే సందేశం

బాధ లేనిది ఎవరికి? బాధ పడుతూ కూర్చోవడం కంటే దాని నుంచి బయటపడడానికి కొత్తబాట వెదకాలి. మనకంటే ఎక్కువ బాధలు పడుతున్న వారు, పెద్ద పెద్ద సమస్యల్లో ఉన్న వారు ఎంతోమంది మన చుట్టుపక్కలే ఉన్నారు. అంత కష్టంలోనూ వారి పెదవి మీద కనిపించే చిరునవ్వు మనకు సందేశాన్ని ఇచ్చి ముందుకు నడిపిస్తుంది.

– వీణా అంబరీష





చచ్చిపోయేదాకా ఉన్నదంతా జీవితమే.
– మిగెల్ డె సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 11 జనవరి 2024

భూగోళం భగ్గుమంటోంది!

మరో శాస్త్రీయ నివేదిక బయటకొచ్చింది. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని మళ్ళీ గుర్తు చేసింది. గత 150 ఏళ్ళలో ఎన్నడూ లేనంత అధిక ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరం 2023 అని తేలిపోయింది. ఆ మధ్య వెలువడ్డ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాత్కాలిక నివేదికతో పాటు తాజాగా మంగళవారం ఐరోపా యూనియన్‌కు చెందిన వాతావరణ పర్యవేక్షక సంస్థ 'కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్' (సీసీసీఎస్) సైతం ఆ సంగతి నిర్ధారణ చేసింది. ఒకప్పుడు 2016 'భుగభుగల నామ సంవత్సరం'గా రికార్డ్ సృష్టిస్తే, తాపంలో అంతకన్నా గణనీయమైన తేడాతో ఆ అపకీర్తి కిరీటాన్ని ఇప్పుడు 2023 దక్కించుకుంది. భూవిజ్ఞాన సాక్ష్యాధారాలు, ఉపగ్రహ సమాచారాలను క్రోడీకరించి చూస్తే, దాదాపు లక్ష సంవత్సరాల్లో అధిక వేడిమి గల ఏడాది ఇదేనట. ఇది పెనునిద్దుర వదిలించే మాట. యథేచ్ఛగా సాగుతున్న గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల వల్ల భూతాపం ఇంతగా పెరిగిందని శాస్త్రవేత్తలకు తెలుసు. ఈ ధోరణి ఇలాగే కొనసాగనుందా? రానున్న సంవత్సరాల్లో భూగోళం అంతకంతకూ వేడెక్కనుందా? పాత రికార్డ్‌లు తుడిచిపెట్టుకు పోనున్నాయా అన్నది ప్రశ్న. 2024 సైతం అత్యధిక భూతాప వత్సరం కావచ్చన్న అంచనాలు పారా హుషార్ అంటున్నాయి.

పారిశ్రామికీకరణ ముందు నాటితో పోలిస్తే 2 డిగ్రీల సెల్సియస్‌కు మించి ప్రపంచ ఉష్ణోగ్రత పెరగకుండా చూసుకోవాలన్నది లక్ష్యం. ఎనిమిదేళ్ళ క్రితం ప్యారిస్‌లో జరిగిన 'కాప్–21'లో ఈ మేరకు ప్రపంచ దేశాలు ప్రతిన బూనాయి. వీలుంటే 1.5 డిగ్రీల సెల్సియస్ లోపలే ఉండేలా శ్రమించాలనీ తీర్మానించాయి. ప్యారిస్ ఒప్పందం తర్వాత వరుసగా పెరుగుతున్న వాతావరణ విపరిణామ ఘటనలు ప్రపంచాన్ని అప్రమత్తం చేశాయి. ఫలితంగా పర్యావరణ మార్పుకు సంబంధించి ఈ 1.5 డిగ్రీల సెల్సియస్ అనే హద్దు అలిఖిత శాసనమైంది. అయితే, ఇప్పుడు ఆ హద్దును దాటిపోయే పరిస్థితి వచ్చింది. గడచిన 2023లో భూగోళం భుగభుగలాడింది. ఉష్ణోగ్రతలో పెంపు ప్రమాదకర స్థాయికి చేరింది. ప్రతి రోజూ 1850 – 1900 మధ్య కాలం కన్నా కనీసం ఒక డిగ్రీ అధిక తాపం ఉంది. గత జూన్‌లో మొదలై డిసెంబర్ దాకా ప్రతి నెలా గరిష్ఠ వేడిమి మాసంగా రికార్డవుతూ వచ్చాయి. ఏడాదిలో సగం రోజులు ఎప్పటికన్నా 1.5 డిగ్రీలు ఎక్కువ వేడి ఉన్నాయి. నవంబర్‌లో రెండు రోజులైతే ఏకంగా 2 డిగ్రీల చెలియలికట్టను దాటేశాయి. భూతాపం లెక్కలు రికార్డ్ చేయడం మొదలుపెట్టాక గత 150 ఏళ్ళలో ఎన్నడూ లేనంత వేడిమి గల వత్సరంగా 2023 రికార్డుకెక్కింది.

గతంలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డయిన ఏడాది 2016. సగటున 0.17 డిగ్రీల హెచ్చు ఉష్ణోగ్రతతో 2023 ఆ రికార్డును తిరగరాసింది. ఈ సంగతి ఆందోళన కలిగిస్తుంటే, ఇంత కన్నా భయపెడుతున్న విషయం ఉంది. వచ్చే 12 నెలల్లో భూగోళం 1.5 డిగ్రీల మార్కును సైతం దాటేసే ప్రమాదం ఉందట. సీసీసీఎస్ శాస్త్రవేత్తలే ఆ మాటన్నారు. అంటే ఈ 2024 మరింత వేడిమితో ఉడుకెత్తించనుందన్న మాట. ఒక పక్క రికార్డు స్థాయిలో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు, మరోపక్క సహజ వాతావరణ పరిణామమైన ఎల్ నినో... ఈ రెండూ భూగోళంపై ఉష్ణోగ్రతలు ఇంతగా పెరగడానికి ప్రాథమిక కారణమని శాస్త్రవేత్తల మాట. ఈ అధిక ఉష్ణోగ్రతల దెబ్బతో వడగాడ్పులు, వరదలు, కార్చిచ్చులు చెలరేగుతున్నాయి. విశ్వవ్యాప్తంగా ప్రాణికోటి ఆయువు తీస్తున్నాయి. జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. అమెరికా, ఐరోపాలలో ఆ మధ్య చెలరేగిన వేడిగాలుల లాంటి వాతావరణ విపరిణామాలు సైతం మానవ తప్పిదాలతో పెరిగిన భూతాపంతోనే సంభవించాయి.

డబ్ల్యూఎంఓ, సీసీసీఎస్‌లే కాదు... వందలాది శాస్త్రీయ అధ్యయనాలూ ప్రమాదాన్ని అద్దంలో చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన మరో వాతావరణ సంస్థ విడిగా చేసిన మరో విశ్లేషణ ఫలితాలూ ఇలానే ఉన్నాయి. డిగ్రీలో పదో వంతు మేర భూతాపం పెరిగినా... వడగాడ్పులు, తుపానులు తీవ్రమవుతాయి. సముద్రమట్టాలు పెరుగుతాయి. హిమానీనదాలు త్వరగా కరిగి నీరవుతాయి. ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా మనం నిరుడు చూసినవే. భూతాపంతో ఇరాన్, చైనా, గ్రీస్, స్పెయిన్, టెక్సాస్, అమెరికా దక్షిణ ప్రాంతాలు ఉడికిపోయాయి. కెనడాలో విధ్వంసకరమైన కార్చిచ్చు చెలరేగింది. సముద్ర ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేనంత పెరిగి, సముద్ర వడగాడ్పులు వీచాయి. వేసవిలోనూ, శీతకాలంలోనూ అంటార్కిటికా సముద్ర తీరాల వెంట హిమ ఘనీభవనం చాలా తక్కువైంది. రికార్డు స్థాయిలో పడిపోయింది. ఇవన్నీ ప్రకృతి మోగిస్తున్న ప్రమాద ఘంటికలని గ్రహించాలి.

పెరుగుతున్న భూతాపాన్ని నివారించడానికి ఇకనైనా చిత్తశుద్ధితో సంకల్పించాలి. విపరీత ఘటనల్ని నివారించాలంటే, అత్యవసరంగా ఆర్థిక వ్యవస్థను కర్బన రహిత దిశగా నడిపించాలి. పర్యావరణ సమాచారాన్నీ, జ్ఞానాన్నీ ఆసరాగా చేసుకొని భవిష్యత్తు వైపు అడుగులేయాలి. భూగోళంపై జీవకోటి ప్రాణాధార వ్యవస్థలు అమితంగా దెబ్బతిన్నాయనీ, ఇప్పటికే సురక్షిత వలయం బయట మానవాళి గడుపుతోందనీ శాస్త్రవేత్తలు ఇటీవల వెల్లడించారు. భూతాపం, వాతావరణ మార్పులు హద్దు మీరితే పరిస్థితి ఎలా ఉంటుందన్నది 2023 రుచి చూపింది. ఇకనైనా ప్రపంచ దేశాలు తమ నిర్లక్ష్యాన్ని వీడి, వాతావరణ మార్పులపై కార్యాచరణకు దిగాలి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడంలో మీనమేషాలు లెక్కించడం మానవాళికి శ్రేయస్కరం కాదు. అగ్రరాజ్యాలు సహా అన్నీ ఆ పనికి దిగాలి. వీలైనంత త్వరగా నెట్ జీరో స్థాయి చేరి, జీవనయోగ్యమైన వాతావరణాన్ని పరిరక్షించుకోవాలి. మన జీవితంలో రాబోయే వత్సరాలన్నీ ఇంతకింత భూతాపంతో ఉంటాయనే భయాలూ లేకపోలేదు. అదే నిజమై, వాటితో పోలిస్తే గడచిన 2023వ సంవత్సరమే చల్లగా ఉందని భావించాల్సిన పరిస్థితి వస్తే, అది ఘోరం. చేతులారా చేస్తున్న పాపానికి ఫలితం!

గ్రహం అనుగ్రహం


శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: అమావాస్య సా.6.18 వరకు, తదుపరి పుష్య శుద్ధ పాడ్యమి, నక్షత్రం: పూర్వాషాఢ సా.6.53 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: తె.2.31 నుండి 3.59 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం: ఉ.10.16 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.33 వరకు, అమృత ఘడియలు: ప.2.11 నుండి 3.43 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మణిపూర్ హింసకు పరిష్కార మార్గం

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో నూతన సంవత్సర ప్రారంభంలోనే తిరిగి హింసాకాండ చెలరేగింది. రెండు వైపులా భారీగా సాయుధ మిలిటెంట్ల ఉనికి ఉండటంతో సమూహాల మధ్య విశ్వాసం పాదుకోవడం కష్టమవుతోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అక్కడి ప్రధాన తెగలైన మైతేయిలు, కుకీలు, నాగాల మధ్య సంబంధాలు సంఘర్షణ, ఉద్రిక్తతలు, అపార్థాలతో నిండి ఉన్నప్పటికీ... వారు కలిసి జీవించారు. పరస్పర వివాహాలు చేసుకున్నారు. నెల్సన్ మండేలా నేతృత్వంలో దక్షిణాఫ్రికాలో సయోధ్యకు చేపట్టిన చర్యలే... మణిపూర్ ప్రజల మధ్య శాంతిని నెలకొల్పడానికి పరిష్కార మార్గం. ముందుగా మణిపూర్ కొండలు, లోయలలో కాల్పుల శబ్దాలు ఆగవలసి ఉంటుంది. ఈ పని బహుశా కేంద్ర బలగాలు మాత్రమే చేయగలవు.

విశ్లేషణ



జయంత రాయ్ చౌధురీ

కొత్త సంవత్సరం ప్రారంభంలోనే సుందరమైన ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో తాజా దశ హింసాకాండ చెలరేగింది. మొదటి దశలో నమోదైన జాతిపరమైన ఉన్మాదం, ఇప్పుడు సాయుధ సమూహాల మధ్య క్రూరమైన పాశ్చాత్య తరహా తుపాకీ కాల్పుల స్థాయికి దిగజారింది. మొదటి కొన్ని నెలల హింస ఫలితంగా అక్కడ కనిపించని జాతిపరమైన సరిహద్దులు ఏర్పడ్డాయి. మైతేయిలు ఎల్లప్పుడూ ఆధిపత్యం వహించే ఇంఫాల్ లోయ నుండి కుకీలు, జోలు, ఇతర గిరిజనులు నిష్క్రమించారు. గిరిజనుల ఆధ్వర్యంలో నడిచే కొండ జిల్లాలను మైతేయిలు ఖాళీ చేశారు. 1947లో పంజాబ్‌లో మతపరమైన ఉద్రిక్తతలతో జరిగిన నిర్మూలనా కాండను ఇది తలపిస్తోంది.

అస్సాం రైఫిల్స్, ఆర్మీ రెజిమెంట్లు మైతేయి ప్రాంతాలు, కుకీలు, పైతీలు వంటి ఇతర గిరిజనులు నివసించే ప్రాంతాలకు మధ్య తటస్థ జోన్‌లను సృష్టించాయి. దీనివల్ల తమ ఆధిపత్య ప్రాంతాన్ని విస్తరించడానికి కొన్ని సమయాల్లో ఏదో ఒక వర్గం చేసే ప్రయత్నాల వల్ల అస్థిరమైన శాంతి కొనసాగుతోంది. కాంగ్లీపాక్ తిరుగుబాటు వర్గాలకు చెందిన విస్తృతమైన నెట్‌వర్క్ ఒకప్పుడు ఇంఫాల్ లోయను పీడించింది. గత రెండు దశాబ్దాల కాలంలో దాన్ని అణచిపెట్టారు. అది ఇప్పుడు పునరుజ్జీవితమైందనీ, రాష్ట్ర పోలీసు దళం నుండి 'దోచుకున్న' ఆయుధాలతో కొందరు సాయుధులయ్యారనీ తెలుస్తోంది. లొంగిపోయి, అస్సాం రైఫిల్స్ నిఘా కళ్ళ నీడన, శిబిరాల్లో నివసిస్తున్న కొంతమంది కుకీ మిలిటెంట్లు కూడా ఇదే విధమైన కక్షతో తప్పించుకుని ఉండవచ్చు. కొండ జిల్లాల్లోని సాయుధ గ్రామ అప్రమత్త కమిటీలలో చేరి ఉండవచ్చు కూడా.

యుద్ధంలో యుద్ధం

సమూహాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో రాష్ట్రంలో 'యుద్ధంలో యుద్ధం' జరుగుతున్న పరిస్థితులు కనబడుతున్నాయి. అదే సమయంలో సాధారణ శాంతిభద్రతలను సద్వినియోగం చేసుకుంటూ దోపిడీ, తుపాకుల సేకరణ, మాదక ద్రవ్యాల వ్యాపారంలో కూడా మునిగిపోతున్నారు. చారిత్రకంగా ఇది వారికి అలవాటైన విద్యే. వీటి సాయంతోనే సాధారణ ప్రజలను లూటీ చేసేవారు. మణిపూర్‌లోని చిన్న మైతేయి ముస్లిం సమాజమైన పంగల్‌లను మైతేయి మిలిటెంట్ గ్రూప్ లక్ష్యం చేసుకోవడం పరిస్థితుల పతనానికి పరాకాష్ఠగా కనబడుతోంది.

అయితే, జాతుల మధ్య సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు శాంతి కమిటీల ద్వారా జరుగుతున్నాయి. అయినప్పటికీ, రెండు వైపులా భారీగా సాయుధ మిలిటెంట్ల ఉనికి ఉండటంతో విశ్వాసం పాదుకోవడం కష్టమవుతోంది. హింసను, సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగ అసమర్థత ఇప్పటికే కనీసం 180 మంది ప్రాణాలను బలిగొంది. దాదాపు 40,000 మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో కొందరు ఇతర రాష్ట్రాలలో ఆశ్రయం పొందారు. మయన్మార్ నుండి కుకీలు వెల్లువలా వచ్చి చేరడం, ఆ పొరుగు దేశంలో సంఘర్షణ ఫలితంగా ప్రవేశిస్తున్న శరణార్థులు కూడా మైతేయిల్లో అభద్రతా భావాన్ని పెంచాయి. కుకీ నేషనల్ ఆర్గనైజేషన్, కుకీ నేషనల్ ఆర్మీ (బర్మా) తమ ఏకైక పోరాటం మయన్మార్ రాజ్యానికి వ్యతిరేకంగానేననీ, మణిపూర్‌లో తాము ఎటువంటి కాల్పులకు పాల్పడలేదనీ పదేపదే ప్రకటనలు జారీ చేస్తూ వచ్చాయి. అయినా వారి సిబ్బందిలో కొందరు స్వతంత్ర పద్ధతిలో వ్యవహరించడాన్ని తోసిపుచ్చలేము.



కుకీ కొండ ప్రాంతాలలో దాదాపు పూర్తిగా మైతేయిలకు చెందిన రాష్ట్ర పోలీసు కమాండోలను ఉంచడాన్ని మణిపూర్ ప్రభుత్వం బలపరుస్తున్నందుకు చాలామంది అసంతృప్తిగా ఉన్నారు. భారతీయ శిక్షా స్మృతిలోని వివిధ సెక్షన్‌లను, అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించినందుకుగాను స్థానిక వార్తాపత్రికలకు చెందిన ఇద్దరు సంపాదకులను అరెస్టు చేయడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ దశలోనే హింసాకాండ జరిగింది. తరచుగా ఇంటర్నెట్ నిషేధాలు, ఇతర అవరోధాల కారణంగా రిపోర్టింగ్ తీవ్రంగా నిరోధించబడిన రాష్ట్రంలో, తాజా అరెస్టులు ఏమాత్రం మంచివి కావు.

సంఘర్షణ – స్నేహ చరిత్ర

మణిపూర్‌లో సంఘర్షణలతో పాటు వర్గాల మధ్య స్నేహానికి కూడా సుదీర్ఘ చరిత్రే ఉంది. రాజులు ఇంఫాల్ లోయను పాలించినప్పుడు, నాగాలు, కుకీలు, ఇతర గిరిజనులు నివసించే కొండలపై వారి పట్టు చాలా తక్కువగా ఉండేది. గిరిజనులు కొండలను 'సొంతం' చేసుకున్నారు, తమ సొంత ఆచారాల ప్రకారం వారి జీవితాలను గడిపారు. రాజులు కూడా దానిని అంగీకరించారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మణిపూర్‌లోని మూడు ప్రధాన కమ్యూనిటీలైన మైతేయిలు, కుకీలు, నాగాల మధ్య సంబంధాలు కూడా సంఘర్షణ, ఉద్రిక్తతలు, అపార్థాలతో నిండి ఉన్నప్పటికీ, వారు కలిసి జీవించారు. పరస్పర వివాహాలు కూడా చేసుకున్నారు. తద్వారా సయోధ్యకు, శాంతికి అవకాశం ఏర్పడింది. 1944లో మూడు వర్గాలకు చెందిన యువకులు సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. అది బర్మా నుండి భారతదేశంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించింది. ఆజాద్ హింద్ ఫౌజ్ వెనుకంజ వేయడంతో చాలామంది తిరిగి రంగూన్‌కు వెళ్లారు. స్వాతంత్ర్యం కోసం యుద్ధంలో స్వచ్ఛందంగా పాల్గొన్న వారిలో మణిపూర్ మొదటి ముఖ్యమంత్రి కూడా ఉన్నారు.

పరిష్కారమేంటి?

క్రైస్తవ మిషనరీలు కొండలపైకి తీసుకువచ్చిన విద్య మణిపూర్ గిరిజనుల సాధారణ శ్రేయస్సు స్థాయిని పెంచింది. షెడ్యూల్డ్ తెగలుగా వారికి రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. మరోవైపు, రాష్ట్రంలోనే అత్యుత్తమ సాగు భూమి ఇంఫాల్ లోయలో ఉంది. ఇది చారిత్రకంగా మైతేయిలు ఆధిపత్యం చలాయించిన ప్రాంతం. గిరిజనులు తొమ్మిది రెట్లు ఎక్కువ భూమిని కలిగి ఉన్న కొండ ప్రాంతాలలో ఉన్నారు. కానీ వీటిలో సాగు యోగ్యమైనవి తక్కువ.

జనాభాలో 53 శాతం ఉన్న మైతేయిలు వ్యవసాయం, పరిశ్రమల్లో ముందంజలో ఉన్నారు. 2022లో ఎన్నికైన బీజేపీ నేతృత్వంలోని మణిపూర్ ప్రభుత్వం, కుకీ–జో ప్రజలు సాంప్రదాయ గిరిజన భూములుగా పిలిచే వాటిని రిజర్వ్‌డ్ ఫారెస్టులుగా చెబుతూ వారిని ఖాళీ చేయించే ప్రయత్నాలు చేసింది. అలా ఉద్రిక్తతకు అవకాశం ఏర్పడింది. ఇక, గతేడాది మే ప్రారంభంలో మెజారిటీగా ఉన్న మైతేయిలకు షెడ్యూల్డ్ తెగ హోదాను కల్పించే చర్యకు పూనుకున్నారు. దానికి వ్యతిరేకంగా గిరిజన సమూహాలు చేసిన ప్రదర్శనల ద్వారా హింసకు నాంది పడింది. అయితే, ఈ చర్యలను ప్రభుత్వం విరమించుకుంది.

కుకీ–జో ప్రజలు మయన్మార్ నుండి తమ బంధువులను తీసుకువస్తున్నారనీ, రాష్ట్రాన్ని ముంచెత్తడం ద్వారా రాష్ట్ర జనాభా నిష్పత్తుల రీతిని మార్చుతున్నారనీ మైతేయిల ఆందోళన. మాదక ద్రవ్యాలు, తుపాకీల సేకరణతో మాదక ద్రవ్యాల వ్యాపారానికి గేట్లు ఎత్తారనీ వీరి ఆరోపణ. (వాస్తవానికి ఇరు వర్గాలకు చెందిన సాయుధ మిలిటెంట్లు ఈ లాభదాయక 'వ్యాపారం'లో పాల్గొంటున్నారు.)

నెల్సన్ మండేలా నేతృత్వంలో దక్షిణాఫ్రికాలో సయోధ్యకు చేపట్టిన చర్యలే... మణిపూర్ ప్రజల మధ్య శాంతిని నెలకొల్పడానికి పరిష్కార మార్గం. కాకపోతే దానికి మణిపూర్ కొండలు, లోయలలో కాల్పులు నిశ్శబ్దం కావలసి ఉంటుంది. రాష్ట్ర పోలీసులు పక్షపాతాన్ని ప్రదర్శిస్తున్నారని చాలామంది ఆరోపిస్తున్నారు కాబట్టి, ఈ పని బహుశా కేంద్ర బలగాలు మాత్రమే చేయగలవు.

వ్యాసకర్త 'పీటీఐ' వార్తాసంస్థకు ఈశాన్య ప్రాంత మాజీ హెడ్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఇదో నిర్భరత!



మీకు బాగా డబ్బులుండి, మిమ్మల్ని తెలిసినవాళ్లుంటే మీకు రక్షణ శాఖ కాంట్రాక్టులు వస్తాయి. అప్పుడు విదేశాల్లో నుంచి తెచ్చిన విడిభాగాలను ఇండియాలో క్రోడీకరించినా సరే... వాటిని 'ఆత్మనిర్భర్ భారత్' కింద ఆవిష్కరించడానికి సైన్యంలో పెద్దస్థాయి మనిషి వస్తాడు.

– యూసుఫ్ ఉంఝావాలా, జర్నలిస్ట్

మాల్ అంటే ఇవేనా?



గురుగ్రామ్‌లోని ఈ కొత్త మాల్ బయట నాకు ఏమనిపించిందంటే – మనం చెత్త తినకపోతే, మనకు సెల్ఫ్ హెల్ప్ బుక్స్ అక్కర్లేకపోతే, అడ్వర్‌టైజ్‌మెంట్లలో కనబడే బట్టలు మనం ధరించకపోతే, మనకు ఇప్పటికే ఇంటి కర్టెన్లు ఉంటే... ఇంత పెద్ద మాల్‌లో కూడా మనకు ఏమీ లేవని!

– మనూ జోసెఫ్, రచయిత

అదే రుద్దుడైతే...



థియేటర్లలో హిందీ సినిమాలను ప్రదర్శిస్తూ, వాటికి సబ్‌టైటిల్స్ వేయకపోతే కూడా దాన్ని హిందీ భాషను రుద్దడం అంటారా? తమిళనాడులో ఈ విషయంలో మరీ ఎక్కువ చేస్తున్నారు.

– సుమంత్ రామన్, యాంకర్

కొత్త ఉత్సాహం



కొత్తవాళ్లను తీసుకోవడం, శిక్షణలతో ఇండియా ఇమ్మిగ్రేషన్ సేవలు ఉల్లాసంగా మారాయా? యూనిఫామ్‌లో ఉన్న చురుకైన యువ అధికారులతో ఢిల్లీ విమానాశ్రయంలో మంచి అనుభవం ఎదురైంది. కీబోర్డు కూడా వాడటం తెలియని పాత చచ్చు సరుకు కంటే వీళ్లు చాలా మెరుగు.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

గాంధర్వుడికి శుభాకాంక్షలు



మన ప్రియతమ గాంధర్వ గాయకుడు డాక్టర్ కె.జె. యేసుదాస్ 'దాసేట్టన్'కు జన్మదిన (జనవరి 10) శుభాకాంక్షలు. గాయకులందరికీ మీరు నిజమైన ప్రేరణ, మార్గదర్శకులు. భగవంతుడు మిమ్మల్ని సదా ఆరోగ్యంగా ఉంచుతూ, మీ సంగీత ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉండుగాక!

– కె.ఎస్. చిత్ర, గాయని

ఎలాంటి తల్లి?



మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉన్న ఏ తల్లీ తన సొంత చిన్నారిని చంపదు. అందుకే విడాకుల కేసుల్లో పిల్లల కస్టడీని అప్పగించే ముందు కోర్టులు జాగ్రత్తగా వ్యవహరించాలి. పిల్లల్ని పెంచగలరో, లేదో పరిశీలించేందుకు సైకియాట్రిస్ట్‌ను సంప్రదించాలి. మనకు కనబడేది కేవలం ఉపరితలం మాత్రమే అనడానికి సుచనా సేత్ ఒక మంచి ఉదాహరణ. (తన నాలుగేళ్ల కుమారుడిని చంపినట్టు బెంగళూరుకు చెందిన ఒక స్టార్టప్ సీఈఓ సుచనా సేత్ మీద కేసు నమోదైన నేపథ్యంలో)

– మీరా చోప్రా, నటి

ఇదే తెలియకపోతే...



రక్షణ మంత్రికి ప్రోస్టేట్ క్యాన్సర్ ఉందనీ, దానికి డిసెంబర్‌లో సర్జరీ జరిగిందనీ నిన్నటిదాకా బైడెన్‌కు తెలియదంటే– 81 ఏళ్ల ఈ (అమెరికా) అధ్యక్షుడి ఆరోగ్యమే ప్రశ్నార్థకంగా ఉందనీ, తన పరిపాలనా వ్యవహారాల మీద పూర్తి నియంత్రణ లేదనీ సంకేతం.

– బ్రహ్మ చెల్లానీ
వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ఇన్ బాక్స్

యుద్ధ గాయాలు



చినుకు పడితే చాలు
చిగురించే ఈ నేల పైన
ఊపిరి తీసుకుంటున్న
నా దేహానికీ ఆత్మకూ
ఎలాంటి గాయం తగలకుండా
కాలం గడిస్తే బాగుండు

కానీ
ప్రపంచ దేశాల మధ్య జాతుల మధ్య
ఆధిపత్యం కోసం పెల్లుబికిన
'యుద్ధం'
ఏం చేస్తుంది
హింస అరుపులు ఆర్తనాదాలు
......
'యుద్ధం'
ఏం మిగులుస్తుంది
శవాల దిబ్బలు బూడిద కుప్పలు

శవాలు ఎప్పటికీ మేల్కొనవు
బూడిదలో ఏ విత్తనమూ మొలకెత్తదు

రక్తమోడిన దేహ గాయాలకు
నా దగ్గరేదో మందుంది

కానీ
ఆత్మకు తగిలిన గాయాలకు
మలామ్ ఎవడు పూస్తాడు
అవి
మానేదెప్పుడు.. మాన్పేదెవడు?

– వారాల ఆనంద్
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత ı 94405 01281

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అసలు... ఆ రాత్రి ఏం జరిగింది?

సందర్భం




జిల్లా గోవర్ధన్

భారత ద్వితీయ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయి. అది హత్యా? సహజ మరణమా? లేక ఇన్‌సైడర్ (లోపలి వ్యక్తి) పనా? అయిదు దశాబ్దాలు గడిచినా, ఏ ఇన్వెస్టిగేషన్, ఏ ఎంక్వైరీ కమిషన్‌కు నోచుకోకుండానే ఆయన మరణం దేశ చరిత్ర పుటల్లో మిస్టరీగానే మిగిలిపోయింది!

1965 భారత్–పాక్ యుద్ధానంతరం, 1966 జనవరి 4న రష్యాలోని తాష్కెంట్‌లో ప్రారంభమైన ఇరు దేశాల చర్చలు జనవరి 10 రాత్రి 'నోవార్ ప్యాక్ట్' అగ్రిమెంటుతో ముగిశాయి. ఆ తర్వాత తనకు ఏర్పాటు చేసిన 'డాచా' (గెస్ట్ హౌజ్ విల్లా)లోని విశాలమైన బెడ్ రూంలో కెళ్ళిపోయారు శాస్త్రి. భోజనానంతరం, కుక్ రామ్‌నాథ్ తెచ్చిన గ్లాసులోని పాలు త్రాగి నిద్రకు ఉపక్రమించారు.

రాత్రి 1.20 గంటలకు ప్రధాని పర్సనల్ సెక్రెటరీ జగన్నాథ్ సహాయ్ బెడ్ రూం తలుపును ఎవరో తడుతున్న చప్పుడు. తలుపులు తెరచిన ఆయనకు ఎదురుగా కుడిచేత్తో ఛాతీ వత్తుకుంటూ, 'డాక్టర్ సాబ్ కహా హై' వగరుస్తూ ప్రధాని అర్థింపు. సంగతి తెలిసిపోయింది పీఏ సహాయ్‌కి. అసిస్టెంట్లు ఇద్దరు కలిసి శాస్త్రిజీని ఆయన రూంలోకి తీసుకెళ్ళి గ్లాసులో ఆయనకు నీళ్లు ఇచ్చారు. బెడ్‌పై ఆయనను పడుకోబెట్టి, పక్కరూంలో ఉన్న ప్రధాని పర్సనల్ వైద్యుడు డాక్టర్ ఆర్ఎన్ చుఘ్‌కు కబురు చేశాడు పీఏ క్షణాల్లో మెడికల్ కిట్‌తో శాస్త్రీజీ రూంలో కొచ్చి ఆయన పల్స్ చెక్ చేశాడు. శ్వాస పీల్చుకోలేక, 'మేరే రామ్' అంటూ అవస్థ పడుతున్నారాయన. ప్రధాని గుండెపోటుకు గురయ్యారని నిర్ధారణకు వచ్చి వెంటనే ఒక ఇంజెక్షన్ చేసి ఛాతీ వత్తడం ప్రారంభించాడు డాక్టర్ అయినా శాస్త్రీజీ క్రమంగా స్పృహ కోల్పోయారు. ఆఖరు ప్రయత్నంగా మరో ఇంజెక్షన్‌ను నేరుగా శాస్త్రిజీ గుండె దగ్గరే ఇచ్చాడు చుఘ్. అయినా లాభం లేకపోయింది. ఆశ వదలుకుని, గద్గద స్వరంతో 'బాబూజీ, ఆప్నే ముజె మౌకా నహీ దియా (నాకు మీరు తగిన సమయం ఇవ్వలేదు)' అంటూ అశ్రునయనాలతో శాస్త్రీజీ పల్స్‌ను వదిలేశాడు డాక్టర్ చుఘ్. తాష్కెంట్‌లో అప్పుడు సమయం రాత్రి 1.32 గంటలు.

'యువర్ ప్రైమ్ మినిస్టర్ ఈజ్ డైయింగ్' అన్న ఒక



రష్యన్ లేడీ విలేకరి మాటతో, నిద్రలో నుండి హుటాహుటిన లేచి చెప్పులు లేకుండానే తన గది నుండి ఆదుర్దాగా శాస్త్రిజీ బెడ్ రూమ్ వైపు పరుగు తీశాడు ఆయన ప్రెస్ సెక్రెటరీ కులదీప్ నయ్యర్. అప్పటికే అంతా అయిపోయింది. ఆయన బెడ్ దగ్గర రష్యన్ ప్రధాని కోసిగిన్, పాక్ నేత ఆయూబ్ ఖాన్, ప్రధాని సహచరులు, మంత్రులూ అయిన స్వర్ణ సింగ్, యశ్వంత్ రావు చవాన్ దీన వదనాలతో శిల్పాల్లా నిలుచున్నారు. ఆ నిశాంత నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, పాక్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్, కుల్దీప్ వైపు చూస్తూ 'హియర్ ఈస్ ఏ మేన్ ఆఫ్ పీస్, హూ గేవ్ హిస్ లైఫ్ ఫర్ ఎమిటీ బిట్వీన్ ఇండియా అండ్ పాకిస్తాన్' అంటూ వాపోయాడు.


ఆ రోజు మధ్యాహ్నం 2.30 గం.కు జాతీయ జెండాలో చుట్టిన ప్రధాని పార్థివ దేహంతో సోవియట్ ఎయిరోఫ్లోట్ విమానం తాష్కెంట్ నుండి ఢిల్లీ పాలమ్ ఎయిర్ పోర్ట్ చేరుకుంది. అక్కడి నుంచి గన్ క్యారేజ్‌లో శాస్త్రీజీ డెడ్ బాడీని ఆ సాయంత్రం 4.10 గంటలకు 10, జనపథ్‌కు చేర్చారు. రోడ్డంతా శోకసంద్రంలో మునిగిన ఢిల్లీ వాసులతో నిండింది. ఏమీ తోచని ప్రధాని కుటుంబీకులు వారిస్తున్నా ఆగమేఘాల మీద ఏ పోస్టుమార్టం లేకుండానే అదే రోజు శాంతివన్‌లో శాస్త్రీజీ అంత్యక్రియలు జరిపారు.

ఊహించని రీతిలో నిష్క్రమించిన ప్రధాని లాల్ బహదూర్ స్థానంలో నూతన నాయకుణ్ణి ఎన్నుకోవటానికి, కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు సభ్యులు పలుమార్లు సమావేశమయ్యారు. సీనియర్ కాంగ్రెస్ నేత మొరార్జీ దేశాయ్ ఈ పదవికి గట్టి పోటీ ఇచ్చారు. కరడు గట్టిన గాంధేయవాది అయినప్పటికీ దేశాయ్‌ది నిరంకుశ తత్వం. పార్టీ అధ్యక్షుడు కామరాజ్ నాడార్‌కు ఇది మింగుడు పడలేదు. చాణక్య రీతితో దేశాయ్‌ని పోటీ నుండి తప్పించి, నెహ్రూ తనయ, ఇందిరా గాంధీ పేరును పార్లమెంటరీ బోర్డు నాయకురాలిగా తెరపైకి తేగలిగారు కింగ్ మేకర్ కామరాజ్. రేపో మాపో లండన్ బ్రిటిష్ హైకమిషనర్‌గా వెళ్లవలసిన అప్పటి ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ మినిస్టర్ ఇందిర చేతిలోకి 1966 జనవరి 24న నాటకీయంగా దేశ ప్రధాని పగ్గాలు వెళ్లిపోయాయి.

వ్యాసకర్త విశ్రాంత ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్
మొబైల్: 98190 96949
(అనూజ్ ధర్ పుస్తకం 'యువర్ ప్రైమ్ మినిస్టర్ ఈజ్ డెడ్', ఆధారంగా. నేడు లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి)

బోధించే విధానం

మనుషులందరూ ఒకలా ఉండరు. భిన్న భిన్న ప్రవృత్తులు, ఆశయాలు, అలవాట్లు, అభిరుచులతో ఉంటారు. కొందరికి ఒకసారి చెబితే సరిపోతుంది. మరి కొందరికి పదిసార్లు చెప్పాలి. బడిలో ఒకటో తరగతి విద్యార్థులకు బోధించే విధానం వేరుగా, పదో తరగతి వారికి బోధించే పద్ధతి ఇంకో విధంగా ఉంటుంది.



పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లో ఉన్న మార్కు సువార్త నాలుగో అధ్యాయంలో ఏసుక్రీస్తు తన సందేశాన్ని ఏ విధంగా తెలియజేసేవాడో చెప్పబడింది. తనను చేరవచ్చిన ప్రజల మానసిక స్థాయికి తగ్గట్టుగా ఆయన ప్రవచనాలు ఉండేవి. తన సందేశం ప్రజల మనసుల్లో సూటిగా నాటుకొనేందుకు ఆయన చిన్న చిన్న పిట్ట కథలు, నీతి కథలు చెప్పేవాడు. ఉపమానాలు కోకొల్లలుగా వాడేవాడు. దేవుని రాజ్యం ఏ విధంగా ఉంటుంది? అని ప్రశ్నించుకొని అది ఆవగింజలా ఉంటుంది అంటాడు. మనం భూమిలో నాటే విత్తనాలన్నింటికన్నా అది చాలా చిన్నది. కానీ దాన్ని నాటాక ఇతర మొక్కలకన్నా అది ఏపుగా పెరుగుతుంది. పక్షులు దాని నీడలో గూళ్ళు కట్టుకొనేటంత పెద్దవిగా దాని కొమ్మలు ఉంటాయి అంటాడు. ఏసు ఇలాంటి ఉపమానాల్ని ఎన్నో ఉపయోగించేవాడు. ఒకసారి రైతును ఉపమానంగా తీసుకొనేవాడు. ఇంకోసారి దీపస్తంభం అందుకు పనికివచ్చేది. ఈ విధంగా ఏసు ప్రజలకు అర్థమయ్యే రీతిలో తన సందేశం వినిపించేవాడు. ఉపమానాలు ఉపయోగించకుండా వాళ్ళకు ఆయన ఏదీ బోధించేవాడు కాదు. కానీ, ఆయన తన శిష్యులకు మటుకు ఏకాంతంలో తన సందేశంలోని అంతరార్థాన్ని విడమరచి చెప్పేవాడు.

– దీవి సుబ్బారావు

III
సాక్షి బిజినెస్
గురువారం
11-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
271	74
71,658	21,619

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,906	▲	48
డోజోన్స్	37,558	▲	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,651	▼	32
డాక్స్	16,689	▼	1
షాంఘై	2,878	▼	16
నికాయ్	34,443	▲	679

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
62,348	▼	67
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,098	▼	67
వెండి (కిలో)		
71,447	▼	679

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసీటం	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎసీటం	104.85	107.42
€	యూరో	ఎసీటం	89.85	92.22
¥	జపాన్ ఎన్ (100)	ఎసీటం	56.85	58.15
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎసీటం	54.87	56.80
S$	సింగపూర్ డాలర్	ఎసీటం	61.49	63.49
SAR	సౌదీ రియాల్	ఛాయనీటం	21.19	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయనీటం	21.84	23.27
¥	చైనా యువాన్	ఛాయనీటం	10.39	12.46

కోటక్ మహీంద్రా లైఫ్ నుంచి 'టులిప్' ప్లాన్

టర్మ్ ఇన్సూరెన్స్, యులిప్ ప్రయోజనాలతో పాలసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా టులిప్ (టీయూఎల్ఐపీ) పేరిట కొత్త పాలసీని ఆవిష్కరించింది. ఇటు టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీతో పాటు అటు యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ (యులిప్) ప్రయోజనాలను కూడా అందించే విధంగా ఈ ప్లాన్ ఉంటుందని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మనీష్ అలఘ్ తెలిపారు. వార్షిక ప్రీమియానికి 100 రెట్లు లైఫ్ కవరేజీ పొందవచ్చని, నిర్దిష్ట కాలం తర్వాత ప్రీమియం అలొకేషన్ చార్జీల రీఫండ్, క్రిటికల్ ఇల్‌నెస్..యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ వంటి ప్రయోజనాలు ఇందులో ఉన్నాయని ఆయన చెప్పారు. హైదరాబాద్ మార్కెట్లో తమకు బ్యాంక్‌ఎష్యూరెన్స్ తదితర చానల్స్‌తో పాటు సుమారు 5,000 మంది ఏజెంట్లు ఉన్నట్లు మనీష్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థ స్థాయిలో వ్యక్తిగత పాలసీల ప్రీమియం ఆదాయం 37 శాతం పెరగ్గా.. కొత్త ట్యాక్సేషన్ విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈసారి 10–12 శాతం స్థాయిలో వృద్ధి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. కంపెనీ స్థాయిలో ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 10 శాతం, తెలుగు రాష్ట్రాల్లో 13 శాతం వృద్ధి నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.


బిగ్'సి' సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: రిటైల్ మొబైల్స్ విక్రయ సంస్థ బిగ్'సి' సంక్రాంతి సందర్భంగా ఆఫర్లు ప్రకటించింది. బిగ్ 'సి' స్టోర్లలో స్మార్ట్ ఫోన్ కొనుగోళ్లపై రూ.3,000 వరకు తక్షణ తగ్గింపుతో పాటు రూ.4,999 విలువైన స్మార్ట్‌వాచ్ ఉచితంగా అందిస్తుంది. అలాగే రూ.1.10 లక్షల విలువైన హెల్త్ కేర్ సంబంధిత ప్రయోజనాలు, అదే విధంగా రూ.75వేల విలువైన పేటీఎం ప్రయోజనాలు ఉచితంగా లభిస్తున్నాయి. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేయవచ్చు. ప్రజలంతా ఈ ఆఫర్లు వినియోగించుకోవాలని సంస్థ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి కోరారు.



భారీ పెట్టుబడులకు రెడీ..

- వైబ్రంట్ గుజరాత్ సదస్సులో కార్పొరేట్ల క్యూ
- తొలిరోజే రూ. 2.35 లక్షల కోట్ల ప్రణాళికలు





గాంధీనగర్: గత రెండు దశాబ్దాలుగా వైబ్రంట్ గుజరాత్ సదస్సు అంతర్జాతీయ బిజినెస్ నెట్‌వర్కింగ్ ఈవెంట్‌గా ఆవిర్భవించింది. తద్వారా కార్పొరేట్ ప్రపంచం నుంచి భారీ పెట్టుబడులను ఆకట్టుకుంటోంది. తాజాగా 10వ వైబ్రంట్ గుజరాత్(2024) సదస్సులో రిలయన్స్ గ్రూప్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, సుజుకీ మోటార్ కార్ప్ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు పెట్టుబడులకు ఆసక్తిని ప్రదర్శించారు. వెరసి తొలి రోజే రూ. 2.35 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించారు. దేశ, విదేశీ దిగ్గజాల నుంచి భారీ పెట్టుబడులను ఆకట్టుకుంటున్న రాష్ట్రాలలో గుజరాత్ ఒకటిగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. వివరాలు చూద్దాం..

రిలయన్స్.. కార్బన్ ఫైబర్ ప్లాంట్

హజీరాలో దేశంలోనే తొలి కార్బన్ ఫైబర్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ చీఫ్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. గుజరాత్ కేంద్రంగా రిలయన్స్ కార్యకలాపాలు కొనసాగనున్నట్లు తెలియజేశారు. గత దశాబ్ద కాలంలో ప్రపంచస్థాయి ఆస్తులు, సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో దేశవ్యాప్తంగా 150 బిలియన్ డాలర్లు(రూ. 12 లక్షల కోట్లు) వెచ్చించినట్లు వివరించారు. వీటిలో మూడో వంతు పెట్టుబడులను గుజరాత్‌లోనే చేపట్టినట్లు తెలియజేశారు. తద్వారా ఈ ప్రాంతానికి తామిస్తున్న ప్రాధాన్యతను ప్రస్తావించారు.

టాటా.. సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్

ఈ ఏడాది(2024) చివరిలో నూతన సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంటును గుజరాత్‌లో ఏర్పాటు చేయనున్నట్లు టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. దేశీయంగా చిప్స్ తయారీకి ప్రధాని మోదీ ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ సాణంద్‌లో లిథియమ్ అయాన్ బ్యాటరీల తయారీ కేంద్రానికి తెరతీయనున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక దశలో 20 గిగావాట్ స్టోరేజీ బ్యాటరీ సామర్థ్యంతో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ఎలక్ట్రిక్ వాహనా(ఈవీ)లకు పెరుగుతున్న డిమాండుకు అనుగుణంగా పెట్టుబడులు చేపట్టనున్నట్లు వివరించారు. రెండు దశలలో చేపట్టనున్న ప్రాజెక్ట్ పనులు రెండు నెలల్లోగా ప్రారంభంకానున్నట్లు తెలియజేశారు.

ఆర్సెలర్‌మిట్టల్.. అతిపెద్ద స్టీల్‌ప్లాంట్



ప్రపంచంలోనే ఒకే ప్రాంతంలో అతిపెద్ద స్టీల్ ఫ్యాక్టరీని హజీరాలో ఏర్పాటు చేయనున్నట్లు ఆర్సెలర్‌మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ పేర్కొన్నారు. జేవీ ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా ద్వారా 2029కల్లా ప్లాంటు నిర్మాణం పూర్తికాగలదని తెలియజేశారు. ప్లాంటును వార్షికంగా 2.4 కోట్ల టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యంతో నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. 2026లో తొలి దశ ప్రారంభం కావచ్చని తెలియజేశారు.

మైక్రాన్.. రూ. 6,760 కోట్లు



సెమీకండక్టర్ల తయారీలో భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా నిలపాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను మైక్రాన్ టెక్నాలజీ సీఈవో సంజయ్ మెహ్రోత్రా ప్రశంసించారు. ఈ యూఎస్ చిప్ తయారీ దిగ్గజం సాణంద్‌లో 2.75 బిలియన్ డాలర్ల సెమీకండక్టర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ ప్లాంటు నిర్మాణాన్ని సెప్టెంబర్‌లోనే ప్రారంభించింది. పెట్టుబడుల్లో మైక్రాన్ 82.5 కోట్ల డాలర్లు (సుమారు రూ. 6,760 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. మిగిలిన నిధులను ప్రభుత్వం రెండు దశలలో సబ్సిడీ రూపంలో సమకూర్చనుంది.

అదానీ.. రూ. 2 లక్షల కోట్లు

రానున్న ఐదేళ్లలో గుజరాత్‌లో రూ. 2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులతో భారీ గ్రీన్ ఎనర్జీ పార్క్‌కు తెరతీయనున్నట్లు అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ వెల్లడించారు. అంతరిక్షం నుంచి సైతం దర్శించగల ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఉద్యోగాలకు అవకాశముంటుందని తెలిపారు. గత వైబ్రంట్ సదస్సులో 2025కల్లా రూ. 55,000 కోట్ల పెట్టుబడులను ప్రకటించగా... రూ. 50,000 కోట్లు ఇప్పటికే వెచ్చించినట్లు వివరించారు.

మారుతీ సుజుకీ రెండో ప్లాంట్



ఆటో దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా గుజరాత్‌లో రెండో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్ప్ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ పేర్కొన్నారు. ఇందుకు రూ. 35,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. 2030–31కల్లా వార్షిక తయారీ సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు చేర్చాలని చూస్తున్నట్లు తెలియజేశారు. 2028–29కల్లా కొత్త ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశమున్నట్లు తెలియజేశారు.

ఎయిర్‌పోర్ట్‌ల విభాగాన్ని లిస్టింగ్ చేస్తాం

అదానీ ఎంటర్‌ప్రైజెస్ వీపీ జీత్ అదానీ వెల్లడి

హైదరాబాద్: నిర్దిష్ట మైలురాళ్లను సాధించిన తర్వాత సమీప భవిష్యత్తులో ఎయిర్‌పోర్ట్స్ విభాగాన్ని లిస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని అదానీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ ప్రెసిడెంట్ జీత్ అదానీ వెల్లడించారు. ప్రస్తుతం కంపెనీ చేతిలో ఉన్న విమానాశ్రయాలను విస్తరిస్తున్నామని, గతేడాది అన్ని ఎయిర్‌పోర్ట్‌ల నుంచి 8 కోట్ల మంది ప్యాసింజర్లు ప్రయాణించినట్లు ఆయన చెప్పారు. లక్నో, గువాహటి ఎయిర్‌పోర్ట్‌లలో కొత్త టెర్మినల్స్‌ను ప్రారంభించనున్నామని, నవీ ముంబై విమానాశ్రయం ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి కాగలదని చెప్పారు. అహ్మదాబాద్, జైపూర్, మంగళూరు ఎయిర్‌పోర్ట్‌ల విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. భారత నేవీ కోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ తయారు చేసిన దృష్టి 10 స్టార్‌లైనర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) ఆవిష్కరణ కార్యక్రమంలో జీత్ పాల్గొన్నారు.



అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అయిన అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ (ఏఏహెచ్ఎల్) మంగళూరు, లక్నో, అహ్మదాబాద్, తిరువనంతపురం, ముంబై తదితర విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో (ఎంఐఏఎల్) 73% వాటా ఉంది. ఎంఐఏఎల్‌కు నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో 74% వాటాలు ఉన్నాయి. ప్రయాణికుల పరంగా 25% వాటా, ఎయిర్ కార్గో ట్రాఫిక్‌లో 33% వాటాతో ఏహెచ్ఎల్ దేశీయంగా అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్రా సంస్థగా ఉంది.

చివర్లో కొనుగోళ్లు...

నష్టాల్లోంచి లాభాల్లోకి సూచీలు



ముంబై: ఆఖరి గంట కొనుగోళ్లతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొన్న స్టాక్ మార్కెట్ బుధవారం లాభాలతో ముగిసింది. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల కారణంగా ప్రారంభంలోనే భారీ నష్టాలు చవిచూశాయి. మిడ్ సెషన్ నుంచి కనిష్ట స్థాయిలో ఐటీ, బ్యాంకింగ్, మెటల్, సర్వీసెస్, వినిమ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చివర్లో రిలయన్స్(2.50%), ఐసీఐసీఐ(1.50%) షేర్లు రాణించడంతో లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 615 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 271 పాయింట్లు పెరిగి 71,658 వద్ద నిలిచింది. నిఫ్టీ 21,449 – 21,642 శ్రేణిలో ట్రేడైంది. మార్కెట్ ముగిసే సరికి 74 పాయింట్లు బలపడి 21,619 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ, టెలికం, యుటిలిటీ, రియల్టీ, విద్యుత్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,721 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,080 కోట్ల విలువైన షేర్లను కొన్నారు.

- అదానీ గ్రూప్‌లోని పదింటికి గానూ 8 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. ఎన్‌డీటీవీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 3%, అదానీ గ్రీన్ ఎనర్జీ 2%, అదానీ పోర్ట్స్ 1.50%, అదానీ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ గ్యాస్ టోటల్, అంబుజా సిమెంట్స్ అరశాతం వరకు పెరిగాయి. కాగా, అదానీ విల్మార్, ఏసీసీ షేర్లు అరశాతం మేర నష్టపోయాయి.
- ట్రేడింగ్ చివర్లో అనూహ్య కొనుగోళ్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3% లాభపడి రూ. 2,650 వద్ద ముగిసింది. ఒక దశలో 3%కి పైగా పెరిగి రూ.2659 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.46,810 కోట్లు పెరిగి రూ.17.98 లక్షల కోట్లకు చేరింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇఫ్లూ, హైదరాబాద్‌లో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రీసోర్సెస్ విభాగం.. ప్రొఫిషియన్సీ కోర్సు ఇన్ ఇంగ్లిష్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 200
» కోర్సు వ్యవధి: 05.02.2024 నుంచి 01.03.2024 వరకు (నాలుగు వారాలు)–40 గంటలు.
» అర్హత: ఇంటర్మీడియట్/10+2 పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి.
» హైదరాబాద్ ఇఫ్లూలో దరఖాస్తు ఫారాలు ఇచ్చే చివరితేది: 19.01.2024.
» చిరునామా: ఎస్ఎఫ్‌సీఏఆర్ కార్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇఫ్లూ, హైదరాబాద్.
» దరఖాస్తులకు చివరితేది: 31.01.2024.
» వెబ్‌సైట్: www.efluniversity.ac.in

స్పేస్ అప్లికేషన్స్ సెంటర్, అహ్మదాబాద్‌లో 19 సైంటిస్ట్ పోస్టులు

అహ్మదాబాద్‌లోని ఇస్రో–స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(ఇస్రో).. వివిధ విభాగాల్లో సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 19
» పోస్టుల వివరాలు: సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్సీ(అగ్రికల్చర్)–08, సైంటిస్ట్/ ఇంజనీర్–ఎస్సీ(అట్మాస్ఫియరిక్ సైన్సెస్ అండ్ ఓషనోగ్రఫీ)–08, సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్సీ(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)–03.
» అర్హత: సంబంధిత విభాగంలో ఎంఎస్సీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.56,100 నుంచి 1,77,500.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది: 15.01.2024.
» వెబ్‌సైట్: www.sac.gov.in

యూఐఐసీ, చెన్నైలో 250 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీ).. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్ 1)–జనరలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 250
» అర్హత: 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.01.2024.
» వెబ్‌సైట్: https://uiic.co.in

మదనపల్లెలో 266 పారామెడికల్ పోస్టులు

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ప్రభుత్వ వైద్య కళాశాల, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో.. కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 266.
» పోస్టులు: చైల్డ్ సైకాలజిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనీ, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, కార్డియాలజీ టెక్నీషియన్, రిఫ్రాక్షనిస్ట్, ఫిజియోథెరపిస్ట్, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేట్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, మదనపల్లె, అన్నమయ్య జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 14.01.2024.
» వెబ్‌సైట్: https://chittoor.ap.gov.in.

సమీర్‌లో 24 అప్రెంటిస్‌లు

ముంబైలోని సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్).. గ్రాడ్యుయేట్,డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీల నియామకానికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 24
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీలు–16, డిప్లొమా ఇంజనీర్స్ అప్రెంటిస్ ట్రైనీలు–08.
» విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఐటీ, మెకానికల్ ఇంజనీరింగ్.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 25 ఏళ్లు మించకూడదు.
» స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్లకు రూ.10,500, డిప్లొమా అభ్యర్థులకు రూ.8500.
» ఇంటర్వ్యూ తేదీలు: 17.01.2024, 18.01.2024
» వేదిక: సమీర్, ఐఐటీ క్యాంపస్, హిల్ సైడ్, పోవై, ముంబై.
» వెబ్‌సైట్: www.sameer.gov.in

సెంట్రల్ వర్సిటీస్‌లో పీజీ చేస్తారా!

» సీయూఈటీ-పీజీ 2024 నోటిఫికేషన్ విడుదల
» సెంట్రల్ వర్సిటీలు, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ ప్రవేశాలు
» ఆరు విభాగాల్లో 157 పేపర్లు/సబ్జెక్ట్‌లలో పరీక్ష
» గరిష్టంగా నాలుగు పేపర్లకు హాజరయ్యే అవకాశం

సెంట్రల్ యూనివర్సిటీలు.. విశ్వవిద్యాలయ విద్యకు పేరొందిన సంస్థలు! దేశంలో సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, టెక్నికల్.. ఇలా ఏ విభాగంలో పీజీ చేయాలనుకున్నా.. ఎక్కువ మంది విద్యార్థుల తొలి ప్రాథమ్యం సెంట్రల్ యూనివర్సిటీలే!! కారణం.. ఈ యూనివర్సిటీ సర్టిఫికెట్ చేతిలో ఉంటే.. ఉద్యోగావకాశాలకు ఢోకా ఉండదనే అభిప్రాయం. తాజాగా సెంట్రల్ యూనివర్సిటీల్లో... పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)-పీజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-పీజీ-2024 వివరాలు, అర్హతలు, యూనివర్సిటీల ప్రవేశ ప్రక్రియ తదితర వివరాలు..

దేశంలో పదుల సంఖ్యలో సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. వాటిలో చేరాలనుకునే విద్యార్థులు.. గతంలో ప్రతి యూనివర్సిటీ సొంతంగా నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొని హాజరవ్వాల్సి వచ్చేది.ఇది విద్యార్థులకు భారమని భావించిన ప్రభుత్వం.. అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాల కోసం ఉమ్మడిగా కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు సీయూఈటీ–యూజీ, పీజీ కోర్సులకు సీయూఈటీ–పీజీ నిర్వహిస్తున్నారు.

56 సెంట్రల్ యూనివర్సిటీలు

సీయూఈటీ–పీజీ స్కోర్ ఆధారంగా దేశంలోని 56 సెంట్రల్ యూనివర్సిటీల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం; తెలంగాణలో.. ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లలో సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. సెంట్రల్ యూనివర్సిటీలతో పాటు దాదాపు 210కి పైగా ఇన్‌స్టిట్యూట్‌లకు సీయూఈటీ–పీజీ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

అర్హతలు

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్న సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 2024లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

ఆరు విభాగాలు.. 157 పేపర్లు

సీయూఈటీ–పీజీ పరీక్షను మొత్తం ఆరు విభాగాల్లో 157 పేపర్లలో నిర్వహించనున్నారు. కామన్ విభాగంగా 22 సబ్జెక్ట్‌లు; లాంగ్వేజెస్ విభాగంలో 41 సబ్జెక్ట్‌లు; సైన్స్ విభాగంలో 30 సబ్జెక్ట్‌లు; హ్యుమానిటీస్ విభాగంలో 26 సబ్జెక్ట్‌లు; ఎంటెక్/హయ్యర్ సైన్సెస్ విభాగంలో 12 సబ్జెక్ట్‌లు; ఆచార్య విభాగంలో 26 సబ్జెక్ట్‌లలో పరీక్ష పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు పీజీలో ఏ స్పెషలైజేషన్‌లో చేరాలనుకుంటున్నారో దానికి సంబంధించిన పేపర్‌లో పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.

గరిష్టంగా నాలుగు పేపర్లు

విద్యార్థులు గరిష్టంగా నాలుగు సబ్జెక్ట్ పేపర్లలో పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. బ్యాచిలర్ డిగ్రీలో తాము చదివిన సబ్జెక్ట్‌లు, వాటికి పీజీలో సరితూగే స్పెషలైజేషన్లకు సంబంధించిన పేపర్ల పరీక్షకు హాజరయ్యే వీలుంది.



జనరల్ విభాగం తొలగింపు

సీయూఈటీ–పీజీ–2024లో ప్రధాన మార్పు.. జనరల్ విభాగాన్ని తొలగించడం. గతేడాది ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి పార్ట్–ఎలో జనరల్ టెస్ట్‌ను నిర్వహించారు. పార్ట్–బిలో సబ్జెక్ట్ ప్రశ్నలను అడిగారు. ఈ ఏడాది జనరల్ టెస్ట్ విభాగం లేదని పేర్కొన్నారు. దీంతో.. పేపర్‌లో ప్రశ్నలన్నీ సబ్జెక్ట్‌కు సంబంధించినవే అడిగే అవకాశముంది.

75 ప్రశ్నలు.. 300 మార్కులు

- సీయూఈటీ–పీజీ పరీక్షలో ప్రతి పేపర్/సబ్జెక్ట్‌లో 75 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించే సమయం 1 గంట 45 నిమిషాలు.
- పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇంగ్లిష్/ హిందీ మీడియంలలోనే పరీక్ష ఉంటుంది. ఎంటెక్/హయ్యర్ సైన్సెస్‌కు ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే పరీక్ష నిర్వహిస్తారు. ఆచార్య విభాగంలోని కోర్సులకు సంబంధించి హిందూ స్టడీస్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, బుద్ధ దర్శన్ మినహా అన్ని పేపర్లు సంస్కృతంలో ఉంటాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

మలి దశలో.. వేర్వేరుగా దరఖాస్తు

సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడిగా సీయూఈటీ–పీజీని నిర్వహిస్తున్నప్పటికీ.. ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల సమయంలో విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సదరు యూనివర్సిటీలు అడ్మిషన్ నోటిఫికేషన్లు విడుదల చేశాక.. సీయూఈటీ–పీజీ స్కోర్‌ను పేర్కొంటూ దరఖాస్తు చేసుకోవాలి. ఇలా.. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. సీయూఈటీ–పీజీ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటూ.. పీజీ ప్రవేశాలను ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జనవరి 24
- దరఖాస్తు సవరణ చివరి తేదీ: 2024, జనవరి 29
- టెస్ట్ సెంటర్ సమాచారం వెల్లడి: 2024,మార్చి 4
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024, మార్చి 7
- సీయూఈటీ–పీజీ తేదీలు: మార్చి 11 నుంచి మార్చి 28 వరకు (ప్రతి రోజు మూడు షిఫ్ట్‌లలో పరీక్ష, మొదటి షిఫ్ట్ 9 నుంచి 10:45 వరకు; రెండో షిఫ్ట్ 12:45 నుంచి 2:30 వరకు; మూడో షిఫ్ట్ 4:30 నుంచి 6:15 వరకు);
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://pgcuet.samarth.ac.in/index.php/site/index

రాత పరీక్షలో రాణించేలా

- సీయూఈటీ–పీజీలో రాణించాలంటే.. అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్‌ల కోసం బ్యాచిలర్ డిగ్రీతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి వరకూ పుస్తకాలను సంపూర్ణంగా చదవాలి.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి.
- జనరల్ పేపర్‌కు హాజరయ్యే అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పాలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇక.. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థగణిత అంశాలు, కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన అవసరం.
- ఎంటెక్/హయ్యర్ సైన్స్ పేపర్ల అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో అభ్యసనం సాగించడం ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా ఆయా ఫార్ములాలు, బేసిక్స్, సిద్ధాంతాలు, వాటిని వాస్త వ పరిస్థితుల్లో అన్వయిస్తున్న విధానంపై అవగాహన ఏర్పరచుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. సైన్స్ విభాగం అభ్యర్థులు కూడా ఇదే తరహా ప్రిపరేషన్ సాగిస్తే మంచి స్కోర్ సాధించొచ్చు.
- లాంగ్వేజెస్ అభ్యర్థులు లిటరేచర్, పొయెట్రీ, కవులు, కాంప్రహెన్షన్, గ్రామర్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హ్యుమానిటీస్ విద్యార్థులు తమ సబ్జెక్ట్‌లకు సంబంధించి కోర్ అంశాలతోపాటు.. సమకాలీన పరిణామాలపైనా అవగాహన పొందాలి. అదే విధంగా కోర్ సబ్జెక్టులను తాజా పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ముఖ్యంగా సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఫిలాసఫీ, ఆంత్రోపాలజీ, జాగ్రఫీ సబ్జెక్ట్‌ల అభ్యర్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

టెస్ట్ ప్రాక్టీస్ సెంటర్స్

అభ్యర్థులకు సీయూఈటీ విధానం, అదే విధంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్‌టీఏ.. టెస్ట్ ప్రాక్టీస్ సెంటర్స్ సదుపాయాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ ప్రాక్టీస్ సెంటర్లలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ద్వారా పరీక్షలో అడిగే ప్రశ్నల తీరుపై అవగాహన పొందొచ్చు.

220కు పైగా స్కోర్‌తో

జేఎన్‌యూ, డీయూ, బీహెచ్‌యూ వంటి ప్రముఖ యూనివర్సిటీల్లో పీజీ ప్రోగ్రామ్‌లకు సైతం సీయూఈటీ స్కోర్‌నే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇలాంటి ప్రసిద్ధ యూనివర్సిటీల్లో ప్రవేశాలు ఖరారు చేసుకోవాలంటే.. సీయూఈటీలో 220కు పైగా స్కోర్ సాధించేలా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 190కు పైగా మార్కులు సాధిస్తే టాప్ వర్సిటీల్లో ప్రవేశం లభిస్తుందని పేర్కొంటున్నారు.

రెండో రౌండ్‌లో సుమిత్ నగాల్



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. మెల్‌బోర్న్‌లో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 139వ ర్యాంకర్ సుమిత్ 6-3, 7-5తో జెఫ్రీ బ్లాన్‌కనెక్స్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. గంటా 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అంకిత రైనా (భారత్) 1-6, 5-7తో సారా బెజ్‌లెక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడిపోయింది.

ఇంగ్లండ్ 'ఎ' జట్టు సహాయక బృందంలో...



భారత్‌లో పర్యటించనున్న ఇంగ్లండ్ 'ఎ' జట్టుకు వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా పని చేయనున్నాడు. ఈ పర్యటనలో భాగంగా భారత 'ఎ' జట్టుతో ఇంగ్లండ్ అహ్మదాబాద్‌లో 3 నాలుగు రోజుల అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ టూర్ తొలి 9 రోజుల పాటు కార్తీక్ ఇంగ్లండ్ టీమ్‌కు అందుబాటులో ఉంటాడు. హెడ్ కోచ్ నీల్ కిలీన్ నేతృత్వంలో అతను పని చేస్తాడు.



భారత షూటర్లకు ఐదు పతకాలు

జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నమెంట్‌లో మూడో రోజూ భారత షూటర్లు ఐదు పతకాలతో మెరిశారు. బుధవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ నాన్సీ స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... ఇలవేనిల్ వలారివన్ రజత పతకం దక్కించుకుంది. నాన్సీ, ఇలవేనిల్, మెహులీ ఘోష్‌లతో కూడిన భారత జట్టు 1897.2 పాయింట్లతో టీమ్ విభాగంలో బంగారు పతకం నెగ్గింది. వ్యక్తిగత ఫైనల్లో నాన్సీ 252.8 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఇలవేనిల్ 252.7 పాయింట్లతో రెండో స్థానాన్ని పొందింది. చైనా షూటర్ షెన్ యుఫాన్ 231.4 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్ కాంస్య పతకం సాధించగా... రుద్రాంక్ష్, అర్జున్ బబూటా, శ్రీకార్తీక్‌లతో కూడిన భారత బృందానికి కాంస్య పతకం దక్కింది. వ్యక్తిగత ఫైనల్లో రుద్రాంక్ష్ 228.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానాన్ని పొందాడు. టీమ్ విభాగంలో రుద్రాంక్ష్, అర్జున్, శ్రీకార్తీక్ బృందం 1885.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

ముగిసిన శ్రీజ పోరాటం



దోహా: వరల్డ్ టేబుల్ టెన్నిస్ దోహా కంటెండర్ టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన శ్రీజ రెండో రౌండ్‌లో 14-12, 11-8, 11-7తో ఆడ్రీ జరీఫ్ (ఫ్రాన్స్)పై గెలిచింది. అయితే మూడో రౌండ్‌లో శ్రీజ 5-11, 10-12, 9-11తో చెన్ జు యు (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో శ్రీజ-యశస్విని ద్వయం 6-11, 7-11, 5-11తో జియాన్ టియాని-చెన్ జింగ్‌టాన్ (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

ప్రపంచకప్‌కు ముందు ఒకసారి...

వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత భారత జట్టు సొంతగడ్డపై టి20 ఫార్మాట్‌లో కొత్త సమరానికి సిద్ధమైంది. గతంలో ఎన్నడూ ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడని అఫ్గానిస్తాన్‌తో సిరీస్ కోసం ఇప్పుడు టీమిండియా బరిలోకి దిగుతోంది. టి20 ప్రపంచకప్‌కు మరికొంత సమయం ఉన్నా... దానికి ముందు భారత్ ఆడనున్న ఆఖరి అంతర్జాతీయ సిరీస్ ఇదే కానుంది. 2022 వరల్డ్ కప్ సెమీస్ పరాజయం తర్వాత కుర్రాళ్ల కోసం వరుసగా విశ్రాంతి తీసుకుంటూ వచ్చిన రోహిత్, కోహ్లి ఇప్పుడే మళ్లీ ఈ సిరీస్‌లో ఆడనుండటంతో జట్టు బలం పెరిగింది. మరోవైపు అప్పుడప్పుడు కొన్ని మెరుపు ప్రదర్శనలతో సత్తా చాటుతున్న అఫ్గానిస్తాన్ పటిష్ట ప్రత్యర్థి పోటీనివ్వాలని పట్టుదలగా ఉంది.



శుబ్‌మన్ గిల్ యశస్వి జైస్వాల్ తిలక్ వర్మ

మొహాలి: దక్షిణాఫ్రికా గడ్డపై టి20 సిరీస్‌లో సమంగా నిలిచిన భారత జట్టు స్వదేశంలో కొత్త సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది. అఫ్గానిస్తాన్‌తో 3 మ్యాచ్‌ల పోరులో భాగంగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో భారత్ తలపడుతుంది. ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగడం ఇదే మొదటిసారి. గతంలో ప్రపంచకప్, ఆసియా కప్‌లలో అఫ్గాన్‌ను ఎదుర్కొన్న ప్రతీసారి భారత్‌కే విజయం దక్కింది. ప్రస్తుతం కూడా బలాబలాల దృష్ట్యా అన్ని రంగాల్లో భారత్ పటిష్టంగా కనిపిస్తోంది. పునరాగమనం చేసిన సీనియర్లతో పాటు తమకు లభించిన పరిమిత అవకాశాల్లోనే తమను తాము నిరూపించుకున్న కుర్రాళ్లను పరీక్షించేందుకు కూడా ఇది సరైన అవకాశం.

- ద్వైపాక్షిక టి20 సిరీస్ బరిలో భారత్
- నేడు అఫ్గానిస్తాన్‌తో తొలి పోరు
- మ్యాచ్‌కు కోహ్లి దూరం
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

4 మొహాలీలో భారత జట్టు ఇప్పటి వరకు నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో విజయం సాధించి, ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. అఫ్గానిస్తాన్‌తో టీమిండియా ఐదు టి20లు ఆడగా... నాలుగింటిలో గెలిచింది. మరో మ్యాచ్ రద్దయింది.

కుర్రాళ్లంతా ఉత్సాహంగా...

టి20 జట్టులో కచ్చితంగా ఉండే హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ గాయాల కారణంగా ఈ సిరీస్‌కు అందుబాటులో లేరు. అయితే రోహిత్ నాయకత్వంలో సత్తా చాటేందుకు ఇతర కుర్రాళ్లంతా సిద్ధంగా ఉన్నారు. ఈ ఫార్మాట్‌లో తానేంటో ఇప్పటికే నిరూపించుకొని ఫినిషర్‌గా చెలరేగుతున్న రింకూ సింగ్ తొలిసారి రోహిత్ కెప్టెన్సీలో ఆడనున్నాడు. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ కూడా ఇటీవల ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. రోహిత్, యశస్వి ఓపెనింగ్ చేస్తారని కోచ్ ద్రవిడ్ ఇప్పటికే స్పష్టం చేశాడు. యశస్వి శుభారంభం అందించాల్సి ఉండగా... కొంత విరామం తర్వాత బరిలోకి దిగుతున్న రోహిత్‌పై కూడా భారం ఉంది. ఫామ్‌ను బట్టి చూస్తే గిల్‌కు తుది జట్టులో చోటు కష్టమే. అయితే వ్యక్తిగత కారణాలతో విరాట్ కోహ్లి ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. దాంతో మూడో స్థానంలో గిల్‌కు అవకాశం దక్కనుంది. కీపర్‌గా ఇద్దరు ఆటగాళ్లు అందుబాటులో ఉన్నా... సంజూ సామ్సన్ కాకుండా జితేశ్ శర్మ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపవచ్చు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తిరిగొచ్చినా అతడికి తొలి మ్యాచ్‌లో చాన్స్ దక్కకపోవచ్చు. భారత్ ముగ్గురు పేసర్లతో ఆడుతుందా లేక ఇద్దరికే పరిమితం అవుతుందా అనేది చూడాలి. స్పిన్నర్లలో కుల్దీప్ యాదవ్ చక్కటి ఫామ్‌లో ఉండగా...అదనంగా మరో ముగ్గురు స్పిన్నర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు.



ఇబ్రహీం జద్రాన్

సత్తా చాటేనా...

వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్ అంచనాలకు మించి రాణించింది. అదే ఫామ్‌లో ఆ జట్టు టి20ల్లోనూ కొనసాగిస్తే భారత్‌కు ఇబ్బందులు కలగవచ్చు. గుర్బాజ్ ఇప్పటికే మెరుపు ఓపెనర్‌గా గుర్తింపు తెచ్చుకోగా, కెప్టెన్ ఇబ్రహీం మంచి ఫామ్‌లో ఉన్నాడు. రహ్మత్, నజీబుల్లా జట్టు బ్యాటింగ్ భారం మోస్తారు. నబీ, ముజీబ్, నూర్‌లతో అఫ్గాన్ స్పిన్ పటిష్టంగా కనిపిస్తోంది. ఈ ముగ్గురిని కూడా తుది జట్టులో ఆడించే అవకాశం ఉంది. ఐపీఎల్‌లో ఇక్కడ ఆడిన అనుభవం ఉన్న పేస్‌బౌలర్లు ఫజల్ హక్, నవీన్ ప్రభావం చూపించగలరు. అయితే జట్టు ప్రధాన బలం రషీద్ ఖాన్ సిరీస్‌కు దూరం కావడం ఆ జట్టుకు ప్రతికూలాంశం. గాయం నుంచి కోలుకుంటున్న రషీద్ ఊహించినట్లుగానే సిరీస్ మొదలయ్యే వరకు కోలుకోలేకపోయాడు. అయితే పోరాటపటిమ ఉన్న అఫ్గాన్ సంచలనం సృష్టించినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇటీవలే యూఈఏతో జరిగిన సిరీస్‌ను 2-1తో అఫ్గానిస్తాన్ గెలుచుకుంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, తిలక్, రింకూ, జితేశ్, అక్షర్, అర్ష్‌దీప్, ముకేశ్, కుల్దీప్, రవి బిష్ణోయ్. అఫ్గానిస్తాన్: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), హజ్రతుల్లా, గుర్బాజ్, అజ్మతుల్లా, నజీబుల్లా, నబీ, నైబ్, ముజీబ్, ఖైస్, నవీన్ ఉల్ హక్, ఫజల్ హక్

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ పిచ్. పీసీఏ స్టేడియం భారీ స్కోర్లకు వేదిక. ఇక్కడ జరిగిన చివరి టి20లో (2022) మొత్తం 419 పరుగులు నమోదయ్యాయి. ఉత్తరాదిలో మంచు ప్రభావం ఉంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-18, 21-19తో మొహమ్మద్ షోహిబుల్ ఫిక్రి-మౌలానా బాగస్ (ఇండోనేసియా) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ 14-21, 11-21తో ఆండెర్స్ ఆంటోన్సన్ (డెన్మార్క్) చేతిలో... లక్ష్య సేన్ 15-21, 16-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశారు.



సందీప్ లమిచానేకు ఎనిమిదేళ్ల జైలు

రేప్ కేసులో నేపాల్ క్రికెటర్‌కు శిక్ష



కఠ్మాండు: మైనర్‌పై అత్యాచారం కేసులో నేపాల్ లెగ్ స్పిన్నర్, మాజీ కెప్టెన్ సందీప్ లమిచానేకు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని లమిచానే తరపు న్యాయవాది వెల్లడించారు. 18 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన 23 ఏళ్ల లమిచానే 51 వన్డేలు, 52 టి20లు ఆడి మొత్తం 202 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో ఆడిన తొలి నేపాల్ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అతను ఢిల్లీ జట్టు తరఫున 2 సీజన్లలో కలిపి 9 మ్యాచ్‌లు ఆడాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో మైనర్‌ను రేప్ చేశాడనే ఆరోపణలు రావడంతో నేపాల్ బోర్డు సస్పెండ్ చేసింది. అయితే తీవ్ర విమర్శల మధ్య అతను గత ఫిబ్రవరిలో జట్టులోకి తిరిగొచ్చి మ్యాచ్‌లు ఆడాడు. విచారణ అనంతరం లమిచానే నేరం చేసినట్లు రుజువైంది.

తమిళ్ తలైవాస్ గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తమిళ్ తలైవాస్ మూడో విజయం నమోదు చేసింది. యూపీ యోధాస్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 46-27తో గెలిచింది. యు ముంబా, హరియాణా స్టీలర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 44-44తో 'డ్రా' అయింది.

సినిమా



● ప్రభాస్

కల్కి రాక ఆ రోజేనా..?

థియేటర్స్‌లో 'కల్కి' రాకకు సమయం ఆసన్నమైంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫ్యాంటసీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను ఈ ఏడాది మే 9న విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందని, విడుదల తేదీ గురించిన అధికారిక ప్రకటన ఈ వారంలోనే వెల్లడి కానుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీత దర్శకుడు. ఈ సంగతి ఇలా ఉంచితే... వైజయంతీ మూవీస్ పై అశ్వనీదత్ నిర్మించిన చిరంజీవి-శ్రీదేవిల 'జగదేకవీరుడు అతిలోకసుందరి' (1990), కీర్తీ సురేష్ 'మహానటి' (2018) చిత్రాలు మే 9న రిలీజై, బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచిన సంగతి గుర్తుండే ఉంటుంది.

సాధించాల్సింది ఎంతో ఉంది

రకుల్ ప్రీత్ సింగ్.. పరిచయం అక్కర్లేని పేరు. అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులతో పాటు బాలీవుడ్ ఆడియన్స్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారామె. 2009లో 'జిల్లీ' సినిమాతో కన్నడ పరిశ్రమలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. కాగా, రకుల్ ప్రీత్‌సింగ్ 'యారియాన్' అనే సినిమాతో హిందీ ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. దివ్య ఖోస్లా కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2014 జనవరి 10న రిలీజైంది. ఈ చిత్రం విడుదలై మంగళవారంతో పదేళ్లయింది. తాను బాలీవుడ్‌లో అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోషల్ మీడియా వేదికగా ఆనందాన్ని వ్యక్తం చేశారు రకుల్ ప్రీత్‌సింగ్. ''ఎన్నో అందమైన కలలతో యంగ్ గర్ల్‌గా పదేళ్ల క్రితం బాలీవుడ్‌లో తొలి అడుగు వేశాను. నా శ్రమ, పట్టుదలతో ఇంత పెద్ద స్థాయికి చేరుకున్నాను. ఒక నటిగా నేను సాధించాల్సింది ఇంకా చాలా ఉంది. ఇందుకోసం మరింత ఉత్సాహంగా పని చేస్తాను. నేనీ స్థాయికి చేరుకోవడానికి సాయపడిన వారికి కృతజ్ఞతలు. 'యారియాన్'లో వర్క్ చేసినందుకు సంతోషిస్తున్నా'' అంటూ ఆ సినిమా ఫొటోని జత చేసి షేర్ చేశారు రకుల్. కాగా హిందీలో పదేళ్లు పూర్తి చేసుకున్న రకుల్‌కి ఫ్యాన్స్ శుభాకాంక్షలు చెప్పారు. ఇదిలా ఉంటే నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ పెళ్లి ఫిబ్రవరిలో గోవాలో జరగనుందని టాక్.



● రకుల్

కంగువా కంప్లీట్



● సూర్య

సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'కంగువా'. ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌లో దిశా పటానీ హీరోయిన్. శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. కాగా 'కంగువా' సినిమాలో తన క్యారెక్టర్ షూటింగ్‌ను పూర్తి చేశారు సూర్య. ''కంగువా' సినిమాకు సంబంధించి నా లాస్ట్ షాట్ పూర్తయింది. 'కంగువా' నాకెంతో స్పెషల్ ఫిల్మ్. దర్శకుడు శివ అండ్ టీమ్‌తో ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందంటే కుటుంబాన్ని మిస్ అవుతున్న ఫీలింగ్ కలుగుతోంది'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు సూర్య. విభిన్న కాలాల్లో జరిగే 'కంగువా' సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని, తొలి భాగం ఈ ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానుందని కోలీవుడ్ సమాచారం.

ఒక మాస్ హీరోలా ఫైట్ చేశా! - వరలక్ష్మీ శరత్‌కుమార్




"హను-మాన్' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి సార్ నా పని గురించి, నా నటన గురించి చాలా పాజిటివ్‌గా మాట్లాడారు. 'నీలాంటి ప్రతిభ ఉన్న నటి తెలుగు చిత్రపరిశ్రమలో ఉండాలి.. హైదరాబాద్‌లోనే ఉండు' అని ఆయన చెప్పడంతో ఇన్నాళ్ల నా కష్టానికి ఒక అవార్డు వచ్చిందని సంతోషంగా అనిపించింది. సహ నటీనటుల గురించి అలా మాట్లాడాలంటే ఎంతో మంచి మనసుండాలి. ప్రీ రిలీజ్ వేడుక అయిన తర్వాత కృతజ్ఞతలు చెబుతూ ఆయనకు మెసేజ్ చేశాను" అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించిన వరలక్ష్మీ శరత్‌కుమార్ పంచుకున్న విశేషాలు.

● 'హను-మాన్'లో తేజ సజ్జాకి అక్క (అంజమ్మ) పాత్రలో కనిపిస్తాను. ఇది సూపర్ హీరో ఫిల్మ్. ఇందులో తేజ సూపర్ హీరో. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ ఉండే ఫైట్ నాది. అంజమ్మ పాత్ర నా కెరీర్‌లో వైవిధ్యంగా ఉంటుంది. ● తేజ, ప్రశాంత్, నిరంజన్ రెడ్డి గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. నా అంజమ్మ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్రం ప్రేక్షకులను అద్భుతంగా అలరిస్తుంది. నేను ఒక సినిమా చేస్తున్నానంటే అందులో ఏదో కొత్తదనం ఉంటుందనే పేరు వచ్చింది.. ఆ పేరుని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాను.

● ఏ సినిమా చేసినా 'ఇది నా తొలి చిత్రం.. నేను కొత్త' అనే ఆలోచనతో చేస్తాను. విలన్, హీరోయిన్, సైడ్ క్యారెక్టర్ అని చూడను. నా పాత్రకి ప్రాధాన్యత ఉంటే ఏదైనా చేస్తాను. కొంతమందికి నా పేరు తెలియదు. వాళ్లు నేను చేసిన పాత్రలతో జయమ్మ, భానుమతి అని పిలుస్తారు.. అదే నాకు అసలైన అవార్డ్. హిందీ, బెంగాలీలో అవకాశాలు వచ్చాయి. కానీ పాత్రలు నచ్చకపోవడం, డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేదు. మా నాన్న (శరత్ కుమార్) నా ప్రతి సినిమా చూసి, నా నటన గురించి చెబుతారు. 'కోట బొమ్మాళి పీఎస్'లో నా పాత్రకి ఆయన ఎలాంటి వంక పెట్టలేదు.. చాలా బాగా చేశావని అభినందించారు. ప్రస్తుతం సుదీప్‌గారితో 'మ్యాక్స్', ధనుష్‌గారితో 'డీ 50'లో చేస్తున్నాను. మరికొన్ని తెలుగు, తమిళ చిత్రాలు చర్చల్లో ఉన్నాయి.

ఒక అసాధ్యమైన ప్రేమకథ



● షాహిద్ కపూర్, కృతీ సనన్

షాహిద్ కపూర్, కృతీ సనన్ జంటగా నటించిన చిత్రానికి 'తేరీ బాతో మే ఐసా ఉల్జా జియా' (నీ మాటలతో నేను మైమరిచా అని అర్థం) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'యాన్ ఇంపాజిబుల్ లవ్‌స్టోరీ' (ఒక అసాధ్యమైన ప్రేమకథ) అనేది ఈ సినిమా ఉపశీర్షిక. జియో స్టూడియోస్, దినేష్ విజయ్ ఈ సినిమాను నిర్మించారు. అమిత్ జోషి, ఆరాధన షా ద్వయం ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కాగా బుధవారం టైటిల్‌ను ప్రకటించి, సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ''ఈ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఓ అసాధ్యమైన ప్రేమకథను థియేటర్స్‌లో మీరు (ప్రేక్షకులు) అనుభూతి చెందుతారు'' అని యూనిట్ పేర్కొంది. రెండు రోబోలు ప్రేమించుకుంటే? ఓ మనిషి ఓ రోబోతో ప్రేమలో పడితే ఏమౌతుంది? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందని బాలీవుడ్ సమాచారం.

హృదయాలను ధైర్యంతో నింపుకోండి! - నటి ఏంజెలా బాసెట్



● కరోల్ లిటిల్టన్, మెల్ బ్రూక్స్, ఏంజెలా బాసెట్, మిచెల్ సాటర్

ఆస్కార్ అకాడమీ పద్నాలుగో ఆనరరీ అవార్డుల ప్రదానం అమెరికాలో జరిగింది. 2023 సంవత్సరానికిగాను నటి ఏంజెలా బాసెట్, నటుడు-రచయిత-ఫిల్మ్ మేకర్ మెల్ బ్రూక్స్, ఫిల్మ్ ఎడిటర్ కరోల్ లిటిల్టన్, సన్‌డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మిచెల్ సాటర్‌లకు ఈ అవార్డులను ప్రదానం చేసింది అకాడమీ. అయితే ఈ వేడుక గత ఏడాది నవంబరు 18న జరగాల్సింది. కానీ హాలీవుడ్‌లో రచయితలు, నటీనటులు చేసిన సమ్మెల కారణంగా ఈ వేడుక వాయిదా పడింది. తాజాగా ఈ అవార్డు ప్రదానోత్సవం అమెరికాలో జరిగింది. ఈ గౌరవ పురస్కారాల అవార్డు విభాగంలో రెండో అవార్డును గెలుచుకున్న బ్లాక్ లేడీగా నిలిచారు ఏంజెలా బాసెట్. తొలిసారిగా నటి సిసిలీ టైసన్ ఈ గౌరవాన్ని పొందారు. ''ఈ విభాగంలో నేను అవార్డు అందుకున్నందుకు ఆమె (సిసిలీ) స్వర్గంలో ఆనందంగా ఉండి ఉంటారు. నా తోటి బ్లాక్ యాక్టర్స్ అందరికీ చెబుతున్నాను. మీ హృదయాలను ధైర్యంతో నింపుకోండి. ధృడంగా ఉండండి'' అంటూ అవార్డు అందుకున్న అనంతరం ఏంజెలా బాసెట్ ఉద్వేగంగా ప్రసంగించారు. ''మీ సహచరులు మీ పనిని మెచ్చుకున్నప్పుడు మరియు వారు ఈ బంగారు విగ్రహంతో అభినందించినప్పుడు కలిగే ఆనందమే వేరు. ఈ పురస్కారానికి నా మనసులో ఎప్పటికీ గౌరవం ఉంటుంది. అందుకే ఈ అవార్డును అమ్మను సుమా..'' అని చమత్కరించారు మెల్ బ్రూక్స్. ఈ వేడుకలో టామ్ హాంక్స్, జూలియన్నే మూర్, మార్గొట్ రాబీ, కోల్మన్ డొమింగో వంటి హాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... చిత్రసీమకు విశిష్టమైన సేవలు అందించిన వారికి ఈ హానరరీ అవార్డులను ప్రదానం చేస్తుంటారు. మరోవైపు ఈ ఏడాది మార్చిలో 96వ ఆస్కార్ అవార్డుల వేడుక లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. జనవరిలో నామినేషన్స్ వెల్లడి కానున్నాయి.